జూన్
2025

సంపుటి : 21 సంచిక : 1

230

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

సాధించిన విజయాలను
సంఘటితం చేసుకోలేకపోయాం
పహల్గామ్ దాడి: కాశ్మీర్‌లో అంతా బాగుందా?
యుద్ధంపై టెలివిజన్ వార్తల ప్రహసనం
2వ ప్రపంచ యుద్ధంలో బెర్లిన్ పతనం, నాజీల ఓటమి
యూరప్‌లో మళ్లీ ఫాసిస్టుల సవాళ్లు
గజనీ మహమ్మద్ దాడులు: నేపథ్యం- పర్యవసానాలు
వ్యక్తిగత జీవితాలపై ప్రభుత్వ నియంత్రణ
చంద్రబాబు నోట మోడి మాట
ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాసైన్స్ ఉద్యమం
కళాతపస్వి డా॥ గరికపాటి రాజారావు

# కళాతపస్వి డా॥ గరికపాటి రాజారావు

పిబి చారి

వృత్తి రీత్యా ఆయన ఒక డాక్టర్.. ప్రవృత్తి ఆయన రంగస్థలం కళాకారుడు. నాటక ప్రయోక్త, నటుడు, నట శిక్షకుడు, నాటక సంస్థల నిర్వాహకుడు, రచయిత, ఎంతోమంది కళాకారులకు రంగస్థలం జీవితం ఇచ్చిన కళా ప్రపూర్ణుడు. ఆయన సినిమా నిర్మాత, దర్శకుడు, హీరో కూడా. అన్నిటికన్నా మించి మానవత్వం, దయార్ద్ర హృదయం, దేశభక్తి, ప్రజాసేవ యే ధ్యేయంగాకలిగిన వాడు. అసలు సిసలైన ప్రజా వైద్యుడు, నికార్సైన కమ్యూనిస్టు కార్యకర్త. ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి గరికపాటి రాజారావు గారి జీవితం నిరంతర స్ఫూర్తి. నేటి సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రతరమై, సంపద మొత్తం కొద్దిమంది చేతుల్లో పోగు పడిన వేళ, విద్వేష పూరిత మతతత్వం రాజ్యమేలుతూ, ప్రజాతంత్ర ఉద్యమాలకు, మానవ సంబంధాలకు కొత్త అర్థాలు చెబుతున్న వేళ, డాక్టర్ గరికిపాటి రాజారావు గారు మనకు అందించిన స్ఫూర్తిని అందుకొని ముందుకు నడవాలి. కర్తవ్యాన్ని నిర్దేశించుకోవాలి. ఆయన కళను, పోరాటానికి అనుసంధానం చేసిన తీరును అధ్యయనం చేయాలి. మార్క్సిజాన్ని అధ్యయనం చేసి ప్రజల కోసం జీవించాలన్న చైతన్యాన్ని అందించారు. ఆ రోజుల్లో క్విట్ ఇండియా పిలుపుతో భారత స్వాతంత్ర పోరాట జ్వాలలు ఒకవైపు, ప్రపంచ ప్రజల పైన విరుచుకుపడుతున్న హిట్లర్ ఫాసిజం ఇంకోవైపు, బెంగాలను మరుభూమిగా మార్చిన బెంగాల్ కరువు మరోవైపు, దేశంలో అనేక సంస్థానాల్లో రగులుతున్న ఉద్యమాల వెల్లువ, తెలంగాణ నేలపై నిజాం నర్కారుకు వ్యతిరేకంగా సాగుతున్న రైతాంగ సాయుధ తిరుగుబాటు లాంటి పోరాట సమయంలో ఒక సాంస్కృతిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి ముందుకు సాగినవాడు డాక్టర్ గరికిపాటి రాజారావు గారు. ఆయన ఏం చేసినా, ఏమి వ్రాసినా, ఏమి ప్రదర్శించినా ప్రజలు, ప్రజలు, ప్రజలు, ప్రజా సమస్యలు, ఇవే ఆయన నిరంతరం జపించినవి, తపించినవి, శ్వాసించినవి, జీవించినవి. ప్రజాసేవలో వృత్తిని ప్రవృత్తిని ప్రజలకు అంకితం చేయటంలో ఆయన తన సొంత కుటుంబాన్ని, సొంత ఆర్థిక పరిస్థితిని కూడా పట్టించుకోని నిస్వార్థతకు పరాకాష్టగా నిలిచారు. తెలుగు నాట రంగస్థలం నాటక రంగంలోనూ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక చరిత్రలోనూ, చెరిగిపోని అధ్యాయాలకు ఒక కథానాయకుడుగా నిలిచిన డాక్టర్ గరికిపాటి రాజారావు గారి

**గరికపాటి రాజారావు**

00.02.1914 – 08.09.1963



జీవితంలోని వెలుగునీడలను గురించి తెలుసుకుందాం.

కోటయ్య దేవర, సోమలింగం దంపతులకు 1915 ఫిబ్రవరి 5వ తారీఖున డాక్టర్ గరికపాటి రాజారావు గారు రాజమండ్రిలో జన్మించారు. రాజారావు గారి సోదర సోదరీలు మొత్తం ఐదుగురు. ముగ్గురు అమ్మాయిల తర్వాత జన్మించిన పెద్దబ్బాయి రాజారావు గారు. డాక్టర్ రాజారావు గారి బాల్యమంతా కూడా సికింద్రాబాద్ లోనే గడిచింది. వాళ్ల నాన్నగారు అయిన కోటయ్య దేవర సికింద్రాబాద్ లోని లాలాగూడ వర్క్ షాప్ లో సూపర్వైజర్ గా పని చేస్తుండేవారు. వాళ్ల అమ్మగారికి వరుసకి అన్నయ్య అయిన ఒక వ్యక్తి ఉండేవారు ఆయన వేణుగాన విద్వాంసుడు. సురభి నాటక సంస్థల వారికి సంగీతం కూడా నేర్పుతుండేవారు. ఆయన తరచూ వీళ్ళ ఇంటికి రావడంతో, ఆయన సాంగత్యంతో రాజారావు గారికి చిన్నతనం నుండి కూడా లయ జ్ఞానం, లయబద్ధంగా కాళ్లు కదపటం, నృత్యం లాంటివి చేయడం అబ్బింది. రాజారావు గారి ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత విజయనగరంలో నివసిస్తున్న వాళ్ళ మేనమామ సుబ్రహ్మణ్యం గారి దగ్గరకు తరువాతి చదువులకు పంపించారు. వీళ్ళ మేనమామ గారు విజయనగరంలో కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తుండేవారు. ఆ రోజుల్లోనే పీహెచ్డీ చేశారు. సర్ సివి రామన్ గారికి సహచర విద్యార్థి కూడా. రాజారావుగారు విజయనగరంలోఎస్.ఎస్.ఎల్.సి.వరకు చదువుకున్నారు కళలకు పుట్టిల్లు అయిన విజయనగరంలో చాలా జానపద కళా ప్రదర్శనలు, హరికథలు వంటివి ఎక్కువగా జరుగుతూ ఉండేవి. చిన్నతనం నుండి వాటన్నింటినీ దగ్గరగా చూస్తూ పెరిగిన వాడు రాజారావు గారు. అక్కడ ఒకసారి ఆదిభట్ల నారాయణ దాసు గారి హరికథ జరుగుతూ ఉంటే ఈ కుర్రాడుగా ఉన్న రాజారావు కూడా లయబద్ధంగా నర్తిస్తూ ఉండటం చూసి, నారాయణ దాసు గారు నువ్వు భవిష్యత్తులో మంచి నటుడు అవుతావు అని దీవించారు. హైస్కూలు లో చదువుతున్న రోజుల్లోనే హరిచంద్ర నాటకంలో మాతంగి వేషం వేసి మొట్టమొదటిసారిగా రంగస్థలం ఎక్కారు రాజారావు గారు. విజయనగరంలో చదువు పూర్తి అయిన తర్వాత అమ్మానాన్నల దగ్గరికి సికింద్రాబాద్ చేరుకున్నాడు. తండ్రిగారు చేస్తున్న లాలాగూడ వర్క్ షాప్ లోనే రాజారావు గారిని కూడా గుమస్తాగా చేర్పించారు వాళ్ళ నాన్నగారు. అదే సమయంలో ఆయనకు నాగేశ్వరమ్మ గారితోవివాహం జరిగింది. రాజారావు గారికి ముగ్గురు సంతానం.

కొంతకాలం తర్వాత పై అధికారి ఇబ్బందులకు గురి చేయడంతో అది సమంజసంగా లేక ఆ ఉద్యోగం వదిలి స్వతంత్రంగా బ్రతికే విద్య ఏదైనా నేర్చుకోవాలని రాజారావు గారు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మద్రాసు వెళ్లారు. తన

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. కళాతపస్వి డా॥ గరికపాటి రాజారావు
పిచి చారి.........2

2. సాధించిన విజయాలను సంఘటితం చేసుకోలేకపోయాం
ఎంఎ బేబీ.....4

3. పహల్గామ్ దాడి: కాశ్మీర్‌లో అంతా బాగుందా?
గౌహర్ గీలాని...... 7

4. యుద్ధంపై టెలివిజన్ వార్తల ప్రహసనం
సందీప్ భూషణ్ ...... 11

5. 2వ ప్రపంచ యుద్ధంలో బెర్లిన్ పతనం, నాజీల ఓటమి
ప్రబీర్ పుర్కాయస్థ ......14

6. యూరప్‌లో మళ్లీ ఫాసిస్టుల సవాళ్లు
సుసన్ రామ్ ........15

7. గజనీ మహమ్మద్ దాడులు: నేపథ్యం-పర్యవసానాలు
ఎంవిఎస్ శర్మ.........17

8. వ్యక్తిగత జీవితాలపై ప్రభుత్వ నియంత్రణ
టికె రాజలక్ష్మి.........21

9. చంద్రబాబు నోట మోడి మాట
ఎ కోటిరెడ్డి.........25

10. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాసైన్స్ ఉద్యమం
వి బాలసుబ్రమణ్యం........28



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ఆపరేషన్ సిందూర్

**కా**శ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన అతి క్రూరమైన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించి అమలు పరిచిన "ఆపరేషన్ సిందూర్", అమెరికా ముందు మోడీ ప్రభుత్వ లొంగుబాటును లోకానికి వెల్లడించడంతోపాటు ఈ మొత్తం వ్యవహారంలో అనేక సందేహాలను లేవనెత్తుతున్నది. దేశ భక్తి పేరుతో ఈ సందేహాలను అణచి వేసే ప్రయత్నాలు మరోవైపు జరుగుతున్నాయి.

పహల్గామ్‌లో 26 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల క్రూర చర్యను దేశంలో రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించారు. ఇంతటి క్రౌర్యానికి ఒడిగట్టిన ఉగ్రవాదులను సప్త సముద్రాల మధ్య ఎక్కడున్నా పట్టుకుని శిక్షిస్తామని ప్రధాని మోడీ, కేంద్ర నాయకులు ప్రకటించారు. దీనిపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి హాజరైన అన్ని రాజకీయ పార్టీలూ ఉగ్రవాద చర్యను ఏక కంఠంతో ఖండించాయి. ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాయి. కానీ ఇంతటి ముఖ్యమైన సమావేశానికి ప్రధాన మోడీ మాత్రం హజరు కాలేదు ఎందుకో ఎవరికీ తెలియదు. దేశానికి అత్యున్నత వేదిక అయిన పార్లమెంటునూ సమావేశ పరచలేదు.

మే 7వ తేదీన భారత ప్రభుత్వం "ఆపరేషన్ సిందూర్" పేరుతో సైనిక చర్య ప్రారంభించింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపైనా, పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు మద్దతిచ్చే కేంద్రాలపైనా గురితప్పకుండా దాడులు చేశామని సైన్యం ప్రకటించింది. భారత సైనిక దాడికి ప్రతిగా పాకిస్తాన్ మే 10వ తేదీన "ఆపరేషన్ బన్యాన్ ఉమ్ మర్సూస్" పేరుతో సైనిక చర్యకు దిగింది. భారత దేశానికి చెందిన రఫేల్ యుద్ధ విమానాలతో సహా ఆరు విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రకటించగా భారత్ దాన్ని ఇదమిద్ధంగా ఖండించలేకపోతోంది. పాకిస్తాన్‌లోని అనేక సైనిక స్థావరాలను ధ్వంసం చేశామని భారత్ ప్రకటించింది. బ్రహ్మోస్ క్షిపణుల దాడిని సరిగ్గా ఎదుర్కోలేపోయామని పాక్ ప్రధాని అంగీకరించారు.


యుద్ధంలో మొట్టమొదట చనిపోయేది సత్యం అని రాజనీతిజ్ఞులు చెబుతారు. సైనిక నష్టాల ప్రకటనలు ఎలా ఉన్నప్పటికీ రెండు దేశాలకు చెందిన సరిహద్దుల్లో అనేక మంది సామాన్య పౌరులు బాంబు దాడులకు ప్రాణాలు వదిలారు, ఇళ్లు ధ్వంసమైనాయి. పాఠశాలలు మూతపడ్డాయి. పౌర జీవనం స్తంభించిపోయింది. ప్రజలు పునరావాస కేంద్రాల్లోనూ, బంకర్లలోనూ తలదాచుకోవలసిన దుస్థితి ఏర్పడింది.

ఇంతలో మే 10వ తేదీన రెండు దేశాలూ కాల్పుల విరమణ ప్రకటించాయి. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం ప్రకటించక ముందే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేనే రెండు దేశాలనూ గట్టిగా హెచ్చరించాను, యుద్ధం ఆపకపోతే వ్యాపారం బంద్ అన్నాను, దాంతో ఇరు దేశాలూ యుద్ధాన్ని బంద్ చేశాయి అని ప్రకటించాడు. రెండు దేశాల మధ్య కాశ్మీర్ సమస్య పరిష్కరించడానికి సిద్ధమేనని మరోసారి ఆయన ప్రకటించాడు. ఒక దేశాధ్యక్షుడు, అందునా ప్రపంచంలోనే పెద్దన్న ఇలాంటి ప్రకటన చేసినా కూడా మోడీ దాన్ని ఖండించడానికి నోరు తెరవలేదు.

ఉగ్రవాద చర్యపై రెండు సార్లు జరిగిన అఖిల పక్ష సమావేశానికి ప్రధాని హాజరు కాలేదు. ఇంతటి ముఖ్యమైన ఘటనపై పార్లమెంటు సమావేశం జరపాలని ప్రతిపక్షాలు ఎంతగా డిమాండ్ చేసినా జరపలేదు. ట్రంప్ మధ్యవర్తిత్వం నిజమేనా? అయితే భారత్-పాక్‌ల మధ్య సిమ్లా ఒప్పందం సంగతేంటి? కాశ్మీర్ సమస్యలో, భారత్-పాక్ వ్యవహారాల్లో ట్రంప్ తలదూర్చడమంటే సిమ్లా ఒప్పందానికి తూట్లు పొడవడమే కాదు, కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసినట్లు కాదా? ఇంతకీ ఈ ఆపరేషన్‌లో 26 మంది భారత పౌరులను చంపిన ఉగ్రవాదులు పట్టుబడ్డారా? వారిని పట్టుకుని శిక్షిస్తామన్న వాగ్దానం ఏమైంది? మన దేశానికి చెందిన రఫేల్ యుద్ధ విమానాలతో సహా అనేక విమానాలను కూల్చివేశామన్న పాకిస్తాన్ ప్రకటనను ఎందుకని భారత దేశం నిర్దిష్టంగా ఖండించలేకపోతోంది?.... ఈ ప్రశ్నలన్నిటిపై సరైన, పారదర్శకమైన చర్చ జరిగి దేశ ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలంటే పార్లమెంటు సమావేశాలు జరపడమొక్కటే మార్గం. కానీ ఆ ప్రజాస్వామిక మార్గాన్ని మూసివేసిన బిజెపి నాయకత్వం, మీడియాను ఉపయోగించుకుని యుద్ధం ద్వారా రాజకీయ లబ్ది పొందడానికి ప్రయత్నిస్తోంది. నిజానికి 'ఆపరేషన్ సింధూర్' పేరులోనే బిజెపి-ఆరెస్ఎస్ సైద్ధాంతిక ఎజెండా దాగి ఉంది. రానున్న బీహార్, తదితర రాష్ట్రాల ఎన్నికల్లో దీన్ని ఒక ఆయుధంగా వాడుకోడానికి ఇప్పటి నుండే సన్నాహాలు చేస్తోంది. అందుకే దీనిపై అనుమానాలు వ్యక్తం చేసిన వారందరినీ దేశద్రోహులుగా ముద్ర వేయడానికి ప్రయత్నిస్తోంది. ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్డీఏ కూటమి పార్టీలు కూడా ఇదే వైఖరిని ప్రదర్శిస్తున్నాయి.

బిజెపి-ఆర్ఎస్ఎస్ ఆటలు సాగనివ్వకూడదు. సైనిక చర్య వెనుక అమెరికా సామ్రాజ్యవాదుల జోక్యం ఎంత? మోడీ లొంగుబాటు ఎంత? తేల్చాలి. అన్ని విషయాలపై పార్లమెంటులో పారదర్శక చర్చ జరగాలని నిలదీయాలి. యుద్ధం అయిపోయింది. ఇప్పుడు నిజానికీ-అబద్ధానికీ మధ్య యుద్ధం జరగాలి. నిజం గెలవాలి.

# సాధించిన విజయాలను సంఘటితం చేసుకోలేకపోయాం



**ఎంఎ బేబీ**

**(ఈ సంవత్సరం ఏప్రిల్ 2 నుండి 6వ తేదీ వరకు మదురైలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మహాసభలో ఎంఎ బేబిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గతంలో పార్లమెంటు సభ్యునిగా, కేరళ రాష్ట్ర విద్యా, సాంస్కృతిక శాఖామంత్రిగా పని చేసిన బేబి నిర్మాణాంశాలలో అపారమైన అనుభవాన్ని గడించారు. సిపిఐ(ఎం) ప్రజా పునాదిలో ఏర్పడిన స్తబ్దత, పార్లమెంటరీ విధానం వలన వచ్చిన వినాశకర పరిణామాలు, పార్టీ స్వతంత్ర శక్తిని పెంచుకోవటం, ప్రజలతో సజీవ సంబంధాలను ఏర్పరచుకోవటం, హిందుత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నింటినీ సమీకరించటానికి కృషి చేయవలసిన అవసరాన్ని గురించి ఆయన ఫ్రంట్‌లైన్ ప్రతినిధి టి కె రాజ్యలక్ష్మికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను పాఠకులకు అందిస్తున్నాం...సంపాదకుడు.)**

**గత మహాసభ తర్వాత సిపిఐ(ఎం) స్వతంత్ర బలం, రాజకీయ పలుకుబడిలో చెప్పుకోదగిన మార్పు రాలేదని పార్టీ 24వ మహాసభలో అంగీకరించారు. ఇందుకు దారితీసిన కారణాలను వివరిస్తారా?**

పార్టీ 23వ మహాసభ ఆమోదించిన రాజకీయ, ఎత్తుగడల పంథాను సమీక్షించిన 24వ మహాసభ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్-మతోన్మాద ప్రభుత్వం అని వేసిన అంచనా సరైనదేనని, దాని ప్రమాదంపై కేంద్రీకరించాలన్నది సరైనదేనని నిర్ణయించింది. మరోవైపున రాజకీయ-ఎత్తుగడల పంథాలోని ఇతర అంశాలు అంటే బిజెపికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవటం కోసం చేస్తున్న పోరాటంతో అనుసంధానం చేయటంలో జరిగిన లోపాలను కూడా అంగీకరించింది.

పార్టీ బలం, ప్రజా పునాది స్తంభించి పోయాయని 17 మహాసభలోనే అంచనా కొచ్చాం. ఈ స్తంభన క్షీణతగా మారుతున్నదని తర్వాతి మహాసభలలో నిర్ధారణ చేశాం. పశ్చిమబెంగాల్, త్రిపురలలో ప్రజాపునాది, పలుకుబడి క్షీణించటంతో పరిస్థితి సున్నితంగా మారింది.

పార్టీని బలపరచాలని 23వ మహాసభ ఇచ్చిన పిలుపును అమలు చేయటంలో విఫలమయాం. ప్రజలతో సజీవ సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని, స్థిరంగా ప్రజా పోరాటాలను పెంపొందించాలని, ఈ పోరాటాలను సంఘటితం చేసుకోవటం ద్వారా మన రాజకీయ పలుకుబడిని పెంచుకోవాలని మహాసభ పిలుపు ఇచ్చింది. స్థానిక స్థాయిలో కేంద్రీకరించాలని చెప్పింది.

"గత మూడు సంవత్సరాలలో వర్గ, ప్రజా పోరాటాలను విస్తృతంగా పెంపొందించటం లో విఫలమైనాం. స్థానిక సమస్యలపై స్థిరంగా పోరాటాలు చేయటంలో వైఫల్యం ఎక్కువగా ఉన్నది" అని రాజకీయ సమీక్షా నివేదికలో అంగీకరించాం. నయా-ఉదారవాద విధానాలను నిరంతరం అనుసరించటం వలన వచ్చిన ఆర్థిక-సామాజిక మార్పులను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో మేం సక్రమంగా అంచనా వేయలేకపోవటం, అందుకు అనుగుణంగా నూతన నినాదాలు, ఎత్తుగడలను రూపొందించటంలో విఫలం కావటం ఇందుకు ప్రధానమైన కారణాలలో ఒకటని సమీక్షలో పేర్కొన్నాం. పాత పద్ధతిలోనే పని చేయటానికి, కొత్తగా వస్తున్న సమస్యలను తీసుకోవటంలో విఫలం కావటానికి ఇది దారి తీస్తున్నది. "పార్టీని పట్టి పీడిస్తున్న పార్లమెంటరీ భ్రమలు" స్థానికంగా వర్గ, ప్రజా పోరాటాలను నిర్మించలేకపోవటానికి కారణం. ఇది రాజకీయ కార్యక్రమాలన్నింటినీ ఎన్నికల కార్యకలాపాలుగా దిగజారుస్తున్నది. కానీ అది ఒక్కటి మాత్రమే కారణం కాదు.

**ఆర్థిక సంక్షోభం, వాణిజ్య యుద్ధాలు తీవ్రమౌతున్న కాలంలో 24వ మహాసభ జరిగింది. ఈ సమస్యలను మీరెలా ఎదుర్కొంటారు?**

నరేంద్ర మోడి ప్రభుత్వం నయా-ఉదారవాద విధానాల అమలును తీవ్రం చేయటం వలన ప్రభుత్వ వనరులు పెద్ద మొత్తంలో గుత్త పెట్టుబడిదారుల చేతుల్లోకి, ముఖ్యంగా ఆశ్రిత పెట్టుబడిదారులైన అదాని, అంబాని వంటి కార్పొరేట్ గ్రూపుల చేతుల్లోకి వెళుతున్నాయన్న వాస్తవాన్ని మేం గమనించాం. ప్రభుత్వరంగ సంస్థలను ఒక క్రమ పద్ధతిలో ప్రైవేటీకరిస్తున్నారు. తద్వారా భారతదేశ స్వావలంబనను బలహీనపరుస్తూ, ప్రజలకు అత్యవసర సేవలను అందుబాటులో లేకుండా చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద నమూనా రికార్డు స్థాయిలో అసమానతలు పెరగటానికి కారణమౌతున్నాయని మహాసభ నొక్కి చెప్పింది. కొద్దిమంది శత కోటీశ్వరుల ఆస్తులు అసాధారణంగా పెరుగుతుండగా, మరోవైపున వేతనాలు స్థంభించిపోవటం, కుటుంబ ఆదాయాలు క్షీణించటం జరుగుతున్నది. జిడిపి ఎక్కువగా పెరుగుతున్నదని అంచనాలు వేస్తున్నప్పటికీ దేశంలో భారిస్థాయిలో

నిరుద్యోగం, ప్రత్యేకంగా విద్యావంతులైన యువకులను పట్టి పీడిస్తుందన్న అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావటానికి మహాసభ ప్రయత్నించింది.

ఈ పరిస్థితులను మార్చాలని, స్వయం సమృద్ధ, ప్రజానుకూలమైన విధానాలను అమలు చేయటం ద్వారా అభివృద్ధిని సాధించాలని మహాసభ పిలుపునిచ్చింది. ఇందుకోసం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ప్రవాహాలను క్రమబద్ధీకరించాలని, సహజ ఆయిల్ వనరులు, గనులను జాతీయకరణ చేయాలని, సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించాలని, బడా గుత్తసంస్థలపై ఆంక్షలు విధించాలని, ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేయాలని మహాసభ చెప్పింది. సంపదను పున:పంపిణి చేయటం కోసం తీసుకునే ద్రవ్య, పన్నులు విధించే చర్యలు, సమగ్రమైన భూ సంస్కరణలు, వ్యవసాయ సంబంధాలలో ప్రజాస్వామిక మార్పులు తీసుకురావటాన్ని పార్టి బలపరుస్తున్నది.

మనదేశ సరుకులపై అమెరికా విధిస్తున్న సుంకాలపై మోడి ప్రభుత్వం లొంగబాటు విధానంతో వ్యవహరిస్తున్నది. మోడి-ట్రంప్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించటానికి బిజెపి ప్రభుత్వం భయపడు తున్నదన్న వాస్తవం వెల్లడౌతున్నది. అది ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కొన్ని అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించింది. దీని తర్వాత గూగుల్ లాంటి అమెరికా సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ప్రయోజనం కలిగించటం కోసం 6 శాతం డిజిటల్ టాక్స్‌ను రద్దు చేస్తూ ద్రవ్యబిల్లుకు నిర్మలా సీతారామన్ సవరణ ప్రతిపాదించింది.

**వామపక్షాలు ప్రజల సమస్యలు తీసుకొంటున్నప్పటికీ తమ నిర్మాణ బలాన్ని విస్తరించుకోలేకపోతున్నాయని, తమకు ప్రజల నుండి లభించే మద్దతును లేదా ఎన్నికలలో బలాన్ని పెంచుకోలేకపోతున్నాయన్న అభిప్రాయం ఉన్నది. ఇందుకు మీరు చెప్పే కారణాలు ఏమిటి?**

సిపిఐ(ఎం), దాని సభ్యులు నాయకత్వం వహిస్తున్న ప్రజాసంఘాలు స్వతంత్రంగానూ, వామపక్షాలతో కలిసి ఉమ్మడి గానూ ప్రజా సమస్యలను తీసుకొంటున్నాయి. ఈ ఉద్యమాలలో కొన్ని ప్రజలకు రాయితీ లివ్వక తప్పని పరిస్థితిని ప్రభుత్వానికి కల్పించాయి. కాని ఇంతకు ముందే చెప్పినట్లుగా ఈ విజయాలను సంఘటితం చేసుకోవటంలో

**"ఇండియా కూటమి పార్టీలతో పార్లమెంటులో, అంగీకృత అంశాలపై పార్ల మెంటు వెలుపల సిపిఐ(ఎం) సహకరిస్తుంది. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నియంతృత్వ దాడులు జరుగుతున్నపుడు అన్ని లౌకిక, ప్రజాస్వామిక శక్తులతో చేతులు కలుపుతానని రాజకీయ తీర్మానంలో పార్టీ స్పష్టంగా పేర్కొంది. రాజకీయ విధానాన్ని అమలు జరపటంలో భాగంగా బిజెపి వ్యతిరేక ఓట్లన్నింటినీ గరిష్ఠంగా సమీకరించే ఎత్తుగడలను పార్టీ అనుసరిస్తుంది."**




వైఫల్యం ఉన్నది. ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ పరిస్థితులు విసురుతున్న సవాళ్ళను అధిగమించటానికి ఈ కృషి సరిపోవటం లేదని మేం గమనించాం.

**"ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న", కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న "హిందుత్వ శక్తుల ప్రతీఘాతుక ఎజెండా"ను ప్రతిఘటించాల్సిన ప్రాముఖ్యతను గురించి ముసాయిదా రాజకీయ తీర్మానంలో నొక్కి చెప్పారు. వీటికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎటువంటి ఎత్తుగడలను అనుసరించాలని సిపిఐ(ఎం) భావిస్తున్నది?**

"బిజెపి, హిందుత్వ శక్తులను ఒంటరి చేసి ఓడించటానికి హిందుత్వ సిద్ధాంతం, మతోన్మాద శక్తుల కార్యకలాపాలకు'' వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేయటం అవసరమని 24వ మహాసభ ఆమోదించిన ''రాజకీయ విధానం'' నొక్కి చెప్పింది. ఇందుకోసం హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా అన్ని లౌకిక శక్తులను విస్తృతంగా సమీకరించాలని అది పిలుపు నిచ్చింది.

ఇండియా కూటమి పార్టీలతో పార్లమెంటులో, అంగీకృత అంశాలపై పార్ల మెంటు వెలుపల సిపిఐ(ఎం) సహకరిస్తుంది. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నియంతృత్వ దాడులు జరుగుతున్నపుడు అన్ని లౌకిక, ప్రజాస్వామిక శక్తులతో చేతులు కలుపుతానని రాజకీయ తీర్మానంలో పార్టీ స్పష్టంగా పేర్కొంది. రాజకీయ విధానాన్ని అమలు జరపటంలో భాగంగా బిజెపి వ్యతిరేక ఓట్లన్నింటినీ గరిష్ఠంగా సమీకరించే ఎత్తుగడలను పార్టీ అనుసరిస్తుంది.

**వామపక్షాల అభివృద్ధికి బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులు సవాలుగా ఉన్నాయని భావిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలలో పెద్దదిగా ఉన్న మీ పార్టీ ఏ విధంగా ముందుకు పోవాలని ప్రతిపాదిస్తున్నది?**

మీరు సరిగా చెప్పినట్లుగానే వామపక్షాలలో పెద్దదిగా ఉన్న మా పార్టీ వామపక్షాల ఐక్యతను పెంపొందించటానికి నాయకత్వం వహిస్తుంది. దురదృష్టవశాత్తు లోక్‌సభ ఎన్నికల కోసం విస్తృత ఐక్యతను నిర్మించే కృషి వలన ఈ మధ్యకాలంలో ఇందులో కొంత స్తబ్దత చోటు చేసుకున్నది. ఐక్య వామపక్షం జాతీయ రాజకీయాలలో మరింత ఎక్కువగా జోక్యం చేసుకోవాలన్న విషయంలో సిపిఐ(ఎం) స్పష్టమైన వైఖరితో ఉంది. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను బలపరచటానికి ఇది ప్రాతిపదికగా ఉంటుంది.

**ఇండియా కూటమి ఎక్కువ కాలం ఐక్యంగా ఉండదని ఒక భావం ఉన్నది. మీ పార్టీ స్వతంత్రంగా బలపడుతున్నపుడు, ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న బిజెపి-యేతర పార్టీలతో ఎన్నికలు, ఇతర విషయాలలో అవగాహనకు రావటానికి అవకాశం ఉంటుందా?**

బిజెపి వ్యతిరేక ఓట్లను గరిష్ఠంగా సమీకరించే ప్రయత్నంలో భాగంగా ఇండియా కూటమిని ఏర్పాటు చేయటం ఒక ప్రధానమైన

> **❝ నియోజక వర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రం లేదా ప్రాంతానికి అనవసర ప్రయోజనం కల్పించటానికి, జనాభా పెరుగుదలను అరికట్టటంలో విజయవం తంగా కృషి చేసిన రాష్ట్రాలకు నష్టం కలిగేలా చేయటాన్ని సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది. రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న సీట్ల దామాషా తగ్గకుండా, న్యాయమైన, సమతూకంతో కూడిన ప్రాతినిధ్యంతో పార్లమెంటులో ప్రజా ప్రతినిధుల సంఖ్యను పెంచాలని, పెరిగిన సీట్ల సంఖ్య అన్ని రాష్ట్రాల కు సానుకూలంగా ఉండాలని సిపిఐ(ఎం) ప్రతిపాదిస్తున్నది.❞**

చర్య. ఈ విధంగా సమీకరించటం ద్వారా బిజెపి మెజారిటీ సాధించకుండా అడ్డుకున్నాం. ఈ కూటమిలో భాగస్వామిగా ఉన్నపుడు కూడా ఎన్నికల ఎత్తుగడలు ప్రతి రాష్ట్రానికీ వేరుగా ఉంటాయన్న విషయంలో మేం స్పష్టంగా ఉన్నాం. ఒక రాష్ట్రంలో ఒక పార్టీతో అవగాహనన కుదుర్చుకున్న పార్టీ, మరొక రాష్ట్రంలో ప్రత్యర్థి పార్టీతో అవగాహన చేసుకుంటున్నది. కేరళ, పశ్చిమబెంగాల్‌లోని ఏ రాజకీయ కూటమిలోనూ సిపిఐ(ఎం) భాగస్వామి కాదు. కాని బీహార్ లాంటి రాష్ట్రాలలో పరిస్థితి భిన్నంగా ఉన్నది.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు విస్తరించాలని పార్టీ తీర్మానం చేయటం ఇదే మొదటి సారి కాదు. గతంలో కూడా ఈ విధమైన తీర్మానాలు చేశాం. ఎల్‌జిబిటిక్యూల హక్కులపై కూడా గత మహాసభలలో తీర్మానాలు చేశాం. అట్టడుగున ఉన్న ఈ తరగతుల సమస్యలపై కేంద్రీకరించటం, ముందుకు తీసుకురావటం, విశదీకరించటం, వివిధ ఎన్నికల సందర్భంలో పార్టీ ప్రకటిస్తున్న మ్యానిఫెస్టోలలో పేర్కొంటున్నాం.

సామాజిక సమస్యలను తీసుకోవటంతో పాటు కొత్త ప్రాంతాలలో తీసుకోవలసిన సమస్యలను గుర్తించాలని పార్టీ కోల్‌కతా ప్లీనంలోనే నొక్కి చెప్పింది. దాని తర్వాతనే ఈ అంశంపై కేంద్రీకరణ జరిగింది.

**ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య నిధుల పంపకం, నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై వస్తున్న సమస్యలను సిపిఐ(ఎం) ఏ విధంగా చూస్తున్నది?**

ఉత్తర-దక్షిణ రాష్ట్రాలకు చెందిన సమస్యగా సిపిఐ(ఎం) దీనిని చూడటం లేదు. అధికార కేంద్రీకరణ కోసం సమాఖ్య వ్యవస్థపై మోడి ప్రభుత్వం నిరంతరం చేస్తున్నదాడులలో భాగంగా సిపిఐ(ఎం) ఈ సమస్యను చూస్తున్నది. రాష్ట్రాలకు పంచవలసిన




నిధులను సరిగా పంచకపోవటం, వాటికి నిధులు ఇవ్వటానికి తిరస్కరించటం, జిఎస్‌టి పరిహారాన్ని చెల్లించటానికి తిరస్కరించటం అనేక ప్రతిపక్ష ప్రభుత్వాలను తీవ్రమైన సంక్షోభంలోకి నెడుతున్నాయి. “రాష్ట్రాలతో భాగం పంచుకోని సెస్, సర్‌ఛార్జ్‌పై కేంద్రం ఎక్కువగా ఆధారపడటం, పన్నుల ద్వారా వనరులు చేసి, రాష్ట్రాలతో భాగం పంచుకోవాల్సిన నిధుల వాటాను క్రమంగా తగ్గిస్తున్నదని పార్టీ మహాసభ గుర్తించింది. నిధులు తగ్గిపోవటంతో రాష్ట్రాలు రుణాలు తీసుకోవటంపై కూడా పరిమితులు ఏర్పడుతున్నవి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం రాష్ట్రాలు వనరులను సమీకరించటంపై ఇది పరిమితులను విధిస్తున్నది”.

ఇది కేవలం వనరుల పంపకానికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కబళించటానికి గవర్నర్లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని మేం చాలా కాలం క్రితమే గమనించాం. బిజెపి నియమించిన గవర్నర్లు వైస్ ఛాన్సలర్‌లను నియమించటంలో నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయటానికి తిరస్కరించటం, ఇతర వ్యతిరేక చర్యలు తీసుకొంటున్నారు. గతంలో ఈ విధమైన ధోరణులు లేవు. మోడి పాలనలో ఇవి కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

కేంద్రం ప్రతిపాదిస్తున్న ఏకకాల ఎన్నికలు కూడా రాష్ట్రాల హక్కులను తీవ్రంగా కుదిస్తాయి. రాజ్యాంగం గ్యారంటీ చేసిన ఐదు సంవత్సరాల పాలనా కాలాన్ని తగ్గించటంతో పాటు, అధికారాన్ని నిరంకుశంగా కేంద్రీకరణ చేయటానికి దారితీస్తాయి.

నియోజక వర్గాల పునర్విభజనలో ఏ రాష్ట్రం లేదా ప్రాంతానికి అనవసర ప్రయోజనం కల్పించటానికి, జనాభా పెరుగుదలను అరికట్టటంలో విజయవం తంగా కృషి చేసిన రాష్ట్రాలకు నష్టం కలిగేలా చేయటాన్ని సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది. రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న సీట్ల దామాషా తగ్గకుండా, న్యాయమైన, సమతూకంతో కూడిన ప్రాతినిధ్యంతో పార్లమెంటులో ప్రజా ప్రతినిధుల సంఖ్యను పెంచాలని, పెరిగిన సీట్ల సంఖ్య అన్ని రాష్ట్రాలకు సానుకూలంగా ఉండాలని సిపిఐ(ఎం) ప్రతిపాదిస్తున్నది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి సానుకూలంగా, విస్తృతమైన ఏకాభిప్రాయాన్ని సాధించటంలో విఫలమైన పక్షంలో సమాఖ్య వ్యవస్థ సమగ్రతను కాపాడటం కోసం సీట్ల పునర్విభజనపై ఉన్న నిషేధాన్ని పొడిగించాలని డిమాండ్ చేస్తున్నది.

**బీహార్ ఎన్నికలకు ఎక్కువ సమయం లేదు. ఎన్‌డిఎకు ఉమ్మడి ప్రతిఘటన ఇచ్చే విధంగా వామపక్షాలు, ముఖ్యంగా సిపిఐ(ఎం) కీలక పాత్ర నిర్వహించగలదా?**

బీహార్‌లో వామపక్షాలు బలంగా ఉన్నప్పటికీ ఆర్‌జెడి ఇండియా బ్లాక్‌లో అతి పెద్ద పార్టీగా ఉన్నది. అది కీలకమైన బాధ్యత నిర్వహిస్తుందని భావిస్తున్నాం. అయినప్పటికీ రాష్ట్రంలో ఎన్‌డిఎతో పోరాడుతున్న పార్టీల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యే విధంగా వ్యవహరిస్తాం. ఇతర పార్టీలను కలుపుకుపోయే విధంగా ప్రధాన పార్టీ వ్యవహరిస్తుందని, సాధ్యమైనంత త్వరగా సీట్ల పంపకంపై చర్యలను ప్రారంభిస్తుందని భావిస్తున్నాం. ఈ దశలో కొన్ని చర్యలు తీసుకోవటం ప్రారంభమైందని మీడియాలో వస్తున్న వార్తలు తెలుపుతున్నాయి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

ఈ మాసం ముఖ్యాంశం

# పహల్గామ్ దాడి: కాశ్మీర్‌లో అంతా బాగుందా?



రచయిత సీనియర్ జర్నలిస్టు. 'కాశ్మీర్ : ఆవేశం, ఆలోచన' అన్న గ్రంథ రచయిత

**గౌహర్ గీలాని**

'కాశ్మీర్‌లో అంతా సజావుగా ఉంది' అని మనకు ఇన్నాళ్లూ చెబుతూ వచ్చారు. కానీ ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని టూరిస్టు కేంద్రం పహల్గామ్‌లోని బైసారన్ లోయలో 26 మంది ఊచకోత మన ముందు పెద్ద ప్రశ్నను నిలబెట్టింది. నిజంగానే కాశ్మీర్‌లో అంతా సజావుగా ఉందా?

1989 తరువాత మనకు కాశ్మీర్‌లో కనిపించిందంతా భయం, కోపం, అనిశ్చితి మాత్రమే. 36 సంవత్సరాలుగా స్క్రిప్ట్ ఏ మాత్రం మారలేదు : హింస, నిరసనలు, మరింత హింస, శాంతి సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయని ఊదరగొట్టడం, చర్చలకోసం అర్థమనస్కమైన ప్రయత్నాలు, అభివృద్ధి, శాంతి గురించి కథనాలు, టూరిజం, తీర్థ యాత్రలు పెరిగాయన్న మాటలు, తీవ్రమైన నిర్బంధం, ఇంతలో ఇదిగో ఈ పహల్గామ్ ఊచకోత.

పర్యాటకులపై జరిగిన ఈ దారుణమైన దాడి పట్ల కాశ్మీర్ పౌర సమాజం కన్నీరు పెడుతోంది. విషాదంలో ఉంది. అనిశ్చితి, అభద్రత, భయంతో కూడిన వాతావరణం రాష్ట్రంలో నెలకొని ఉంది. అయితే ఇంతటి విషాదంలో కూడా మానవ స్ఫూర్తి నిలబడే ఉందన్న ఆశ కూడా ఉంది.

ఏప్రిల్ 22 మధ్యాహ్నం రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌లో సూర్యుడు బయటకు వచ్చి ఉన్నాడు. పహల్గాంలో వెయ్యిమందికి పైగా పర్యాటకులు బైసారన్ వాలీలో కేరింతలు కొడుతున్నారు. దీన్ని 'మినీ స్విట్జర్లాండ్' అంటారు.

దీనికి అయిదు రోజుల ముందు తీవ్రమైన వర్షాలకు కాశ్మీర్ లోయను, జమ్మూ మైదానాలతో కలిపే జాతీయ రహదారి 44పై అకస్మాత్తుగా వరదలు సంభవించాయి. రాంబన్ ప్రాంతంలో అయిదుగురు చనిపోయారు. బైసన్ వాలీ రాంబన్‌కు దగ్గరలోనే ఉంది. శ్రీనగర్‌కు సుమారు 110 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఆహ్లాదకరమైన ఆ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో కొందరు సాయుధ దుండగులు, తరువాత వారిని చూసిన వారు చెప్పినట్లు సైనిక యూనిఫార్మ్‌లో ఉండి, అస్సాల్ట్ రైఫిల్స్, ఆటోమేటిక్ ఆయుధాలు పట్టుకుని అకస్మాత్తుగా బైసారన్ లోయలో ప్రత్యక్షమయ్యారు.

**ఊచకోతపై సాక్షుల కథనం**

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం దుండగులు రెండు డజన్లమందికి పైగా పర్యాటకులను వరసలో నిలబెట్టారు. వాళ్ల గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. వారిని అక్కడి కక్కడే అతి కిరాతకంగా కాల్చివేశారు. 8 నుండి 10 నిమిషాల సేపు కాల్పులు కొనసాగాయని బ్రతికి బయటపడిన వాళ్లు చెప్పారు. కాల్పుల్లో మరణించిన వారిలో ఒక విదేశీయుడు, గుర్రం నడిపే స్థానికుడు సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ఉన్నారు.

బైసారన్ చేరాలంటే కాలిబాటలోనే రావల్సి ఉంది. అక్కడి గడ్డి మైదానంలో సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ కనెక్టెవిటీ చాలా బలహీనంగా ఉంటుంది. పర్యాటకులు కాలినడకన అక్కడికి చేరుకుంటారు. నడవలేని వాళ్లు గుర్రాలు ఎక్కుతారు. తుపాకులు పట్టుకుని వచ్చిన దుండగులు బహుశా నడవడానికి కష్టంగా ఉండే అటవీ మార్గాన్ని ఎన్నుకుని ఉంటారు ఎందుకంటే వాళ్లకు "మైదానం కన్నా ఈ మార్గం ఎదురుకాల్పులు జరిగితే తప్పు కోడానికీ, రక్షణ పొందడానికీ బాగుంటుంది" అని ఒక ప్రముఖ రక్షణ నిపుణుడు చెప్పాడు.

ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) అనే సంస్థకు చెందిన వాళ్లు తామే ఈ దాడికి పాల్పడ్డామని మొదట ప్రకటించినప్పటికీ, తరువాత తమకు ఈ దాడితో సంబంధం లేదని ప్రకటించారు. భారత భద్రతా సంస్థలు తమ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి ఇలా బాధ్యతను తమపై నెడుతూ ప్రకటన చేశారని ఈ సంస్థ ఆరోపించింది. టిఆర్ఎఫ్ అనేది పాకిస్థాన్ స్థావరంగా పనిచేసే లష్కరే-ఇ-తాయిబా కు ముసుగు సంస్థ అని జమ్మూ, కాశ్మీర్ పోలీసులు చెప్పారు.

**విషాదంలో మునిగిన కాశ్మీర్**

ఏప్రిల్ 25వ తేదీ శుక్రవారం నాడు వందలాది మంది కాశ్మీరీలు మత పెద్ద మిర్వాజ్ ఉమర్ ఫరూక్ నాయకత్వంలో పహల్గామ్ బాధిత కుటుంబాలకు సౌహార్ద్రత తెలుపుతూ ఒక నిమిషం మౌనం పాటించారు. మిర్వాజ్ ఉమర్ ఈ దాడిని ఖండిస్తూ "...దిగ్భ్రాంతి కరమైన ఈ దాడి మా హృదయాలను నెత్తుటితో తడిపేసింది.." అన్నారు. ఇస్లామ్‌లో ఇటువంటి దారుణాలకు తావులేదని ఆయన అన్నారు. మిర్వాజ్ ఉమర్ తండ్రి మిర్వాజ్ మౌల్వీ మొహమ్మద్ ఫరూక్ షాను 1990 మే 21న శ్రీనగర్‌లోని ఆయన నివాస గృహంలో ఉగ్రవాదులు హత్య చేశారు. (మిర్వాజ్ అనేది కాశ్మీర్‌లో మత పెద్ద పరంపర నామం)

కాశ్మీర్ వర్తకులు కూడా ఉగ్రవాదులు జరిపిన మారణకాండను ఖండిచారు. "ఇది మన సమాజం మీద, మన సంస్కృతి, ఆతిథ్యం, కరుణ మొదలైన లక్షణాల మీద దాడి" అని శ్రీనగర్‌కు చెందిన కాశ్మీర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి ఫైజ్ బక్షి అన్నారు.

ఈ మారణ కాండకు నిరసనగా ఏప్రిల్ 23న కాశ్మీర్‌లోయ పూర్తిగా బంద్ పాటించింది. అన్ని విద్యా సంస్థలు, వ్యాపారాలు మూతపడ్డాయి. శ్రీనగర్ సిటీ సెంటర్ అయిన లాల్ చౌక్‌లో వ్యాపార వర్గాల నాయకులు, రాజకీయ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. "హింస ఎన్నటికీ విజయం సాధించదు", "పర్యాటకులు కాశ్మీర్‌కు జీవనాధారం" అనే ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

> "కాశ్మీర్‌లోని ప్రజలు జరిగిన దారుణానికి విచారిస్తున్న సమయంలోనే, కాశ్మీరీలపై దాడులకు పాల్పడుతున్నారని ఇతర నగరాల నుండి ఆందోళనకరమైన వార్తలు వచ్చాయి. టెలివిజన్ ఛానెల్‌లు, సోషల్ మీడియా కూడా ద్వేషపూరిత ప్రసంగాలతో చెలరేగాయి. ఆ తర్వాత ఇళ్ల కూల్చివేతలు జరిగాయి. దక్షిణ, ఉత్తర కాశ్మీర్‌లోని అనుమానిత ఉగ్రవాదుల కుటుంబాలకు చెందిన ఇళ్లను ప్రభుత్వ దళాలు కూల్చివేయడం ప్రారంభిం చాయి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు."

కాల్పుల్లో మరణించిన వారి ఒక్కో

కాల్పుల్లో మరణించిన వారి ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు, గాయపడిన వారికి రూ. 2 లక్షలు నష్టపరిహారం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకుడు ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. చిన్న చిన్న గాయాలైన వారికి రూ. 1 లక్ష పరిహారం ప్రకటించారు.

**ఉగ్రదాడికి కాశ్మీర్ లోయలో ఖండన**

కాశ్మీర్ లోయలోని ప్రధానమైన నాయకులంతా పహల్గామ్ ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించారు. ఈ దాడి "మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరం" అని మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఖండించారు. ఇది అత్యంత అసహ్యాకరమైన దాడి అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం క్రూరం, అమానుషం అని అన్నారు. దీన్ని "ఖండించడానికి మాటలు చాలవు" అని పేర్కొన్నారు.

జమ్మూ, కాశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ యువనాయకుడు, పుల్వామా నియోజకవర్గ శాసన సభ్యుడు వహీద్ పర్రా మాట్లాడుతూ "ఇది అయాయకులైన పౌరులు, పర్యాటకులపై దాడి తమందరిపై జరిగిన దాడి'' అని అన్నారు. ఇది "ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడమే కాక కాశ్మీర్‌లో శాంతి క్రమాన్ని, స్థిరత్వాన్ని కూడా నాశనం చేస్తుంది" అన్నారు. ఈ దాడి కాశ్మీర్‌లోనే కాకుండా బయట కూడా భయం, అస్థిరతలు సృష్టించాయని పేర్కొన్నారు. "ఇది మా ఉమ్మడి ప్రాతినిధ్యంపై దాడి. మేము అతిథి మర్యాదలకు పేరెన్నిక గన్న ప్రజలం అటువంటిది మీ అతిథులకు జరిగిన అమానుషం మాపై పెద్ద ప్రశ్నార్థకం పెట్టేసింది" అని అన్నారు.

అదే విధంగా జమ్మూ, కాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు సజ్జద్ లోనె మాట్లాడుతూ ఈ దాడి శతాబ్దాల చరిత్రగలిగిన మా ఆతిథ్యపు సంస్కృతిపై జరిగిన దాడి అన్నారు. ఇది భయంకరమైన, క్రూరమైన సంఘటన. ఒక కాశ్మీరీగా, ఒక రాజకీయ నాయకుడిగా మేము అతిథులకు ఎక్కువగా ఆదరించే ప్రజలం. వాళ్లు (ఉగ్రవాదులు) మా అస్థిత్వాన్నీ, సంప్రదాయాన్ని నాశనం చేశారు అని పేర్కొన్నారు.

**ప్రత్యేక అసెంబ్లీ సమావేశం**

ఊచకోత తర్వాత ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇలా అన్నారు: "నేను ఈ క్షణాన్న రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేయను. పహల్గామ్ తర్వాత, జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కోసం నేను ఏ ముఖంతో అడగగలను? మేము గతంలో రాష్ట్ర హోదా గురించి మాట్లాడాము. భవిష్యత్తులో కూడా అలాగే చేస్తాము, కానీ 26 మంది మరణించారని, ఇప్పుడు నాకు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్ర ప్రభుత్వాన్ని అడిగితే అది నాకు సిగ్గుచేటు." శాంతిభద్రతలు తన ప్రభుత్వ నియంత్రణలో లేనప్పటికీ, ముఖ్యమంత్రిగా, జమ్మూ కాశ్మీర్ పర్యాటక మంత్రిగా, పర్యాటకులను ఆహ్వానించినందుకు తాను బాధ్యత వహించానని ఆయన అన్నారు. "క్షమాపణలు కోరడానికి నాకు మాటలు లేవు" అని ఆయన అన్నారు.

కాశ్మీర్‌లోని ప్రజలు జరిగిన దారుణానికి విచారిస్తున్న సమయంలోనే, కాశ్మీరీలపై దాడులకు పాల్పడుతున్నారని ఇతర నగరాల నుండి ఆందోళనకరమైన వార్తలు వచ్చాయి. టెలివిజన్ ఛానెల్‌లు, సోషల్ మీడియా కూడా ద్వేషపూరిత ప్రసంగాలతో చెలరేగాయి. ఆ తర్వాత ఇళ్ల కూల్చివేతలు జరిగాయి.

దక్షిణ, ఉత్తర కాశ్మీర్‌లోని అనుమానిత ఉగ్రవాదుల కుటుంబాలకు చెందిన ఇళ్లను ప్రభుత్వ దళాలు కూల్చివేయడం ప్రారంభించాయి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. లేదా తగిన విచారణ లేదు. ఉగ్రవాదుల కుటుంబాల ఇళ్లపేరుతో కూల్చివేతకు గురైన ఇళ్ల ప్రక్కనే ఉన్న ఇళ్లు కూడా పేలుళ్ల ధాటికి దెబ్బతిన్నాయి. దాంతో రాజకీయ పార్టీలు, పౌరులు కోపంతో నిరసనలకు దిగారు. వారిని భద్రతా బలగాలు వీధుల్లోకి రానివ్వలేదు. కొవ్వొత్తుల ప్రదర్శనలు కూడా నిర్వహించకుండా నిషేధించారు.

"ఈ ఇల్లు ఉగ్రవాదంలో పాల్గన్నట్లు చెప్పబడే ఒక వ్యక్తి తల్లిదండ్రులది. తరువాతి ఇల్లు అతని మామది. ఆ పక్కనే ఉన్నది పొరుగువారి ఇల్లు. ఈ దురదష్టవంతులు ఏమి చేశారు?" దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని ముర్రాన్‌లోని షేక్‌పోరా ప్రాంతంలో ఒక నిస్సహాయ నివాసి అడిగాడు.

**కూల్చివేతలు, నిరసనలు**

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేపట్టిన తరువాత భారీ అణచివేతలు జరిగాయి. సామూహిక అరెస్టులు, తదుపరి విచారణలు లోయలో కొత్త భయాలను, ఆందోళనలను సృష్టించాయి. గతంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ప్రదర్శనలు, రాళ్లు రువ్వడం వంటి నిరసనల్లో పాల్గన్నారనీ, ఉగ్రవాదికి సంబంధించిన సంఘటనలలో పాల్గన్నారనీ వందలాది మంది యువకులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారి సంఖ్య 1,500 నుండి 1,700 మధ్య ఉంటుందని అంచనా.

దురదష్టవశాత్తు, సిపిఐ(ఎం) శక్తివంతమైన నాయకుడు మహ్మద్ యూసుఫ్ తరిగామి, శ్రీనగర్ పార్లమెంటు సభ్యుడు ఆగా సయ్యద్ రుహుల్లా మెహదీ మినహా మిగతా నాయకులందరూ కూల్చివేతలు, సామూహిక నిర్బంధాల గురించి మాత్రమే అది కూడా గొంతు పెగలకుండా మాట్లాడారు.

"తప్పుచేసిన వారిని శిక్షించండి, వారిపై ఏమాత్రం దయ చూపవద్దు, కానీ అమాయకుల ఆస్తులు కూల్చకండి" అని జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వేడుకున్నారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ కాశ్మీర్లోని కుల్గాం ఎమ్మెల్యే అయిన తరిగామి రాష్ట్ర శాసన సభలో మాట్లాడుతూ ఒమర్ అబ్దుల్లా వైఖరిని మాటతీరుపై ఆక్షేపించారు "బోల్ కి లాబ్ ఆజాద్ హై తేరే" (మీ పెదవులు స్వేచ్ఛగానే ఉన్నాయి, మాట్లాడండి) అన్న ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవితలోని పంక్తులను ఉటంకిస్తూ "ఒమర్ సాహబ్, మీరు కూడా...." అని అన్నారు. తరిగామి తన ప్రసంగంలో బిజెపి వైఖరిని తీవ్రంగా విమర్శించారు. "కాశ్మీర్లో 'ఉగ్రవాదుల కుటుంబాలు' ఉన్నాయని ఈ రోజు మీర

అకస్మాత్తుగా కనిపెట్టారా? 2014 నుంచి మీరు అధికారంలో ఉన్నారు కానీ ఉగ్రవాదుల స్థావరాలను కనిపెట్టలేకపోయారు. జమ్మూ కాశ్మీర్ భద్రతా యంత్రాంగం ఎవరి చేతిలో ఉంది? మీరు ఎవరిని మోసం చేస్తున్నారు?" అని తీవ్ర స్వరంతో విమర్శించారు. రుహుల్లా మెహదీ ప్రభుత్వ కూల్చివేతను ఖండిస్తూ, ''కాశ్మీర్‌నూ, కాశ్మీరీలను సమిష్టిగా శిక్షిస్తున్నారు" అని అన్నారు.

> "చట్టిసింగ్‌పోరా ఊచకోత జరిగిన ఐదు రోజుల తర్వాత, రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ ఆఫీసర్, అతని బలందం అనంత్ నాగ్‌లోని పాత్రిబాల్ గ్రామంలో ఐదుగురు వ్యక్తులను చుట్టుముట్టి చంపారు. తాము చంపిన వారంతా ఊచకోతకు పాల్పడిన "విదేశీ కిరాయి మూకలు" అని చెప్పారు. తర్వాత ఈ "ఎన్‌కౌంటర్"లో మరణించిన వారంతా స్థానిక కార్మికులని తేలింది. తీవ్ర నిరసనల తర్వాత, ఐదుగురు పౌరుల మృతదేహాలను వెలికితీసి డిఎన్ఎ పరీక్షలు జరపగా వారు ఆ ప్రాంత గ్రామస్తులని నిరూపితమయ్యింది."

### 25 సంవత్సరాలలో అత్యంత దారుణమైన దాడి

పహల్గామ్ దాడి, గతంలో 2000 మార్చిలో దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా చట్టిసింగ్‌పోరాలో 30 మందికి పైగా సిక్కులను కాల్చి చంపిన భయంకరమైన ఊచకోత జ్ఞాపకాలను తిరిగి తెచ్చింది. ఆ సమయంలో, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారతదేశ పర్యటనలో ఉన్నారు. ఈసారి, ఈ దాడి అమెరికా ఉపాధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్, అతని కుటుంబం సందర్శించిన సమయంలోనే జరిగింది.

చట్టిసింగ్‌పోరా ఊచకోత జరిగిన ఐదు రోజుల తర్వాత, రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ ఆఫీసర్, అతని బలందం అనంత్‌నాగ్‌లోని పాత్రిబాల్ గ్రామంలో ఐదుగురు వ్యక్తులను చుట్టుముట్టి చంపారు. తాము చంపిన వారంతా ఊచకోతకు పాల్పడిన "విదేశీ కిరాయి మూకలు" అని చెప్పారు. తరువాత ఈ "ఎన్‌కౌంటర్"లో మరణించిన వారంతా స్థానిక కార్మికులని తేలింది. తీవ్ర నిరసనల తర్వాత, ఐదుగురు పౌరుల మృతదేహాలను వెలికితీశి డిఎన్ఎ పరీక్షలు జరపగా వారు ఆ ప్రాంత గ్రామస్తులని నిరూపితమయ్యింది.

"విదేశీ ఉగ్రవాదులు"గా అభివర్ణిస్తూ సాధారణ పౌరులను చంపడం "క్రూరమైన హత్యలు" అని 2012 మార్చిలో సుప్రీంకోర్టు పేర్కొంది. నిందితులైన సైనికులు "తీవ్రమైన శిక్షకు అర్హులు" అని చెప్పింది.

కాశ్మీర్ వంటి ప్రదేశంలో సాధారణ స్థితి ఏర్పడిందని ఎవరైనా ఎలా అంచనా వేస్తారు? ప్రపంచవ్యాప్తంగా పర్యాటకాన్ని శాంతిని పెంపొందించే పరిశ్రమగా చూస్తారు. ప్రయాణం, సాంస్కృతిక మార్పిడి ద్వారా ప్రజల మధ్య అవగాహన పెంపొందించడానికీ, సహనానికి దారితీస్తుంది. కానీ కాశ్మీర్‌లో సాధారణ స్థితిని ఏర్పడిందని కొలవడానికి ఖచ్చితమైన కొలమానం లేకపోవచ్చు. "అసాధారణ పరిస్థితికి అసాధారణ ప్రతిచర్య సాధారణ ప్రవర్తన" కిందికి వస్తుంది అని విక్టర్ ఇ. ఫ్రాంక్ల్ తాను రాసిన 'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' గ్రంథంలో వాదించారు.



దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లా ముర్రన్ గ్రామంలో కూల్చివేయబడిన ఉగ్రవాది కుటుంబానికి చెందిన ఇల్లు

### పర్యాటక రంగం సాధారణ స్థితికి వచ్చిందా?

కాశ్మీర్ నాడిని అర్థం చేసుకున్న వారు పర్యాటక గణాంకాలను "సాధారణ స్థితికి చిహ్నం"గా చూపించడం ప్రాణాంతకం అని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. "సాధారణ స్థితి కథనం" లనేక విధాలుగా సమస్యాత్మకమైనదని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఇక ఇప్పుడు, దాడి తరువాత, దేశవ్యాప్తంగా టూర్ గ్రూపులు 40 నుండి 60 శాతం వరకు రద్దు చేయబడ్డాయని అనేక మంది టూర్, ట్రావెల్ ఆపరేటర్లు చెప్పారు. "ఒక అందమైన పర్యాటక ప్రదేశమైన కాశ్మీర్ ఒక యుద్ధభూమిగా ప్రదర్శించబడింది" అని శ్రీనగర్‌కు చెందిన హోటల్ యజమాని ముసాదిక్ షా ఇలా అన్నారు: తన హొటల్ బుక్ చేసుకున్న వారు 40 శాతం వరకు రద్దు చేసుకున్నారని ఆయన చెప్పారు. హోటల్ యజమానులు, ట్రావెల్ ఏజెంట్లు, రవాణాదారులు, షికారా (బోటు షికారు చేసే) వాలాలు, రెస్టారెంట్ యజమానులు, కళలు చేతిపనుల డీలర్లు – అందరూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

పర్యాటక రంగానికి సంబంధించి సంతవరకు గత మూడు సంవత్సరాలు "అనారోగ్యకరమైన సీజన్లు" అని పర్యాటక పరిశ్రమ వర్గాలు తెలిపాయి. 2024లో 30 లక్షలకు పైగా పర్యాటకులు వచ్చినప్పటికీ, 2022, 2023 రెండింటిలోనూ ఈ సంఖ్య 20 లక్షలకు పైగా ఉందని జమ్మూ, కాశ్మీర్ పర్యాటక శాఖ తెలిపింది.

అయితే, ఆర్థికవేత్త, జమ్మూకాశ్మీర్ మాజీ ఆర్థిక మంత్రి హసీబ్ ద్రబు మాట్లాడుతూ పర్యాటకాన్ని "కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక''గా తప్పుగా చూపించారు, ''ఉద్యానవనాలు, లాజిస్టిక్స్, వాణిజ్యం,

> “ పహల్గామ్ దాడి తర్వాత, చాలా మంది పర్యాటకులు బుకింగ్ లను రద్దు చేసుకుని లోయను విడిచిపెట్టడానికి తొందరపడ్డారు. తరువాత, ఏప్రిల్ 28 భద్రతా సమీక్ష తర్వాత, అధికారులు దాదాపు 48 ప్రదేశాలను లేదా ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో సగానికి పైగా మూసివేశారు. మూసివేసిన వాటిలో యుస్మార్గ్ దూధ్‌పత్రి గడ్డి మైదానాలు, బండిపోరా జిల్లాలోని మంచినీటి సరస్సు వులర్, శ్రీనగర్‌లోని జామియా మసీదు, దక్షిణ కాశ్మీర్‌లోని సూర్య దేవాలయం, ఉత్తర కాశ్మీర్‌లోని బంగస్ లోయ మొదలైనవి ఉన్నాయి. ”



పహల్గామ్ ఉగ్రదాడిలో గాయపడిన వ్యక్తిని అనంతనాగ్‌లోని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

వాణిజ్యం, రవాణా, ఉద్యానవన ఎగుమతులు చేతివృత్తుల ఆర్థిక వ్యవస్థతో కలిపి రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తికి భారీగా దోహదపడతాయి” అని ఆయన అన్నారు.

**జవాబుదారీతనం ఏదీ?**

ప్రభుత్వం చెబుతున్న సాధారణ స్థితి కథనాన్ని పౌర సమాజంలోని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దాడికి బాధ్యత ఎవరితో తేల్చాలని కోరుతున్నారు. శ్రీనగర్‌కు చెందిన న్యాయవాది అర్ఫీ జుహార్ మాట్లాడుతూ, అధికారంలో ఎవరో ఒకరు బాధ్యతను స్వీకరించి ‘‘భద్రతా లోపాన్ని’’ అంగీక రించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

“ఆర్టికల్ 370 రద్దు తర్వాత, కాశ్మీర్‌లో ప్రతిదీ సాధారణంగా ఉందనీ, శాంతి, అభివృద్ధి రెండు చక్రల్లా నడుస్తున్నాయనీ ఒక రకమైన కథనం నడుస్తోంది. ఇప్పుడు, దేశ, ప్రపంచ ప్రజలు ఆ కథనం కూలిపోవడాన్ని చూశారు,” అని కాశ్మీర్ హైకోర్టులో క్రిమినల్, సివిల్ చట్టాలను అభ్యసించే జుహార్ ఇలా అన్నారు. “1990లలో జన్మించిన నాలాంటి వ్యక్తికి, రోడ్లు, ఫుట్‌పాత్‌లు తప్ప కాశ్మీర్‌లో ఏమీ మారలేదు” అని జోహార్ పేర్కొన్నారు. ఆమె దీనికి బాధ్యులెవరో నిర్ణయించాలని కోరుతూ పబ్లిసిటీ కోసం ఆసుపత్రుల వెంట తిరగడాన్ని విమర్శించారు. ‘‘ఇప్పుడు కావల్సింది క్రింది స్థాయిలో సాధారణ స్థితి, మీడియా కథలు కాదు’’ అని ఆమె విమర్శించారు. కాశ్మీర్‌లో అంతా సజావుగా ఉంది అనేది కేవలం వండివార్చిన కథనం మాత్రమేనని, ఇటువంటి కథనం వల్ల 20 మందికి పైగా అమాయక పర్యాటకుల ప్రాణాలు పోయాయి అని ఆమె అన్నారు.

దీనికి సంబంధించిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వానిదేనని జోహార్ అన్నారు. “భద్రతా వైఫల్యం ఉందని ప్రభుత్వంలో ఎవరూ ముందుకొచ్చి అంగీకరించడం లేదు. హోమ్ మంత్రి అమిత్ షా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ షాలు బాధ్యత వహించాలి’’ అని ఆమె అన్నారు.

**భయంతో పర్యటనల రద్దు**

పహల్గామ్ దాడి తర్వాత, చాలా మంది పర్యాటకులు బుకింగ్‌లను రద్దు చేసుకుని లోయను విడిచిపెట్టడానికి తొందరపడ్డారు. తరువాత, ఏప్రిల్ 28 భద్రతా సమీక్ష తర్వాత, అధికారులు దాదాపు 48 ప్రదేశాలను లేదా ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో సగానికి పైగా మూసివేశారు. మూసివేసిన వాటిలో యుస్మార్గ్ దూధ్‌పత్రి గడ్డి మైదానాలు, బండిపోరా జిల్లాలోని మంచినీటి సరస్సు వులర్, శ్రీనగర్‌లోని జామియా మసీదు, దక్షిణ కాశ్మీర్‌లోని సూర్య దేవాలయం, ఉత్తర కాశ్మీర్‌లోని బంగస్ లోయ మొదలైనవి ఉన్నాయి.

నేరస్థులల్ని, వారి మద్దతుదారులను వదిలిపెట్టం అని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏప్రిల్ 29న, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రక్షణ, భద్రతా సంస్థల నాయకులతో భద్రతా సమావేశం నిర్వహించి, పహల్గామ్ దాడికి న్యూఢిల్లీ ప్రతిస్పందన తీరు, లక్ష్యాలు, సమయాలను”ను నిర్ణయించడానికి సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని ప్రకటించారు. పూర్తి స్థాయి యుద్ధం వస్తుందన్న భయం అక్కరలేదనీ, కానీ పరిస్థితి మరింత తీవ్రమవుతుందని చెప్పారు.

**ప్రతీకార చర్యలు**

ప్రభుత్వం పాకిస్తాన్‌పై అనేక ప్రతీకార చర్యలు ప్రకటించింది, వాటిలో సింధు జలాల ఒప్పందం (1960) రద్దు, పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించడం, పంజాబ్‌లోని అట్టారి సరిహద్దు పోస్టును మూసివేయడం వంటివి ఉన్నాయి.

ఈ దాడికి పాకిస్తాన్ కారణమని భారతదేశం పేర్కొంటుండగా, తన ప్రమేయం ఏమీ లేదని పాకిస్తాన్ అంటోంది. భారత్ తమకు ఎటువంటి ఆధారాలు చూపలేదని నొక్కి చెబుతోంది. (పహల్గామా దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వ “ఆపరేషన్ సింధూర్” పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపైనా, పాక్ సైనిక కేంద్రాలపైనా దాడికి దిగగా పాకిస్థాన్ ప్రతీకారంగా భారత సరిహద్దు గ్రామలపై దాడి చేసింది. ఇరువైపులా భారీగా ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరిగింది...అను)

మాజీ ఆర్మీ అధికారి, ప్రస్తుతం సైనిక వార్తలు కవర్ చేసే ఫోర్స్ మ్యాగజైన్ ఎడిటర్

**(మిగతా 24వ పేజీలో)**

# యుద్ధంపై టెలివిజన్ వార్తల ప్రహసనం



రచయిత 25 సంవత్సరాలుగా టెలివిజన్, ప్రింట్ మీడియాలో పనిచేశారు. ఇండియన్ న్యూస్‌రూమ్, స్టూడియో, స్టార్స్ మరియు విలేకరులు అన్న అంశాలపై పుస్తకాలు రాశారు. వివిధ విశ్వవిద్యాలయాలలో జర్నలిజం గురించి బోధించారు

**సందీప్ భూషణ్**

మన టెలివిన్ ఛానళ్లకు దేశంలో జరిగే ప్రతి సంఘటనా ఓట్ల వేటకు ఒక సందర్భమే. ప్రతి సంఘటన వెనుక "మీడియా మేనేజ్‌మెంట్" ఉంటుంది. దీని ఉద్దేశం నాయకత్వ ఇమేజ్‌ను ఆకాశానికెత్తడం. ఆయనగారు ఎంత బలవంతుడో చూడండి, ఎంత కఠినంగా మాట్లాడుతాడో, ఎంత చేతల మనిషో గమనించండి అని ప్రేక్షకులకు చెప్పడమే. అదే సమయంలో వార్తలను నియంత్రించడం ద్వారా వాటిని ఆయుధాలుగా వాడుకోవడం, ప్రభుత్వంలోని పెద్దలను రక్షించడం కోసం వార్తలను వక్రీకరించి తప్పుడు కథనాలు ప్రసారం చేయడం.

పాలక బిజెపి రాజకీయాలొక రకంగా ఉంటే టెలివిజన్ మరియు సోషల్ మీడియా వేదికలు ఆ రాజకీయాలను శుద్ధి చేసి పాలక పార్టీ రాజకీయాల ఇమేజ్ పెంచి మనకు ప్రసారం చేస్తుంటాయి. అయితే టీవీ, సోషల్ మీడియాలను ప్రభుత్వం ఆయుధాలుగా ఉపయోగించుకుంటున్న ఈ కాలంలో ఈ రెండు రాజకీయాలను వేరుచేయడం అంత తేలికైన విషయం కాదు. పార్టీ రాజకీయాలకు నష్టం కలిగినా ఫరవాలేదు, నాయకుని ఇమేజ్ మాత్రం నిరంతరం ప్రకాశించేట్లు ఇవి చూసుకుంటాయి.

పహల్గామ్ ఉగ్రవాద దాడి తరువాత ప్రధాని నరేంద్ర మోడీ ఏప్రిల్ 24 న సౌదీ అరేబియాలో తన అధికారిక పర్యటనను కుదించుకున్నారు. ఈ ఘటన మొత్తం మీడియా కవరేజ్ స్వరూపాన్ని మార్చేసింది. అయితే ఆయన ముందుగానే నిర్ణయించబడిన అఖిల పార్టీల సమావేశానికి హాజరు కాలేదు. దానికి బదులుగా ఎన్నికల ర్యాలీగా వంటి సభలో పాల్గొనేందుకు బీహార్ లోని మధుబనీకి వెళ్లారు. అక్కడ ఆయన బహిరంగ సభలో మాట్లాడుతూ "ఈ రోజు, బీహార్ నేల నుండి, నేను ప్రపంచం మొత్తానికి చెప్తున్నాను, భారతదేశం ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను వెదికి పట్టుకుంటుంది, శిక్షిస్తుంది. మేము వారిని భూమి చివరలకు వెంబడిస్తాము. భారతదేశ ఆత్మను ఉగ్రవాదులు ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేరు" అని భీకరంగా చెప్పారు.

ఆసక్తికరంగా, మోడీ ఆ రోజు కాన్పూర్లో ప్రసంగించవలసిన బహిరంగ సభను రద్దు చేశారు.

### యుద్ధానికి బిల్డప్

పాకిస్తాన్‌లోకి ప్రవహించే నదులకు నీరు ఒదలబోమని ప్రకటించిన తరువాత మోడీ తన సౌత్ బ్లాక్ కార్యాలయానికి చేరుకుంటున్న సాధారణ దృశ్యాలను (సాధారణంగా స్టాక్ షాట్‌లను దీనికి ఉపయోగిస్తారు) కూడా టివి ఛానళ్లు అసాధారణమైన, పాకిస్తాన్‌ను పీచమణిచే వీరుని దృశ్యాలుగా చిత్రీకరించాయి. సైనికాధిపతులు, జాతీయ భద్రతా సలహాదారు, పిఎంఓ అధికారులు ఇతరులతో ప్రధాని జరిపే సమావేశాలకు మీడియాను రానివ్వరు. కానీ అటువంటి సమావేశాన్ని కూడా రాబోయే యుద్ధ పరిస్థితులపై ప్రధానమంత్రి మొత్తం నియంత్రణలోకి తీసుకున్నారన్నట్లు ఫోటో షూట్‌లుగా మార్చారు. "సైన్యానికి ఏమి చేయడానికైనా స్వేచ్ఛ" నిస్తున్నట్లు చేసే ప్రకటనలు సమావేశానికి హాజరైన వారికి మాత్రమే చెబుతారు. కానీ ఆ విషయాన్ని అన్ని వార్తాపత్రికలలో, ఛానళ్లలో పతాక శీర్షికలుగా మార్చేశారు.

### నకిలీ వార్తల ప్రసారం

దేశంలోని దాదాపు 400 న్యూస్ ఛానెల్‌లలో అనేకం నకిలీ వార్తలు ప్రసారం చేసేవే ఉన్నాయి. ఆన్‌లైన్ మీడియాతో వీటికి అవినాభావ సంబంధం ఉంటుంది. రెండూ మితవాద కార్యకర్తలతో నిండినవే ఒకటి వార్త ఇస్తే మరొకటి దాన్ని తీసుకుని ప్రసారం చేస్తాయి. ఈ విధంగా నకిలీ వార్తలు ప్రచారంలో పెడతాయి.

మే 7న నకిలీ వార్తా కర్మాగారం ఉత్పత్తి ప్రారంభించి మే 11 వరకు విరామం లేకుండా నకిలీ చిత్రాలు కథనాలను ప్రసారం చేస్తూనే ఉన్నాయి. అంతకుముందు రోజు కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత కూడా ఈ నకిలీ వార్తల ప్రసారం కొనసాగుతూనే ఉంది. జర్నలిజం నియమాలు విలువలు చెత్తబుట్టలోకి తోసేశారు. కృత్రిమ మేధ సృష్టించిన చిత్రాలు, వీడియోలతోనూ గ్రాఫిక్స్, సౌండ్ ఎఫెక్ట్స్‌తోనూ రెట్టించిన కథనాలు ప్రసారం చేశారు. అక్కడక్కడ వీడియో గేమ్స్‌ను కూడా "న్యూస్ కంటెంట్" కు తోడు చేశారు. టివి స్టూడియోలను వార్ రూమ్స్‌గా మార్చారు.

ఘర్షణ ముగిసే సమయానికి న్యూస్ ఛానెల్స్, సోషల్ మీడియా ద్వారా ఉత్పత్తి చేయబడిన నకిలీ వార్తల చెత్త కుప్ప పొగయి ప్రజలను వాస్తవం చూడలేకుండా చేసింది.

**అలాంటి కొన్ని నకిలీ కథల గురించి తెలుసుకుందాం:** లాహోర్, సియాల్‌కోట్‌లు భారతీయ దళాల స్వాధీనం అయ్యాయి. ఇస్లామాబాద్ పట్టుబడింది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునిర్‌ను అరెస్టు చేశారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెబాజ్ షరీఫ్ నివాసంపై బాంబు దాడి చేశారు. ఆయన "లొంగిపోయే అవకాశం

> **"రిటైర్డ్ ఆర్మీ జనరల్స్‌ను ప్రైమ్-టైమ్ టీవీ షోలకు పిలిచారు. వాళ్లచేత అరుపులు అరిపించారు, తిట్టించారు, చివరికి వారి ప్రసంగాలను "కామిక్" కథనాలుగా మార్చేశారు. ఒకప్పుడు రోజువారీ టివి టాక్‌లకు వచ్చిన ఒక రిటైర్డ్ సైనికాధికారి "నన్ను సమాచారం కోసం కాకుండా ఒక కేతిగాడి మాదిరిగా ట్యూన్ చేసేశారు" అని వాపోయాడు."**

ఉంది". పాక్ ఉత్తర ప్రాంతంలోని ఒక స్థావరంలో (కిరానా హిల్స్ అని అనుకోవచ్చు) రేడియేషన్ లీక్ అయినట్లు వార్త వచ్చింది. ఒక భారతీయ వైమానిక దళ పత్రికా గోష్టి తరువాత, మే 9, 10 రాత్రిళ్లు పాక్‌లోని అనేక లక్ష్యాలపై బాంబు దాడి జరిగిందని వార్తలు ఇచ్చాయి.

రిటైర్డ్ ఆర్మీ జనరల్స్‌ను ప్రైమ్-టైమ్ టీవీ షోలకు పిలిచారు. వాళ్లచేత అరుపులు అరిపించారు, తిట్టించారు, చివరికి వారి ప్రసంగాలను "కామిక్" కథనాలుగా మార్చేశారు. ఒకప్పుడు రోజువారీ టివి టాక్‌లకు వచ్చిన ఒక రిటైర్డ్ సైనికాధికారి "నన్ను సమాచారం కోసం కాకుండా ఒక కేతిగాడి మాదిరిగా ట్యూన్ చేసేశారు" అని వాపోయాడు.

అవమానాల పాలైన పాకిస్తాన్‌ను అణగదొక్కేస్తారను కున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యంతో యుద్ధం విరమించబడింది. దాంతో ఈ టెలివిజన్ యుద్ధ వీరులంతా రాత్రికి రాత్రి తమ డాంబికాలనుండి తప్పుకోడానికి సాకుల కోసం వెదకడం ప్రారంభించారు.

### సాకులు, బలిపశువులు

టీవీల్లో వీరోచితంగా యుద్ధం చేసే ఈ కేతిగాళ్లకు బలిపశువుగా మారిన మొదటి వ్యక్తి మన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి. మే 11న కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాక్ పాల్పడుతున్నదని ఆయన ప్రకటించారు. దాంతో అతనిపై "దేశద్రోహి", "అమ్ముడుపోయాడు" అంటూ దుర్మార్గపు ఆన్‌లైన్ దాడి ప్రారంభమైంది. యుద్ధభూమిలో "భారతదేశానికి ఎంతో అనుకూలత ఉన్న సమయంలో ఈ లొంగుబాటు ఏమిటి?" అని ఆరోపించారు.

ఆయన కుమార్తె డిడాన్ మిస్రీ కూడా లండన్ కేంద్రంగా పనిచేస్తున్న న్యాయవాది, ఆమె మొబైల్ నంబర్, ఇతర వివరాలను ట్రోల్ చేశారు. రోహింగ్యా ముస్లింలకు ఆమె న్యాయ సహాయం చేసిందని తిట్లవర్షం కురిపించారు. ఈ దాడులతో మిస్రీ తన ఎక్స్ ఎకౌంట్‌ను మూసేశారు. ఈ మొత్తం వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఒక్కరు కూడ మిస్రికి అండగా నిలవలేదు. చివరికి భారత విదేశాంగ సర్వీసుల సంఘం, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల సంఘాలు ఆయనకు మద్దతుగా ముందుకొచ్చాయి. ఆయనపై ట్రోలింగ్‌ను ఖండించాయి.

కానీ నష్టం అప్పటికే జరిగిపోయింది. కొద్ది రోజుల తరువాత, విదేశీ వ్యవహారాల మంత్రి, అతని కార్యదర్శికీ భద్రతా కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రితో సహా 25 మంది బిజెపి మంత్రులకు కూడా అదనపు భద్రత కల్పించారు.

**ఎవరూ తప్పించుకోలేదు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుండి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి వరకు, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తాయ్యిప్ ఎర్డోగాన్, అజర్‌బైజానీ నాయకత్వం కూడా పాకిస్తాన్ అనుకూల వైఖరి తీసుకున్నందుకు, సైనిక పరికరాల సరఫరా రూపంలో పాక్‌కు భౌతిక మద్దతు ఇచ్చినందుకు తిట్ల దండకానికి గురయ్యారు.

### కుంభ మేళా కథలు

మీడియాను ఆయుధంగా వాడుకోవడం, ప్రభుత్వాన్ని ఆకాశానికెత్తడానికి ఒక సాధనంగా ఉపయోగించడం, దాని కోసం అతిశయోక్తులతో కూడిన కల్పిత కథలు సృష్టించడం వల్ల అంతిమంగా పౌరులు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది.

ఇది కుంభ మేళాలో కూడా జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దీన్ని ఉత్తమ వ్యవస్థీకృత కుంభమేళాగా మీడియా ప్రచారం చేసింది. డీలక్స్ ఏర్పాట్లు, స్విస్ కుటీరాలు, గొప్ప భోజన ఏర్పాట్లు అంటూ మీడియాలో ఊదరగొట్టే కథనాలు ప్రసారం చేశారు. ఈ కథలు కనీసం 66 కోట్ల సందర్శకులను ఆకర్షించాయని ప్రభుత్వ అంచనాలు తెలిపాయి.త

కానీ అక్కడేం జరిగింది. త్వరలోనే అది బ్యూరోక్రాట్లు, వీఐపిల కుంభమేళాగా మారిపోయింది. జనాన్ని అదుపుచేయడం పాలనా యంత్రాంగానికి చాలా కష్టమైపోయింది. కనీసం రెండు తొక్కిసలాటలు జరిగాయి.ఒకదాన్లో కనీసం 48 మరణించారు. న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్‌లోజరిగిన తొక్కిసలాటలో మరో 18 మంది చనిపోయారు. రైల్వేలు కుంభమేళా కోసం 17,000 కంటే ఎక్కువ రైళ్లను నడిపించినట్లు చెప్పుకున్నప్పటికీ ఈ తొక్కిసలాట జరిగింది. కుంభమేళా తొక్కిసలాటల్లో మృతులకు సంబంధించిన వాస్తవ గణాంకాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు.

ఈ ఏడాది మార్చిలో హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గిందనీ, ఉపాధి పెరిగిందనీ, సినిమా హాల్‌లు ప్రారంభమయ్యాయినీ, రాష్ట్రంలో రూ .1.1 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టే అవగాహన మెమోరాండాలపై సంతకాలు జరిగాయని చెప్పారు. ఇటువంటి పెద్ద ప్రచారం కారణంగా పర్యాటక రాకపోకలు గత సంవత్సరం రికార్డుస్థాయిలో 30 లక్షలకు పైగా జరిగాయి. 2018 లో 8,31,000 కన్నా బాగా పెరిగాయి. ఈ సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు అందుబాటులో లేవు.

సందేహించని పర్యాటకులకు ఉగ్రవాద దాడి గురించి ముందుగా ఏమీ తెలియదు. దెబ్బతిన్న, గాయాలపాలైన రాష్ట్ర స్థాయి మీడియాకు దీని గురించి ఎటువంటి ఉప్పు అందలేదు. కాశ్మీర్ లోయలోని స్థానిక మీడియా తీవ్రమైన గందరగోళంలో ఉంది. లోయలోని 15 నుండి 20 మంది జర్నలిస్టులను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కొంతమంది మీద క్రూరమైన ఉగ్రవాద నిరోధక చట్టం క్రింద కేసులు పెట్టారు.

దీని ఫలితం మనకు స్పష్టంగా కనిపించింది. ఎటువంటి భద్రత లేకపోవడంతో 25 మంది పర్యాటకులు, ఒక స్థానిక నివాసిని ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు. ఇంకా ఘోరం ఏమంటే ఉగ్రవాదులకు స్థానికుల మద్దతు ఉందన్న వార్తలొస్తున్నాయి.

> “ప్రభుత్వ ఆదేశాలతో ఎక్స్ నిలిపివేసిన ఖాతాలలో కాశ్మీర్ టైమ్స్ సంపాదకుడు అనురాధ భసిన్ ఉన్నారు. సీనియర్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్ట్ ముజామిల్ జలీల్, మీడియా సంస్థలైన మక్తోబ్ మీడియా, ఫ్రీ ప్రెస్ కాశ్మీర్, కాశ్మీరాత్‌లు ఉన్నాయి. న్యూస్ పోర్టల్ ది వైర్ అణచివేత మరింత దారుణంగా ఉంది. భారతదేశ జాగ్వార్ ఫైటర్ విమానాలలో ఒకదాన్ని పాకిస్తాన్ కూల్చి వేసిందని సిఎన్ఎస్ వార్తా సంస్థ ఇచ్చిన వార్తను ది వైర్ మే 9న తన సంచికలో క్యారీ చేయడమే వైర్ పోర్టల్‌పై కేంద్ర ప్రభుత్వ అణచివేత చర్యలకు కారణం.”

### నకిలీ వార్తల నేల

వరల్డ్ ఎకనామిక్ ఫోరంకు చెందిన గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2024 ప్రకారం, తప్పుడు సమాచారం, తప్పు సమాచారం అందించడంలో భారతదేశం అగ్రభాగాన ఉన్నది. ఇది ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ఎన్నికల లబ్ధి కోసం తప్పుడు సమాచారం అందించడం ద్వారా సమాచార మాధ్యమాల ప్రతిష్టను కూడా దిగజార్చేస్తోంది.

ఇదిలావుంటే, ఎక్స్‌లో పోస్టు చేసిన మెసేజ్‌లను కొంత డబ్బు తీసుకుని నిర్ధారిస్తున్న వేళ నకిలీ వార్తలను ప్రచారం చేయడం మరింత సులభం అయిపోయింది. ఎక్స్, ఫేస్‌బుక్ రెండింటిలో అంతర్గత వాస్తవ తనిఖీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలగించడంతో తప్పుడు వార్తల ప్రసారం మరింత పెరిగిపోయింది. వీటితో పాటు, మీడియా హౌస్‌లలో అంతర్గత వాస్తవం తనిఖీ చేయకపోవడంతో ఒక పెద్ద లోటు ఉంది. బ్రేకింగ్ న్యూస్ పరిస్థితులలో ప్రత్యర్థి నెట్‌వర్క్‌లు ఏమి చూపిస్తున్నాయనే దానిపైనా, తాము ఏమి చూపించాలన్న దానిపైనా తీవ్రంగా దృష్టి సారించింది. వాస్తవాల పవిత్రతలో కాకుండా, రేటింగ్స్‌లో ఒకరితో మరొకరు పోటీపడ్డం చూస్తున్నాం.

చివరకు, మొత్తం టెలివిజన్ మీడియా (కనీసం హిందీ మరియు ఇంగ్లీషులో) అత్యంత ధనవంతుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో సంపాదకులను, విలేకరులను తటస్థీకరించ డం, నకిలీ వార్తలను ప్రసారం చేయడం అత్యంత సులువైపోయింది. వార్తలు అనేవి హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్ క్రిందకు దిగజారిపోయాయి.

### “కరాచీ పోర్ట్‌పై బాంబుల వర్షం”

కరాచీ ఓడరేవును భారత నావికాదళం బాంబు దాడతో నాశనం చేసిందనే వార్త బహుశా చాలా ఘోరమైన నకిలీ వార్తా కథనం. ఈ వార్తను ఒక ప్రముఖ హిందీ న్యూస్ నెట్‌వర్క్ చేత తయారు చేయించినట్లు కనిపించింది. తరువాత అది దేశవ్యాపితంగా ఫ్లాష్ న్యూస్ అయింది. కొన్ని ఛానల్స్ అయితే పోర్టు ఎలా పేలిపోయిందీ, దానిలో ధ్వంసమైన భాగాల వీడియోలను కూడా చూపించాయి.

త్వరలో ఈ కథ డిజిటల్ మీడియాలో వైరల్ అయ్యింది. అనుభవజ్ఞులైన విజువల్ మీడియా రిపోర్టర్లు కూడా వారి పోర్టళ్లలో ఈ నకిలీ వార్తలను పోస్ట్ చేశారు. అలాంటి వారిలో కొందరు, ప్రముఖ మాజీ టెలివిజన్ స్టార్స్ కూడా ఉన్నారు. వారు ఇంకా ఈ వార్తను తొలగించలేదు.

బిజెపి బీట్‌ను కవర్ చేసే పలువురు విలేకరులు ఈ కరస్పాండెంట్‌తో మాట్లాడుతూ, కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అశ్వనీ శ్రీవాత్సవ్, సీనియర్ ఎడిటర్లతో మే 9న జరిగిన సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చిందని చెప్పారు. విలేకరులకు ఈ వార్త ఎక్కడి నుండి వచ్చింది అని శ్రీవాత్సవ్ అడిగారట. ప్రభుత్వం నుండే తమకు ఈ వార్త వచ్చిందని ఒక విలేకరి ఆ సమావేశంలో చెప్పాడు. పాకిస్తాన్‌లోని ఒకరు తమకు ఈ సమాచారం ఇచ్చారని జి–టివి రిపోర్టర చెప్పారు. తమకు ప్రభుత్వం నుండి సమాచారం రావడం లేదని మరో విలేకరి చెప్పారు. తప్పుడు వార్తలపై ఈ చర్చనంతటినీ మంత్రి నిశ్శబ్దంగా విని ఊరుకున్నారు.

ప్రభుత్వంలోని వ్యక్తులు నకిలీ వార్తల ప్రసారానికి అనుకూలంగా, వ్యతిరేకంగా విడిపోయారని మూడు దశాబ్దాలుగా బిజెపి బీటు చూస్తున్న ఒక విలేకరి చెప్పారు. ఇటువంటి నకిలీ వార్తలు ప్రచారంలో పెడితే ప్రజల అంచనాలు పెరిగిపోతాయని వారి వాదన, అయితే ఇటువంటి వార్తవల్ల ప్రభుత్వానికి గతంలో లాభాలు జరిగాయి గనుక వాటిని కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చారు.

### ప్రభుత్వ దాడులు

అదే సమయంలో ప్రభుత్వం వాస్తవమైన డిజిటల్ వార్తలపై దాడులకు దిగింది. భారతదేశంలో 8,000 ఎక్స్ ఖాతాలను అడ్డుకోవాలని “ప్రభుత్వం నుండి ఉత్తర్వు” లందుకున్నట్లు ఒక ఎక్స్ ఉంచారు. ప్రభుత్వ ఉత్తర్వు “భారతదేశపు స్థానిక చట్టాలను ఏ పోస్ట్ ఉల్లంఘించిందో” పేర్కొనలేదని, ఆదేశాలను పాటించటానికి ఇది “భారతదేశంలో మాత్రమే పేర్కొన్న ఖాతాలను నిలిపివేస్తుందని” అన్నారు.


ప్రభుత్వ ఆదేశాలతో ఎక్స్ నిలిపివేసిన ఖాతాలలో కాశ్మీర్ టైమ్స్ సంపాదకుడు అనురాధ భసిన్ ఉన్నారు. సీనియర్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జర్నలిస్ట్ ముజామిల్ జలీల్, మీడియా సంస్థలైన మక్తోబ్ మీడియా, ఫ్రీ ప్రెస్ కాశ్మీర్, కాశ్మీరాత్‌లు ఉన్నాయి. న్యూస్ పోర్టల్ ది వైర్ అణచివేత మరింత దారుణంగా ఉంది. భారతదేశ జాగ్వార్ ఫైటర్ విమానాలలో ఒకదాన్ని పాకిస్తాన్ తన ఆయుధాగారంలోని చైనా నిర్మిత యుద్ధ విమానాలతో కూల్చి వేసిందని సిఎన్ఎస్ వార్తా సంస్థ ఇచ్చిన వార్తను ది వైర్ పత్రిక మే 9న తన సంచికలో క్యారీ చేయడమే వైర్ పోర్టల్‌పై కేంద్ర ప్రభుత్వ అణచివేత చర్యలకు కారణం.

సైనిక వ్యాఖ్యాత, ఫోర్స్ మ్యాగజైన్ సంపాదకుడు ప్రవీన్ సాహ్నీ మే 8 న పోస్ట్ చేసిన 11 నిమిషాల వీడియోను ఎక్స్ నుండి తొలగించారు. తరువాత తెలిసిందేమంటే, పాకిస్తాన్ భద్రతా బలగాలు నాలుగు భారతీయ యుద్ధ విమానాలను కూల్చివేశాయన్న విషయం ఈ వీడియో ఉందట.

గ్లోబల్ , స్థానిక మీడియా సంస్థలు నాలుగు రోజులపాటు నకిలీ న్యూస్‌తో ఛానళ్లను ముంచెత్తాయి. ఇదంతా ఒక వైఖరిని తెలియజేస్తోంది. అదేమంటే ప్రభుత్వం కోవిడ్ మృతుల విషయంలో గానీ, లడఖ్‌లో చైనా చొరబాటు విసయంలోగానీ, లేదా ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడి గురించిగానీ, లేదా విద్వేష ప్రచారాలుగానీ ఒకటేమిటి చాలా వార్తల విషయంలో బాధ్యత వహించడం లేరు. దీని ప్రభావం పాలించేవారి మీద కాదు ప్రజలపై తీవ్రంగా ఉంటుంది.

❈

# 2వ ప్రపంచ యుద్ధంలో బెర్లిన్ పతనం, నాజీల ఓటమి



రచయిత ప్రముఖ మార్క్సిస్టు మేధావి, న్యూస్ క్లిక్ పోర్టల్ వ్యవస్థాపక ఎడిటర్. వివిధ అంశాలపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు.

ప్రబీర్ పుర్కాయస్థ

రెండవ ప్రపంచ యుద్ధంలో 1945 మే 9న బెర్లిన్ నగరం పతనమైంది. ఆ ఘటన నాజీ జర్మనీ ఓటమిని చాటిచెప్పింది. అందుకే ఆ రోజు విజయోత్సవ దినంగా గుర్తించబడింది. నాడు విస్తృతంగా ఉత్సవాలు జరిగాయి. ప్రపంచ యుద్ధం పసిఫిక్, తూర్పు ఆసియా, ఆగ్నేయ ఆసియాల్లో అదనంగా మరో నాలుగు నెలలు కొనసాగింది. లొంగుబాటుకు ముందు, జపాన్ మెరుగైన ఒక ఒప్పందాన్ని సాధించేందుకు ప్రయత్నించింది. దాని వల్ల మాత్రమే పై జాప్యం చోటుచేసుకుంది. పలువురు చరిత్రకారులు అభిప్రాయపడినట్లు కేవలం హిరోషిమా, నాగసాకిలపై అణు బాంబుల ప్రయోగంతోనే ప్రపంచ యుద్ధం ఆగలేదు. కానీ, సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రారంభించటమే రెండవ ప్రపంచ యుద్ధం ముగింపుకు దారితీసింది. ఏది ఏమైనా పశ్చిమ దేశాలు ఈ చరిత్రను వక్రీకరించి తిరగరాశాయి. నేడు అత్యధిక ప్రజానీకానికి, యుద్ధానికి సంబంధించిన ప్రాథమిక వాస్తవాలు కనీస స్థాయిలో కూడా తెలియవు.

రెండవ ప్రపంచ యుద్ధం అనేది ప్రధానంగా సోవియట్ యూనియన్, జర్మనీల మధ్య జరిగిన భూ తల యుద్ధమన్న వాస్తవాన్ని ప్రజలు మరచిపోయారు. సోవియట్ యూనియన్, జర్మనీ ఇరు వైపులా చనిపోయిన ప్రజలు, నాడు వినియోగించిన, విధ్వంసకరమైన ట్యాంకులు, విమానాలు సంఖ్య రీత్యా అత్యధికంగా తూర్పు ఫ్రంట్‌లోనే (జర్మనీకీ–సోవియట్ యూనియన్‌కూ మధ్య జరిగిన యుద్ధంలోనే) చోటుచేసుకుంది. ఆ యుద్ధం ప్రధానంగా సోవియట్ యూనియన్ భూభాగంలోనే జరిగింది. ఇతర యుద్ధాలకు భిన్నంగా ఈ యుద్ధం ఒక "ఫ్యాక్టరీల యుద్ధం"గా కూడా రూపుదాల్చింది. ట్యాంకులు, విమానాలు, ఫిరంగిదళాలు, ఆయుధాలు, మందుగుండుతోపాటు పెద్ద సంఖ్యలో సైనిక దళాలు ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. ప్రధానంగా రైతాంగ సమాజంగా ఉన్న సోవియట్ యూనియన్, ఈ యుద్ధంలో పారిశ్రామిక సమాజంగా రూపాంతరం చెందింది. అది, యుద్ధం సాగే క్రమంలో ఉత్పాదక స్థాయిలో జర్మనీని అధిగమించి పురోగమించగలిగింది.

**ప్రచార యుద్ధము–చారిత్రక జ్ఞాపకాలు**

రెండవ ప్రపంపచ యుద్ధ విజయానికి ఎవరు ఎక్కువ దోహదపడ్డారు, ఎవరు అపారమైన మూల్యం చెల్లించారన్న సత్యాన్ని ఆ యుద్ధాన్ని ప్రత్యక్షంగాచూసిన నాటి తరానికి తెలుసు. అది నెమ్మదిగా ప్రజల జ్ఞాపకాల నుండి తుడిచిపెట్టబడింది. దాని పర్యవసానంగా బెర్లిన్‌లో జరిగిన విజయోత్సవ దినంలో, అన్ని రష్యన్ సింబల్స్‌ను జర్మనీ నిషేధించింది. ఏ ఒక్క రష్యా ప్రతినిధిని కూడా ఆ ఉత్సవాల్లో పాల్గొననీయకుండా చేయగల్గింది. రెండవ ప్రపవంచ యుద్ధం ముగిసే వరకు జర్మనీచే ఆక్రమించబడిన ఫ్రాన్స్‌లో కూడా జర్మనీ ఓటమిలో ఏ దేశం ఎక్కువ దోహదంచేసిందన్న అభిప్రాయం, సోవియట్ యూనియన్ స్థానం తుడిచేయబడింది. ఆ స్థానంలో అమెరికాను ప్రతిష్టించారు. ఇది జ్ఞాపకాలపై ప్రచారం సాధించిన విజయం. హాలీవుడ్ సినిమాలు (ఇప్పుడు సోషల్ మీడియా) తిరగరాసిన చరిత్ర.

1945 ఆ తర్వాత 1994, 2004, 2015లో జరిగిన ఎన్నికల ఫలితాల గ్రాఫిక్స్‌ను గమనిస్తే రెండవ ప్రపంచ యుద్ధపు జ్ఞాపకాలు వాస్తవ ప్రపంచం నుండి ఆధునికానంతర ప్రపంచానికి వచ్చేసరికి ఏ విధంగా తిరిగి రాయబడ్డాయో అర్థమవౌతుంది. 1941జూన్‌లో సోవియట్ యూనియన్‌పై బార్బొరొస్సా దాడితో దాన్ని యుద్ధంలోకి దింపగల్గింది. పసిఫిక్ ప్రాంతంలోని అమెరికా నావల్ బేస్ 'పెరల్స్ హార్బర్'పై డిసెంబర్‌లో జపాన్ దాడిచేయడం, ప్రతిగా జపాన్‌పై అమెరికా బాంబులు వేయటం; జపాన్ లొంగుబాటు... అది వేరే కథనం. ఆపాటికే, జపాన్‌తో సహా అందరికీ 'వారు యుద్ధంలో ఓడిపోయినట్లు' స్పష్టంగా అర్థమైంది.

ఈ యుద్ధం గురించి చరిత్రకారుడు రిచార్డ్ వోవెరీ తను రాసిన "మిత్రపక్షాలు ఎందుకు గెలిచాయి" అన్న పుస్తకంలో ఇలా రాశాడు:

"జర్మన్ సైన్యం ఓటమే రెండవ ప్రపంచ యుద్ధ ముగింపుకు వ్యూహాత్మక లక్ష్యం అయితే దీనికోసం జరిగిన యుద్ధమంతా తూర్పు రంగంలోనే జరిగింది. ఇక్కడ తొలుత జర్మన్ సైన్యం బలహీన పడిపోయింది. వెనక్కు కొట్టబడింది. తరువాతనే 1944లో మిత్రపక్ష దళాలు రంగంలోకి వచ్చాయి. 1000 కిలోమీటర్ల పొడవున్న ఈ తూర్పు రంగంలో వెయ్యికి మించిన జర్మన్, సోవియట్ దళాలు తలపడ్డాయి. 1941–1945 మధ్య సోవియట్ సైన్యం ఫాసిస్టు యాక్సిస్ సైన్యానికి చెందిన సుమారు 607 దళాను మట్టుబెట్టాయి. ఇక్కడ తూర్పు రంగంలో జరిగిన యుద్ధంతో పోలిస్తే చరిత్రలో జరిగిన యుద్ధాలన్నీ మరుగుజ్జుల్లానే కనిపిస్తాయి. సైనిక రంగంలో ప్రపంచంలో ఎక్కడా జరగనంతటి నష్టం ఇక్కడ జరిగింది. తూర్పురంగంలో జరిగి యుద్ధపు భీకరత్వం పశ్చిమ రంగంలో మనం ఎక్కడా చూడం."

**రెండవ ప్రపంచ యుద్ధపు భౌగోళిక స్వరూపం**

యూరప్‌లో యుద్ధం ప్రధానంగా జర్మనీకీ, సోవియట్ యూనియన్‌కూ మధ్య జరగగా తూర్పు దేశాల్లో యుద్ధం పాన్‌కూ చైనాకూ

మధ్య జరిగింది. జర్మనీ దాని మిత్రులు యుద్ధాన్ని ప్రారంభించక ముందే 1933లో జపాన్ చైనాపై యుద్ధం ప్రారంభించింది. 1940 సెప్టెంబర్‌లో ఫ్రెంచ్ ఇండోచైనా మీద జపాన్ దాడి చేయడంతో అది ఫాసిస్టుల యాక్సిస్ కూటమిలో చేరింది. దాంతో చైనా–జపాన్ యుద్ధం కూడా రెండో ప్రపంచ యుద్ధంలో ఒక భాగం అయిపోయింది. 1941 జూన్‌లో సోవియట్ యూనియన్‌పై జర్మనీ ఆపరేషన్ బార్బరొస్సా పేరుతో యుద్ధానికి దిగింది. దాంతో అది సోవియట్‌ను యుద్ధంలోకి లాగింది. పసిఫిక్ ప్రాంతంలోని అమెరికా నౌకా స్థావరం పీర్ల్ హార్బర్‌పై జపాన్ 1941 డిసెంబర్‌లో దాడిచేయడంతో అప్పటి వరకు తటస్థంగా ఉన్న అమెరికా యుద్ధంలోకి దిగింది.

రెండో ప్రపంచ యుద్ధంలో మృతులు, క్షతగాత్రుల వివరాలను పరిశీలిస్తే అత్యధికంగా నష్టపోయింది సోవియట్ యూనియన్, చైనా అని తెలుస్తుంది. యూరప్‌లో సోవియట్ యూనియన్‌లో ఆసియాలో చైనాలో ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది. 2 కోట్ల 70 లక్షల మంది సోవియట్ ప్రజలు చేనిపోయారు. యుద్ధంలోనే కాదు, సోవియట్ పశ్చి ప్రాంతాన్ని జర్మనీ ఆక్రమించుకోవడం వల్ల ఏర్పడిన కరువు వల్ల, దాంతోపాటు యూదుల మాదిరిగానే స్లావిక్ ప్రజలు కూడా తక్కువ జాతి వారు కాబట్టి వారిని కూడా "జాతి హననం" చేయవచ్చునన్న నాజీ సిద్ధాంతంతో వారిని చంపేశారు. చైనా రెండు కోట్ల మంది ప్రజలను కోల్పోయింది. 1933లో చైనా–జపాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి చనిపోయిన 40 లక్షల మంది సైనికులు కూడా ఇందులో ఉన్నారు. జర్మనీ 50 లక్షల మంది ప్రజలను కోల్పోయింది. జపాన్‌కు చెందిన 30 లక్షల మంది చనిపోయారు.

ఆసియాలో అంటే చైనా, ఆగ్నేయాసియా, భారత దేశాల్లో వలస వాదులు ఆహారాన్ని దాచేయడం వల్ల, జపాన్ దురాక్రమణ దారులు దారుణాల వల్ల 70 లక్షల నుండి కోటి మంది ప్రజలు మరణించారు. వీటిలో ఒక్క బెంగాల్ కరువు వల్లనే 30 లక్షల మంది చనిపోయారు. దీన్ని చర్చిల్ కరువు అని మధుసూదన్ ముఖర్జీ పేరుపెట్టారు. వీటితో పోలిస్తే బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ అన్నిటిలో కలిపి కూడా అయిదు లక్షల మందికన్నా తక్కువే చనిపోయారు.

**"ఆసియాలో అంటే చైనా, ఆగ్నేయాసియా, భారత దేశాల్లో వలస వాదులు ఆహారాన్ని దాచేయడం వల్ల, జపాన్ దురాక్రమణ దారులు దారుణాల వల్ల 70 లక్షల నుండి కోటి మంది ప్రజలు మరణించారు. వీటిలో ఒక్క బెంగాల్ కరువు వల్లనే 30 లక్షల మంది చనిపోయారు. దీన్ని చర్చిల్ కరువు అని మధుసూదన్ ముఖర్జీ పేరుపెట్టారు. వీటితో పోలిస్తే బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ అన్నిటిలో కలిపి కూడా అయిదు లక్షల మందికన్నా తక్కువే చనిపోయారు."**

ఆసియాను పక్కన బెట్టి యూరప్‌లో జరిగిన యుద్ధాన్ని మాత్రమే ప్రసావిస్తాను. జర్మనీ ఓటమి మిత్ర పక్షాలపై ఫాసిస్టు యాక్సిస్ దేశాల గెలుపును అడ్డుకుంది. దాంతో జపాన్ లొంగిపోవడం తప్పని పరిస్థితిని తెచ్చింది. ఆపాన్‌పై అమెరికా రెండు అణు బాంబులు వేయడం, జపాన్ లొంగిపోవడం మరో కథ. కానీ యుద్ధంలో ఓడిపోతున్నామని జపాన్‌కు బాగా తెలుసునన్న విషయం స్పష్టం.

**ఫ్యాక్టరీల యుద్ధం**

మొదటి ప్రపంచ యుద్ధంలా కాకుండా, రెండవ ప్రపంచ యుద్ధం కేవలం సైన్యానికి పరిమితమైన యుద్ధం కాదు. ఎవరెంత సాధన సంపత్తిని– అంటే ఆయుధాలు, మందుగుండు, తుపాకులు, ట్యాంకులు, విమానాలను ఉత్పత్తి చేశారన్న అంశం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. అది, ఒక సమాజపు ఉత్పత్తి శక్తులను యుద్ధానికి ఏమేరకు ఉపయోగించుకున్నారు అన్నదానికి సంబంధించిన అంశం. 1917లో అక్టోబరు విప్లవం జరిగినపుడు, సోవియట్ యూనియన్ ప్రధానంగా

### 80 ఏళ్ల బెర్లిన్ పతనం అనంతరం

# యూరప్‌లో మళ్లీ ఫాసిస్టుల సవాళ్లు

– సుసన్ రామ్

**(రచయిత ఒక జర్నలిస్టు. లండన్‌లో జన్మించారు. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని ప్రపంచంలోని భిన్నమైన భౌగోళిక ప్రాంతాలను సందర్శిస్తూ గడిపారు.. దక్షిణ ఆసియాకు బైలుదేరే ముందు, రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలను అధ్యయనంచేశారు. ఆమె మొదట నేపాల్‌కు, తర్వాత భారత్‌కు వచ్చారు. తమిళనాడులో ఫీల్డ్ వర్క్‌చేస్తూ 20 సంవత్సరాలు అక్కడే నివశించారు)**

రెండవ ప్రపంచ యుద్ధం చివరిలో యూరప్ ఖండంలో చకచకా జరిగిపోయిన అనేక పరిణామాల నేపథ్యంలో యుద్ధం ముగింపుకు మూడు వారాలు సరిపోయింది. 1945 ఏప్రిల్ 16న సోవియట్ ఎర్ర సైన్యం బెర్లిన్‌పై తన తుది దాడిని ప్రారంభించింది. ఐదు రోజుల తర్వాత అడాల్ఫ్ హిట్లర్‌కు నాడీ కేంద్రమైన రీచ్‌స్టాగ్‌ను స్వాధీనంచేసుకుంది. శిధిల నగరంగా మారిన బెర్లిన్‌లోని రీచ్‌స్టాగ్‌పై సుత్తీ కొడవలి పతాకం ఎగురుతున్న సమయానికి హిట్లర్‌తో సహా నాజీ నాయకత్వం రెండు దశల్లో (1936,1944) నిర్మించబడిన, ఒక విశాలమైన, అబేధ్యమైన కోట లాంటి నేలమాళిగలో తలదాచుకుంది. ఓటమి తప్పదని అగ్రస్థాయి నాజీలకు అర్థమైపోయింది. ఓటమి భయం వారి తిరస్కారధోరణిని అంతిమంగా విచ్ఛిన్నంచేసింది. దాంతో వేలాది మంది ప్రాణాలనుతీసిన నరరూప రాక్షసుడు, నియంత హిట్లర్ ఏప్రిల్ 30న ఆత్మహత్యచేసుకున్నాడు.

ఇటలీలోని అతని ఫాసిస్టు సహచరుడు బెనెటో ముస్సోలినీకి అంతటి అదృష్టం కూడా దక్కలేదు. ఏప్రిల్ 28న అతడు స్విట్జర్లాండుకు పారిపోయే ప్రయత్నంలో ఇటలీ ఫాసిస్టు వ్యతిరేక పోరాట యోధులకు పట్టుబడ్డాడు. అతన్ని ఉరి ఉరితీశారు,

ఒక వ్యవసాయక సమాజంగా ఉండేది. 1927 నాటికి అది పారిశ్రామీకరణను ప్రారంభించింది. మొదటి పంచవర్ష ప్రణాళిక ఆవిష్కరింబడింది. నాటి సోవియట్ నాయకత్వానికి పశ్చిమ దేశాల పాలకవర్గాల స్వభావం గురించి తెలుసు. ప్రత్యేకించి అక్టోబరు విప్లవం పట్ల బ్రిటన్, ఫ్రాన్స్‌ల విద్వేషం గురించి బాగా తెలుసు. బాల్యావస్థలోని సోవియట్ రాజ్యంపై దాడిచేస్తున్న విప్లవ విద్రోహులైన రష్యా వైట్‌గార్డులకు ఆయుధాలు అందించి తమ మద్దతుప్రకటించారు.

1941లో సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడి చేయడంతో యుద్ధం ప్రారంభమైంది. అప్పటికి ట్యాంకులు, శతఘ్నులు, రవాణా, విమానాలు వంటివి యుద్ధంలో కీలకంగా ఉన్నాయి. వీటన్నిటిలోనూ సోవియట్ యూనియన్ జర్మనీ కన్నా అప్పుడు వెనుకబడే ఉంది. కానీ యుద్ధం సాగుతన్నా కొద్దీ ఈ అన్ని విషయాల్లోనూ సోవియట్ యూనియన్ జర్మనీని అదిగమించింది. తనకున్న ఫాక్టరీలను దేశంలోని పశ్చిమ ప్రాంతం అంటే ప్రస్తుత ఉక్రెయిన్, మాస్కో ప్రాంతాల నుండి వెయ్యి కిలోమీటర్లు తూర్పుకు అంటే ఉరల్ పర్వతాలు దాటించి కజకస్తాన్, సైబీరియాలకు బదిలీ చేస్తూ కూడా తన సాయుధ సంపత్తిని జర్మనీ కన్నా ఎక్కువగా పెంచుకోగలిగింది. 1941 చివరి నాటికి 1 కోటి 60 లక్షల మంది సోవియట్ పౌరులు 1,500 పెద్ద ఫాక్టరీలు తూర్పు ప్రాంతానికి తరలిపోయాయి. చిన్న ఫ్యాక్టరీలు, వర్క్‌షాపులను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 50,000కు చేరుతుంది. ఇంత పెద్ద సంఖ్యనే కాదు ఎంత వేగంగా తరలించారో తెలుసుకుంటే మనం దిగ్భ్రాంతికి గురవుతాం. జపోరొజ్‌స్టల్ లోని ఉక్కు కర్మాగారాన్ని కేవలం 20 రోజుల్లో విడదీసి, దానిలో పనిచేసే నిపుణులైన పనివారు ఒక నెల రోజుల్లో మళ్లీ కర్మాగారాన్ని తిరిగి నిర్మించి, ఉత్పత్తి ప్రారంభించారు.

భూ తల యుద్ధానికి బయట నున్న అమెరికా బ్రిటిష్, సోవియట్ యూనియన్ యుద్ధ ప్రయత్నాలకు మద్దతిచ్చింది. ఈ మద్దతు లేకుంటే జర్మనీ యుద్ధాన్ని మరికొంతకాలం కొనసాగించి ఉండేది. అయితే యుద్ధంలో సోవియట్ యూనియన్ నిర్ణయాత్మక పాత్ర నిర్వహించిందనే దాంట్లో సందేహం లేదు. యుద్ధంలో చనిపోయిన వారి సంఖ్యను చూసినా, సోవియట్ సైన్యాన్ని చూసినా, లేక ఆయుధాల, సైనిక పరికరాల ఉత్పత్తి సంఖ్యలను చూసినా ఈ విషయం బోధపడుతుంది.

**జీవాయుధాలు, అమెరికా భాగస్వామ్యం**

ప్రముఖ నాజీలంతా న్యూరెంబర్గ్ విచారణను ఎదుర్కొన్నారు. కానీ యుద్ధ కాలంలో సోవియట్ యూనియన్ మీద గూఢచర్యం కార్యకలాపాల అధిపతి అయిన రీన్‌హార్డ్ గెహ్లెన్‌తో సహా అనేక మందిని అమెరికా రిక్రూట్ చేసుకుంది. గెహ్లెన్‌నూ తూర్పు యూరప్‌లో ఆయన గూఢచారి విభాగం మొత్తాన్ని అమెరికా రిక్రూట్ చేసుకుని సోవియట్ యూనియన్ మీద అమెరికా ప్రారంభించే ప్రశ్చన్న యుద్ధంలో వినియోగించుకుంది. జర్మనీ అభివృద్ధి చేసిన రాకెట్ పరిజ్ఞానాన్ని యుద్ధానంతరం అమెరికా, సోవిట్‌లు రెండూ స్వాధీనం చేసుకుని ఉపయోగపెట్టుకున్నాయి. అయితే ఇక్కడ అందరికీ తెలియని విషయం ఏమంటే, చైనా సైనికులు, ప్రజల మీద ప్రయోగించిన జీవాయుధాలను తయారు చేసిన జపాన్‌కు చెందిన యూనిట్ 731ను అమెరికా రక్షించింది. ఈ యుద్ధ నేరస్తులను అమెరికా రక్షించడమే కాకుండి వారు చేసిన ప్రయోగాల రికార్డులతో సహా కీలకమైన వ్యక్తులందరినీ అమెరికా తన దేశంలోకి తీసేసుకుంది. అమెరికా ఈ జీవాయుధాలను కొరియా యుద్ధంలో కొనియన్లమీదా, చైనా సైనికుల మీదా ప్రయోగించిందనేందుకు సరిపడ్డా సాక్ష్యాలు ఉన్నాయి. ఆ తరువాత రెండవ ప్రపంచ యుద్దం సోవియట్ యూనియన్‌పై ప్రశ్చన్న యుద్ధంగా రూపాంతరం చెందింది.

శవాన్ని, మిలన్ నగరంలోని ప్రధాన కూడళ్లలో ఒక ఇనుప దూలానికి వేలాడదీశారు.

మే 2న ఇటలీలోని జర్మనీ సైనిక దళాలు లొంగిపోయాయి. మే 7న ఉత్తర ఫ్రాన్స్‌లోని రిమ్స్‌లో జర్మనీ జనరల్ ఆల్ఫ్రెడ్ జోడ్జ్ తమ సైనిక దళాలన్నీ భేషరతుగా లొంగిపోతున్నట్లు ఒప్పందంపై సంతకంచేశాడు. ఈ లొంగుబాటు కార్యక్రమం అక్కడి అమెరికా జనరల్ డి ఐసన్ హొవార్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. మే 9న సోవియట్ వత్తిడిపై రెండవ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. ఈ సారి బెర్లిన్‌లోని సోవియట్ కేంద్ర కార్యాలయంలో జర్మన్ జనరల్ ఫీల్డ్ మార్షల్ విల్హెమ్ కైటెల్ ' లొంగుబాటు పత్రంపై సంతకంచేశాడు.

ఈ రెండు సంఘటనలు చరిత్రలో రెండు వేర్వేరు విజయోత్సవాల నిర్వహిణకు కారణమయ్యాయి. మే 8న యూరపు విజయోత్సవ దినం, మే 9న రష్యన్ పెడరేషన్ అంతటా 'విజయోత్సవ దినం ప్రభుత్వ శలవు రోజు'గా కొనసాగుతున్నది.

నేను ఫ్రాన్స్‌లో నివశిస్తుంటాను. అక్కడ యూరప్ విజయోత్సవ దినాన్ని ప్రభుత్వ శలవు దినంగా నిర్వహిస్తారు. నాజీల దురాక్రమణలో ఫ్రాన్స్‌లోని ఏ ప్రాంతమూ క్రూరత్వం నుండి మినహాయించబడలేదు. అయితే అక్కడ నాజీల దుశ్చర్యలు రోజువారీ అవమానాల స్థాయిలోను, అప్పుడప్పుడు హింసాత్మకంగానూ జరిగాయి. దేశ వ్యాపితంగా ఇప్పటికీ నిర్వహించబడుతున్న స్మారక కార్యక్రమాలలో ఈ గతం ప్రతిధ్వనిస్తుంది. అధికార కార్యక్రమాల్లో పతకం ధరించి జండాలు చేపట్టినవారు, స్థానిక పెద్దలు, చరిత్ర పట్ల కృతజ్ఞతగల ఉపాధ్యాయులూ, పుష్పాలు చేబూనిన బాలూ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. వారు పట్టణంలోని యుద్ధ స్మారకం వద్ద త్రివర్ణ పూల మాలలు సమర్పించి నివాళులర్పిస్తారు. దేశ రాజధాని ప్యారిస్ నుండి అందిన ఒక ప్రసంగం పాఠాన్ని మేయర్ బిగ్గరగా చదివి విన్పించారు. విప్లవ మూలాలు విస్మరించబడుతున్న ఈ రోజుల్లో ఉత్తేజకరము, విజయవంతమైన ఫ్రెంచి జాతీయగీతాన్ని ప్రజా ప్రచార వ్యవస్థ ద్వారా ప్రసారంచేశారు. అపుడు తమ మధ్య స్నేహాన్ని ధృడపరిచే పలహారాలను పంచిపెట్టేందుకు వీలుగా ప్రతి పట్టణం, గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లన్నింటినీ మరమ్మత్తులు చేశారు.


రెండవ ప్రపంచ యుద్ధ అమరుల పట్ల గౌరవార్థం స్థానిక ప్రజల సమావేశాలు ఎంతో శ్రద్ధతో నిర్వహించబడుతున్నాయి. కానీ ఈ జ్ఞాపకాలు, యుద్ధంలో పాల్గొని అమరులైన వారి ఆప్తులు అంతరించిపోవడం వల్లనూ, ప్రస్తుతం ప్రపంచ వ్యాపితంగా వినిపిస్తున్న రణన్నినాదాల పరంపరలోనూ మరుగునపడిపోవచ్చు. కాలం గడిచేకొద్దీ తరిగిపోవటం జరగవచ్చు. కానీ దీనికన్నా ప్రమాద కరమైన విషయం ఏమంటే మళ్లీ అటువంటి సైనిక యుద్ధ నాదాలు పశ్చిమ యూరప్ అంతటా మరోసారి వినిపిస్తుండటం.

నాటి నాజీల స్వభావిన్ని మరోమారు కొత్త బ్రాండులో యూరప్‌లో విడుదలవుతున్నట్టు స్పష్టంగా కన్పిస్తున్నది. పశ్చిమ యూరపు, అమెరికాల్లో రాజకీయ మితవాదులు, వారి అధీనంలోని మీడియా మళ్లీ 'న్యాయమైన యుద్ధం', "ప్రజాస్వామ్యం కోసం

**(మిగతా 32వ పేజీలో)**

### ఘర్షణల కాలం క్రీ.శ.1000-1200

# గజనీ మహమ్మద్ దాడులు: నేపథ్యం- పర్యవసానాలు



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

క్రీ.శ.1000 నుండి 1200 మధ్య కాలం పశ్చిమ, మధ్య ఆసియా, ఉత్తర భారత దేశం చాలా మార్పులను చూశాయి. ఈ మార్పుల పర్యవసానంగానే టర్క్‌లు (తురకలు) క్రీ.శ.1200 నాటికి ఉత్తర భారతదేశంలోకి చొచ్చుకువచ్చారు. ఇందుకు దారి తీసిన ఆ మార్పులేమిటో చూద్దాం.

క్రీ.శ.9వ శతాబ్దం చివరికి అబ్బాస్ వంశస్తుల ఏలుబడి లోని ఖలీఫా పాలన బలహీనపడసాగింది. 9వ శతాబ్దంలో ఖలీఫా కోటకు రక్షకులుగా పనిచేసినవారు ఇస్లాం మతాన్ని స్వీకరించిన టర్క్‌లు. వారు ప్రత్యేక సాయుధ దళాలుగా కూడా ఖలీఫా ఆదేశాలమేరకు పని చేస్తుండేవారు.

(చాలా మంది టర్క్, అరబ్, పర్షియన్, పఠాన్ తదితర పదాలను ముస్లిం మతస్తులకు పర్యాయ పదాలుగా వాడుతూంటారు. కాని ఈ పదాలు ఆయా జాతులను సూచిస్తాయి. అంటే ఆయా జాతులవారందరూ ముస్లింలు కానవసరం లేదు.) ఖలీఫా ఏలుబడిలో బలహీనతలు పొడచూపుతున్నకొద్దీ ఈ టర్క్‌లు క్రమంగా తమ స్వంత పలుకుబడిని, బలాన్ని పెంచుకోసాగారు. అనతికాలంలోనే వారు వివిధ ప్రాంతాలను తమ స్వాధీనంలోకి తెచ్చుకుని ప్రాంతీయ ప్రతినిధులుగా వ్యవహరిస్తూ కేంద్రంలోని ప్రభుత్వం మీద కూడా బలమైన ప్రభావాన్ని చూపగలిగే స్థితికి చేరుకున్నారు. ఖలీఫా బలహీన పడడంతో వారంతా తమను తాము స్వతంత్రులుగా ప్రకటించుకున్నారు.

ఆ తర్వాత వారిలో వారి మధ్య ఘర్షణలు కొనసాగాయి. వారిలో ఒకరు చక్రవర్తిగా ప్రకటించుకుంటే తక్కినవారు అతడిని కుట్ర చేసి కూల దోసేవారు. ఈ టర్క్‌ల స్వభావం రీత్యా వారు ఒక ప్రాంతంలో స్థిరంగా శాంతియుతంగా పాలన నిర్వహించడం కన్నా తమ బల ప్రయోగం ద్వారా ఇతర ప్రాంతాలమీద పడి కొల్లగొట్టి దోచుకోడానికే ప్రాధాన్యత నిచ్చేవారు. వారి వద్ద చాలా నాణ్యమైన గుర్రాలు ఉండడంతో శరవేగంగా చాలా దూరాలు ప్రయాణించగలిగేవారు. మధ్య ఆసియా అంతటా ఈ టర్క్‌ల అరాచకపు ఆధిపత్యమే ఆనాడు సాగింది.

ఆ కాలంలో ఇరాన్ ప్రాంతంలో సమానిద్‌ల పాలన కొనసాగేది. ఈ సమానిద్‌లు ఇరానియన్ మూలాలనుండే వచ్చారు. వీరి రాజ్యానికి ఉత్తర, తూర్పు దిక్కుల నుండి టర్క్ తెగల వలన నిరంతరం ముప్పు ఉండేది. వాళ్ళతో నిరంతరం యుద్ధాలు చేయవసివచ్చింది. ఈ టర్క్ తెగల మూకలలో ఎక్కువ మంది ప్రకృతి ఆరాధకులు. కనుక ఇరానియన్ ముస్లింల దృష్టిలో వారంతా దైవద్రోహులు. అటువంటి మూకలతో యుద్ధం చేయడం అంటే అది ఒకవైపు తమ రాజ్యాన్ని కాపాడుకోవడం, మరొకవైపు మతాన్ని రక్షించుకోవడంగా పరిగణించబడింది. ఈ క్రమంలోనే ఒక కొత్త తరహా సైనికులు పుట్టుకొచ్చారు. వారే ఘాజీలు. ఘాజీ అంటే యుద్ధవీరుడే గాక మత రక్షకుడిగా కూడా పరిగణించబడేవారు. ఈ ఘాజీలు రెగ్యులర్ సైన్యంలో భాగం కారు. యుద్ధం చేసినందుకు ప్రతిఫలం తీసుకునేవారు. తక్కిన సమయాల్లో ఇతర ప్రాంతాలమీద పడి కొల్లగొట్టి దోచుకునేవారు. అప్పుడప్పుడే ఏర్పడుతున్న ముస్లిం రాజ్యాలను టర్క్‌ల బారినుండి కాపాడడంలో ఘాజీలు పోషించిన పాత్ర, ఎటువంటి కష్టాలనైనా తట్టుకుని నిలబడిగే వారి శక్తి సామర్థ్యాలు పేరు పొందాయి. ఇస్లాం మతం స్వీకరించిన టర్క్ తెగలు కూడా రాజ్యాల రక్షణ కోసం ఘాజీల మాదిరి గానే పోరాడేవారు. తక్కిన సమయాల్లో కొల్లగొట్టడం వారి వ్యాపకంగా ఉండేది.

సమానిద్ రాజ్యంలో ఒక ప్రాంతీయ పాలకుడుగా టర్క్ బానిసగా తొలుత ఉండిన ఆల్ప్టిజిన్ ఎదిగాడు. సమానిద్ రాజ్యం బలహీనపడుతున్న సమయంలో అతడు తన ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాడు. అప్పటినుంచీ మధ్య ఆసియా ప్రాంతపు తెగల దాడులనుండి తన రాజ్యాన్ని కాపాడుకోవడం ప్రధాన వ్యాపకం అయింది. అతడి రాజధాని గజని.

క్రీ.శ.998లో ఆ రాజ్యానికి రాజుగా మహమ్మద్ అనేవాడు వచ్చాడు. మనం చరిత్రలో ప్రస్తావించే గజనీ మహమ్మద్ ఇతడే. అతడి పేరు మహమ్మద్. అతడి రాజధాని గజని. ఇతడు 998 నుంచి 1030 వరకూ పాలించాడు. మధ్య ఆసియా నుంచి తన రాజ్యంపై దాడులకు పాల్పడే టర్కిష్ తెగల మూకలను సమర్థవంతంగా ఎదుర్కొని తన రాజ్యాన్ని కాపాడుకోవడంలో చాలా శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడం వలన ఇతడు ప్రఖ్యాతి పొందాడు. ఆ క్రమంలో తన రాజ్యంలో ప్రజానీకంలో ఇరానియన్ స్ఫూర్తిని బలంగా పాదుకొల్పాడు. ఇరానియన్లు అరబిక్ భాషను గాని, సంస్కృతిని గాని ఏనాడూ అంగీకరించలేదు. దానికి బదులు సమానిద్ రాజ్యం పర్షియన్ భాషను, సాహిత్యాన్ని ప్రోత్సహించింది. మహమ్మద్ పాలనలో పర్షియన్ సాహిత్యం మరింత ఉన్నత స్థితికి చేరుకుంది. ఇరానియన్ సాంస్కృతిక పునరుజ్జీవనానికి నిదర్శనంగా ఫిరదౌసి రచించిన షా నానక్ అనే రచన నిలుస్తుంది.

> **"తన దేశంలో పురాణపురుషుడిగా కీర్తించబడ్డ గజనీ మహమ్మద్ భారత ఉపఖండానికి మాత్రం ఒక దోపిడీదారుడిగానే పరిణమించాడు. అప్పటికి ఉత్తర భారతంలో గుర్జర-ప్రతీహార సామ్రాజ్యం ముక్కలైపోవడంతో రాజకీయంగా అస్థిరత నెలకొనివుంది. వాయవ్యం నుంచి పొంచివున్న ప్రమాదాన్ని నిలవరించగల శక్తి లేకుండా పోయింది."**

ఈ ఫిరదౌసి మహమ్మద్ గజనీ ఆస్థానంలో రచయిత. టర్కిష్ తెగలతో జరిపిన యుద్ధాలను అతడు పురాణాల స్థాయికి తీసుకెళ్ళాడు. ప్రాచీన ఇరానియన్ హీరోలను శ్లాఘిస్తూ అతడు రచనలు చేశాడు. ఆ హీరోల వంశస్తుడిగా మహమ్మద్ గజనీ తనను ప్రకటించుకున్నాడు. ఈ విధంగా ఇరాన్ ప్రాంతపు పర్షియన్ సంస్కృతిని, ఇస్లాం మత భావాలను వంటబట్టించుకున్న పూర్వపు టర్కిష్ తెగలకు చెందినవారే దానినంతటినీ రెండు శతాబ్దాల తర్వాత భారత ఉపఖండానికి తమతోబాటు తీసుకువచ్చారు.

తన దేశంలో పురాణపురుషుడిగా కీర్తించబడ్డ గజనీ మహమ్మద్ భారత ఉపఖండానికి మాత్రం ఒక దోపిడీదారుడిగానే పరిణమించాడు. అప్పటికి ఉత్తర భారతంలో గుర్జర-ప్రతీహార సామ్రాజ్యం ముక్కలైపోవడంతో రాజకీయంగా అస్థిరత నెలకొనివుంది. వాయవ్యం నుంచి పొంచివున్న ప్రమాదాన్ని నిలవరించగల శక్తి లేకుండా పోయింది.(చూ. భారత ఉపఖండ పటం క్రీ.శ.700-1030)

గజనీ మహమ్మద్ భారతదేశం మీద 17 సార్లు దాడులు చేసినట్టు చెప్తారు. ఆ దాడుల్లో తొలుత పెషావర్-పంజాబ్ ప్రాంతాన్ని పాలిస్తున్న హిందూషాహీల రాజ్యాన్ని లక్ష్యంగా చేసుకున్నాడు. ముల్తాన్ నగరాన్ని (ఇది ప్రస్తుత పాకిస్తాన్ లోని పంజాబ్ రాష్ట్రంలో ఉంది) అప్పట్లో ముస్లిం రాజు పాలించేవాడు. అతడి రాజ్యాన్ని కూడా గజనీ లక్ష్యం చేసుకున్నాడు.

హిందూషాహీ రాజులు మహమ్మద్ తండ్రి కాలం నుంచే గజనీలో తలెత్తిన స్వతంత్ర దేశం నుండి రాబోతున్న ప్రమాదాన్ని గమనించారు. అప్పటికి హిందూషాహీ రాజ్యం ఎల్లలు పంజాబ్ నుండి ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ వరకూ విస్తరించివుండేవి. ఆ రాజ్యం పాలకుడు జయపాలుడు సమానిద్ రాజ్యంలోని కొందరు ప్రాంతీయ నాయకుల సహకారంతో గజనీపై ఆక్రమణకు పూనుకున్నాడు. కాని ఆ యుద్ధంలో జయపాలుడు ఓడిపోయాడు. ఆ తర్వాత సంవత్సరం మళ్ళీ పోరాడి మరోసారి ఓడిపోయాడు. ఈ రెండు యుద్ధాలలోనూ అప్పటికి గజనికి యువరాజుగా ఉన్న మహమ్మద్ చురుకుగా పాల్గొన్నాడు. ఒకసారి తాను రాజు అయ్యాక మహమ్మద్ హిందూషాహీ రాజ్యం మీద దాడికి ఉపక్రమించాడు.

అప్పుడు జయపాలుడు ముల్తాన్‌ను పాలిస్తున్న ముస్లిం పాలకులతో చేతులు కలిపి గజనీ మహమ్మద్‌ను ఎదుర్కొన్నాడు. క్రీ.శ. 1001 లో జయపాలుడు ఓడిపోయి బందీగా పట్టుబడ్డాడు. ఆ తర్వాత అతడిని విడిచిపెట్టారు. అతడి అనంతరం అతడి కుమారుడు ఆనందపాలుడు రాజయ్యాడు. అతడి కాలంలో 1007-1008 మధ్య కాలంలో పెషావర్ సమీపంలోని వెయ్‌హింద్ వద్ద గజనీమహమ్మద్ సేనలతో భీకర యుద్ధం జరిగింది. అందులో ఆనందపాలుడికి మద్దత్తుగా ముల్తాన్ రాజుతో బాటు వాయవ్య భారతంలోని పలు ప్రాంతాల రాజ్యాల సైన్యాలు, రాజస్తాన్, కనూజ్ తదితర ప్రాంతాల సైన్యాలు కూడా పాల్గొన్నాయి. సంఖ్యాపరంగా ఆనందపాలుడి బలం ఎక్కువగా ఉన్నప్పటికీ, మహమ్మద్ సైన్యంలో గుర్రాల మీద స్వారీ చేస్తూ విల్లంబులు ఉపయోగించగల సామర్థ్యం ఉన్న యోధులు ఉండడంతో మహమ్మద్ దే ఆ యుద్ధంలో పైచేయి అయింది. ఆ యుద్ధం తర్వాత పంజాబ్‌లో చాలా ప్రాంతం గజనీ మహమ్మద్ వశం అయింది. ఒక చిన్న భూభాగానికి హిందూషాహీ పాలకులు పరిమితం అయ్యారు. ఇటు భారత ఉపఖండంలోకి విస్తరించగలిగినప్పటికీ, మహమ్మద్‌కు మధ్య ఆసియా ప్రాంతం నుండి టర్కిష్ తెగల దాడుల బెడద అటువైపు కొనసాగుతూనేవుంది. ఆ దాడులను తట్టుకోవడం మీద ప్రధానంగా దృష్టి పెట్టవలసిరావడంతో భారత ఉపఖండం లోని వివిధ ప్రాంతాలమీద దండెత్తి అక్కడి ధనవంతమైన దేవాలయాలమీద పడి దోచుకోడానికి గజనీ మహమ్మద్ పూనుకున్నాడు. ఇక్కడ కొల్లగొట్టిన సంపదను అటు టర్కిష్ దాడులను ఎదుర్కోడానికి ఉపయోగించాడు. భారతదేశంలోని దాడులకు, కొల్లగొట్టడానికి అతడికి ఫూజీ దళాలు ఉపయోగపడ్డాయి. ఇస్లాం మత ఔన్నత్యాన్ని చాటడం పేరుతో దేవాలయాలను దోచుకోవడంతోబాటు అక్కడి విగ్రహాలను ధ్వంసం చేయడం కూడా పనిగా పెట్టుకున్నాడు గజనీ మహమ్మద్. పంజాబ్‌ను దాటి డిల్లీ సమీపంలోని థానేసర్ వరకూ దాడులు సాగించాడు. ఐతే ఎక్కువగా అతడి దాడులకు గురైనవి 1018లో కనూజ్. 1025లో గుజరాత్ లోని సోమనాథ్ దేవాలయం. బుందేల్ ఖండ్ ప్రాంతం వరకూ సంచరిస్తూ తాను దోచుకున్న సంపదను తనతోబాటు తీసుకుపోగలిగాడు. ఉత్తర భారతంలో ఆనాడు బలమైన రాజ్యం ఏదీ లేకపోవడంతో మహమ్మద్ దోపిడీకి ఎదురు లేకుండా పోయింది. 1030లో గజనీ మహమ్మద్ గజనిలో మరణించాడు.

గజనీ మహమ్మద్ దండయాత్రలు ఉత్తర భారత ముఖచిత్రాన్ని మార్చివేశాయి. వాయవ్యం వైపు నుండి వచ్చే ఆక్రమణలను తట్టుకోడానికి అనువుగా ఉన్న హిందూకుష్ పర్వతశ్రేణులను దాటి గంగా మైదాన ప్రాంతం వరకూ టర్కిష్ సైన్యాలు చొచ్చుకురాగలిగాయి. ఐతే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోలేకపోడానికి ప్రధాన కారణం మధ్య ఆసియాలో రెండోవైపు నుంచి గజనీ రాజ్యానికి టర్కిష్ తెగల దాడుల ముప్పు కొనసాగమే.

మహమ్మద్ మరణానంతరం సెల్జుక్ సామ్రాజ్యం ఉనికిలోకి వచ్చింది. సిరియా, ఇరాన్, ట్రాన్స్ ఓక్సియానా (ప్రస్తుత ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కిర్గిజిస్తాన్, కజకస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ దేశాలు ఉన్న ప్రాంతం) ప్రాంతమంతా ఈ సెల్జుక్ సామ్రాజ్యంగా ఉండేది. ఈ రాజ్యం గజనీపై దండెత్తి ఓడించింది. ఆ తర్వాత గజనీ రాజ్యం గజని-పంజాబ్ ప్రాంతానికే పరిమితం


అయిపోయింది. ఆ తర్వాత కూడా రాజస్తాన్ లోకి, గంగా మైదాన ప్రాంతంలోకి దాడులకు పూనుకున్నా, పూర్వపు శక్తి సామర్థ్యాలు లోపించాయి. మరోపక్క ఉత్తర భారతంలో గజనీవాదుల దాడులను ప్రతిఘటించగల రాజ్యాలు రూపు దిద్దుకోసాగాయి.

### రాజపుత్ర రాజ్యాల పెరుగుదల

రాజపుత్రులు అనే పదం ఒక జాతిని సూచించేది కాదు. పలు తెగలకు చెందినవారు తదనంతర కాలంలో తమను తాము రాజపుత్రులుగా ప్రకటించుకున్నారు. 'రాజ' వంశంనుండి వచ్చినట్టు చెప్పుకోవడం ద్వారా తమ అధికారానికి సామాజిక ఆమోదం పొందడానికి ప్రయత్నించారు. రాష్ట్రకూట, ప్రతీహార, గుర్జర తదిత సామ్రాజ్యాలకు చెందిన చక్రవర్తుల వద్ద తొలుత సైనిక దళాధిపతులుగా, తర్వాత ఆయా ప్రాంతాల రాజ ప్రతినిధులుగా వ్యవహరించినవారు ఆ తర్వాత కాలంలో ఆ పెద్ద సామ్రాజ్యాలు బలహీనపడి పతనం కావడంతో తమను తాము స్వతంత్ర రాజులుగా ప్రకటించుకున్నారు. ముఖ్యంగా ప్రతీహార సామ్రాజ్యం విచ్ఛిన్నం అనంతరం అనేక రాజపుత్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి. కనూజ్‌కు చెందిన గహడవాలాలు, మాళ్వకు చెందిన పరమారులు, అజ్మీర్‌కు చెందిన చౌహాన్‌లు ముఖ్యులు. జబల్ పూర్ ప్రాంతంలో కాలాచురిలు, బుందేల్ ఖండ్ ప్రాంతంలో చండెల్లాలు, గుజరాత్ ప్రాంతంలో చాళుక్యులు, డిల్లీ ప్రాంతంలో తొమార్‌లు తక్కిన కొన్ని చిన్న రాజ్యాలు. కనూజ్ ప్రాంతం నుండి గహడవాలాలు క్రమంగా బీహార్ నుండి పాల ప్రభువులను వెనక్కి నెట్టి వారణాసిని తమ రెండవ రాజధానిగా ప్రకటించుకున్నారు. చౌహాన్‌లు అజ్మీర్‌ను రాజధానిగా చేసుకుని పాలిస్తూ క్రమంగా గుజరాత్ , పంజాబ్, డిల్లీల వైపు విస్తరించారు. ఈ క్రమంలో చౌహాన్‌లకు గహడవాలాలతో ఘర్షణలు తలెత్తాయి. ఈ ఘర్షణల కారణంగానే రాజపుత్రులు గజనీవాదులపై జరిగిన యుద్ధాల్లో పాలు పంచుకోలేకపోయారు.


రాజపుత్ర సమాజానికి పునాది తెగ. ప్రతీ తెగకూ దాని సైజును బట్టి 12, లేదా 24, లేదా 48, లేదా 84 గ్రామాలు ఉండేవి. తెగ ముఖ్యుడు గ్రామాల్లోని భూమిని తన కింద పని చేసే ఉప ముఖ్యులకు కేటాయించేవాడు. వాళ్ళు ఆ భూమిని మళ్ళీ రాజపుత్ర యోధులకు విడివిడిగా కేటాయించేవారు. భూమికి,

❝ రాజపుత్రులు అనే పదం ఒక జాతిని సూచించేది కాదు. పలు తెగలకు చెందినవారు తదనంతర కాలంలో తమను తాము రాజపుత్రులుగా ప్రకటించుకున్నారు. 'రాజ' వంశంనుండి వచ్చినట్టు చెప్పుకోవడం ద్వారా తమ అధికారానికి సామాజిక ఆమోదం పొందడానికి ప్రయత్నించారు. రాష్ట్రకూట, ప్రతీహార, గుర్జర తదిత సామ్రాజ్యాలకు చెందిన చక్రవర్తుల వద్ద తొలుత సైనిక దళాధిపతులుగా, తర్వాత ఆయా ప్రాంతాల రాజ ప్రతినిధులుగా వ్యవహరించినవారు. ❞




కుటుంబానికి, ప్రతిష్టకు రాజపుత్రులు చాలా ప్రాధాన్యతనిచ్చేవారు. సాధారణంగా రాజపుత్ర రాజ్యానికి రాజుగా ఉండేవాడి రక్త సంబంధీకులే ముఖ్యులుగా, ఉప ముఖ్యులుగా ఉండేవారు. ప్రత్యేక పరిస్థితులు తలెత్తితే తప్ప ముఖ్యుల పదవులు వంశపారంపర్యంగా కొనసాగుతూవుండేవి. ఈ తరహా ఏర్పాటు రాజపుత్ర సమాజంలో రక్తసంబంధీకుల నడుమ ఒక విధమైన సమాన స్థాయిని నెలకొల్పింది. ఇది సానుకూలమైన అంశం. ఐతే, వివిధ ముఖ్యుల మధ్య ఘర్షణలు తరుచూ తలెత్తుతూవుండడం ఒక సమస్యగా ఉండేది. ఈ ముఖ్యుల్లో ఎవరికి వారు తామే తక్కిన వారికన్నా ఎక్కువ అన్న అభిప్రాయాన్ని కలిగివుండేవారు. కాజపుత్రులు కాని తక్కిన తరగతుల ప్రజానీకాన్ని తక్కువగా చూసేవారు. ప్రజలలో రాజపుత్రులు కానివారే అధికసంఖ్యలో ఉండేవారు. ఇప్పటికీ రాజస్తాన్‌లో రాజపుత్రుల శాతం పది మాత్రమే.

**"రాజపుత్రుల కాలంలో కళలు, సాహిత్యం చాలా ఆదరణ పొందాయి. చాళుక్యరాజు భీముడి దగ్గర మంత్రిగా పని చేసిన వాస్తుపాలుడు రచయితగా, పండితుల పోషకుడిగా పేరు పొందాడు. అతడి నేతృత్వంలో మౌంట్ అబు వద్ద అందమైన జైన దేవాలయం నిర్మించారు. సంస్కృత భాష, సాహిత్యం పరమార రాజుల కాలంలో ఆదరణ పొందాయి. ఉజ్జయిని, ధారా నగరాలు ఈ రాజులకు ముఖ్యపట్టణాలు. సంస్కృతంతోబాటు స్థానికుల భాషలైన అపభ్రంశం, ప్రాకృతం లలో కూడా చాలా కావ్యాలు రచించారు."**



దీనివలన రాజపుత్రులకు, తక్కిన ప్రజలకు మధ్య అంతరాలు పెరుగుతూవచ్చాయి.

రాజపుత్రులకు యుద్ధం అనేది ఒక క్రీడగా ఉండేది. దానికి తోడు భూమి కోసం, పశు సంపద కోసం వివిధ రాజపుత్ర రాజ్యాలమధ్య ఎప్పుడూ యుద్ధాలు జరుగుతూనేవుండేవి. దసరా పండుగ అనంతరం పొరుగురాజ్యం మీద దండెత్తే రాజే ఆదర్శవంతమైన రాజుగా పరిగణించబడేవాడు. ఈ యుద్ధాల కారణంగా గ్రామాల్లో, నగరాల్లో ఉండే ప్రజలు నానా ఇబ్బందులూ పడేవారు. రాజపుత్ర రాజులు హిందూ మతాన్ని బాగా పోషించారు. దానితోబాటు జైన మతాన్ని కూడా ఆదరించారు. కుల వ్యవస్థకు బలంగా మద్దత్తునిచ్చారు. బ్రాహ్మణులకు పలు సదుపాయాలు, విరివిగా దానాలు ఇచ్చారు. బ్రాహ్మణులకు ఇచ్చిన భూములపై శిస్తు చాలా తక్కువగా వసూలు చేసేవారు. ఈ పద్ధతి బ్రిటిష్ పాలన అంతమై, ఆ రాజ్యాలు భారతయూనియన్‌లో విలీనం అయేవరకూ కొనసాగుతూనేవుంది. ఇందుకు బదులు బ్రాహ్మణులు ఆయా రాజులు నిజమైన క్షత్రియ వంశం నుండి వచ్చినవారేనని, ముఖ్యంగా చంద్ర వంశానికో, లేక సూర్య వంశానికో చెందినవారని ప్రకటించేవారు.

క్రీ.శ.10-12 శతాబ్దాల మధ్య కాలంలో ఉత్తర భారతంలో దేవాలయాల నిర్మాణం ఉచ్ఛస్థితికి చేరిందని చెప్పవచ్చు. ఈనాడు మనం చూస్తున్న అద్భుతమైన దేవాలయాల్లో చాలా వరకూ ఈ కాలంలో నిర్మించినవే. ఈ తరహా నిర్మాణశైలి ఉత్తర భారతంలో, దక్కను ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్య దేవత విగ్రహం పైన చాలా ఎత్తుగా వలయాకారంలో గోపురాన్ని నిర్మించడం ఈ శైలిలో కనిపిస్తుంది. ముఖ్యదేవత ఉండే గదిని గర్భగృహం అంటారు. దానికి పక్కన మండపం ఉంటుంది. మొత్తం దేవాలయం చుట్టూ ఎత్తైన గోడలతో ప్రాకారాన్ని నిర్మిస్తారు. దానికి చాలా పెద్ద ద్వారాలను, తలుపులను అమర్చుతారు. ఖజురహో (మధ్యప్రదేశ్), భువనేశ్వర్ (ఒడిశా) ల్లో ఈ తరహా దేవాలయాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఖజురహో లో పార్శ్వనాథ దేవాలయం, విశ్వనాథ దేవాలయం, కందర్య మహదేవ దేవాలయం చాలా మంచి ప్రమాణాలతో పూర్తిస్థాయిలో నిర్మించారు. ఆ దేవాలయాల గోడలపై చెక్కిన శిల్పాల సౌందర్యం ఆనాటి శిల్పకళ సాధించిన అభివృద్ధిని సూచిస్తుంది. క్రీ.శ.9 నుండి 13వ శతాబ్దం వరకూ ఆ ప్రాంతాన్ని పాలించిన చందెల్లా రాజపుత్రుల కాలంలో ఈ దేవాలయాలు నిర్మించబడ్డాయి. ఒడిశాలో 11వ శతాబ్దానికి చెందిన లింగరాజ దేవాలయం, కోణార్క్‌లోని సూర్యదేవాలయం, పూరీలోని జగన్నాధస్వామి దేవాలయం ఈ కాలానికి చెందినవే. మధుర, వారణాసి, దిల్వారా వంటి చోట్ల దేవాలయాలుకూడా ఈకాలానివే. దేవాలయాలు సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్రాలుగా విలసిల్లాయి. సోమనాధ దేవాలయం వంటివి చాలా ధనవంతమైనవి. ఆ దేవాలయం ఆధ్వర్యంలో అనేక గ్రామాలు ఉండేవి. ఆ దేవాలయం తరఫున వ్యాపారం కూడా నిర్వహించేవారు. (చూ. కోణార్క్ దేవాలయం, ఒక వైపు నుంచి)

రాజపుత్రుల కాలంలో కళలు, సాహిత్యం చాలా ఆదరణ పొందాయి. చాళుక్యరాజు భీముడి దగ్గర మంత్రిగా పని చేసిన వాస్తుపాలుడు రచయితగా, పండితుల పోషకుడిగా పేరు పొందాడు. అతడి నేతృత్వంలో మౌంట్ అబు వద్ద అందమైన జైన దేవాలయం నిర్మించారు. సంస్కృత భాష, సాహిత్యం పరమార రాజుల కాలంలో ఆదరణ పొందాయి. ఉజ్జయిని, ధారా నగరాలు ఈ రాజులకు ముఖ్యపట్టణాలు. సంస్కృతంతోబాటు స్థానికుల భాషలైన అపభ్రంశం, ప్రాకృతం లలో కూడా చాలా కావ్యాలు రచించారు. జైన పండితులు ప్రధానంగా ఈభాషలలో సాహిత్యం సృష్టించారు. ఆధునిక భాషలైన హిందీ, బెంగాలీ, మరాఠీ వంటివి ఈ స్థానిక భాషలనుండే అభివృద్ధి చెందాయి.

**(తరువాయి వచ్చే మాసం)**

**ఈ మాసం ప్రత్యేకం**

## ఉత్తరాఖండ్ యూనిఫాం సివిల్ కోడ్

# వ్యక్తిగత జీవితాలపై ప్రభుత్వ నియంత్రణ



రచయిత సీనియర్ జర్నలిస్టు. ఫ్రంట్‌లైన్ పత్రికలో పాతికేళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆ పత్రిక డిప్యూటీ ఎడిటర్ బాధ్యతలు చూస్తున్నారు

**టికె రాజలక్ష్మి**

ఉత్తరాఖండ్ రాష్ట్రం దేశంలో మొట్టమొదటిసారిగా యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి)ను అమలు చేసిన రాష్ట్రంగా నిలిచింది. అయితే జనవరి 27న అమలులోకి వచ్చిన ఈ కోడ్ వివాహాలు, విడాకులు, దాంపత్య వివాదాలు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లు, వారసత్వం, పోదుపు వంటివాటిలో ప్రభుత్వ నియంత్రణ పెంచుతుందని, వ్యక్తిగత సంబంధాల్లో ప్రభుత్వ జోక్యాన్ని ప్రోత్సహిస్తోందని విమర్శలు వచ్చాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును ఉత్తరాఖండ్ అసెంబ్లీ 2024 ఫిబ్రవరిలో ఆమోదించింది. మార్చి 2024లో రాష్ట్రపతి ఆమోదం తర్వాత నోటిఫై అయింది. 2025 జనవరి 20న ఈ కోడ్‌ను అమలు చేసేందుకు అవసరమైన నియమాలను రాష్ట్ర క్యాబినెట్ కూడా ఆమోదించింది. మహిళలకు నిజమైన సాధికారితను కల్పిస్తున్నామని, వివక్షను అంతం చేస్తున్నామని ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ సందర్భంగా ప్రకటించింది. ఆర్భాటంగా చేసిన ఈ ప్రకటనల్లోని అసలు వాస్తవమెంత? యూనిఫాం సివిల్ కోడ్‌లో అసలు ఏముంది?

సాధారణంగా ఏ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే చట్టాలైనా ఆ రాష్ట్ర పరిధిలోనే చెల్లుబాటవుతాయి. సమాఖ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఈ అంశాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం విస్మరించింది. యుసిసిని ఉత్తరాఖండ్ వాసులు వారి నివాస ప్రాంతాలను వదిలి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వర్తించేలా రూపొందించింది. వివాహం, విడాకులు, వారసత్వం, పోదుపు, దాంపత్య వివాదాలు, లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల నమోదు, వాటి ముగింపులను దీనిలో వివరించారు. ఒకరు విదేశీ పౌరుడు కాగా, మరొకరు ఉత్తరాఖండ్‌కు చెందినవారైనా ఈ చట్టం వర్తిస్తుంది. అయితే ఈకోడ్‌లో షెడ్యూల్డ్ తెగలను మినహాయింపు ఇచ్చారు. భారత రాజ్యాంగంలోని 21వ భాగం కింద సంప్రదాయ హక్కులను రక్షించినట్లు కోడ్ తెలిపింది. అలాగే, ఎల్‌జిబిటిక్యు వ్యక్తుల వివాహాలు, లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లు ఈ కోడ్ పరిధిలోకి రాకుండా వదిలేశారు. ట్రాన్స్‌జెండర్, ఒకే లింగ సంబంధ వివాహాల గురించి ఏ విధమైన ప్రస్తావనా ఈ కోడ్‌లో లేదు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, అస్సాం వంటి ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా ఉత్తరాఖండ్ నమూనాను అనుసరించబోతున్నట్లు తెలిపాయి. దీనిని అమలుచేసిన రోజు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ ‘వివక్షను తొలగించే రాజ్యాంగవరమైన చర్య’ గా దీనిని అభివర్ణించారు. మహిళల నిజమైన సాధికారతకు యుసిసి దారి తీస్తుందని చెప్పారు. బాల్య వివాహాలు, ట్రిపుల్ తలాక్‌లతో పాటు ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండటంతదితరాలను పూర్తిగా నిరోధించవచ్చని అన్నారు. ఈ నియమాలను పటిష్టంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శి స్థాయికి తక్కువ కాని అధికారిని రిజిస్ట్రార్ జనరల్‌గా నియమించింది. ఆయన ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రిజిస్ట్రార్లు–సబ్‌రిజిస్ట్రార్లు ఉంటారు.

**నమోదు తప్పని సరి**

యుసిసి ప్రకారం, ప్రతి వివాహాన్ని, విడాకులను తప్పని సరిగానమోదు చేయాలి. అలా నమోదు చేయనివారిపై జరిమానాలు విధిస్తారు. వివాహానికి నమోదు కోసం దరఖాస్తు చేసిన తర్వాత రిజిస్ట్రార్ తక్షణ విచారణ నిర్వహించాలి. ఏ కారణాల వల్లనైనా విచారణ జరగకపోతే ఆ విషయాన్ని రిజిస్ట్రార్ జనరల్‌కు తెలియజేయాలి. ఆ తరువాత సంబంధిత దరఖాస్తు రిజిస్ట్రార్ జనరల్ పరిధిలోకి వెల్తుంది. ఒకవేళ రిజిస్ట్రార్ దరఖాస్తును తిరస్కరిస్తే రిజిస్ట్రార్ జనరల్ 60 రోజుల్లోగా తుది నిర్ణయం ప్రకటించాలి. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఇదే సూత్రం వర్తిస్తుంది.

**దరఖాస్తులు తిరస్కరించే పరిస్థితులు**

ఇద్దరిలో ఎవరికైనా వివాహ సమయంలో భార్య/భర్త ఉన్నా, ఎవరికైనా వివాహానికి సమ్మతి ఇవ్వలేని స్థితి లేదా మానసిక వ్యాధి, ఉన్నా , ఇద్దరిలో ఎవరైనా లివ్ ఇన్ రిలేషన్‌లో ఉండి, దానిని కొనసాగిస్తూ ఉన్నా దరఖాస్తును తిరస్కరిస్తారు. దీని అర్థం

దరఖాస్తుదారులు తమకు గతంలో ఉన్న సంబంధాల గురించి, లివ్ ఇన్ రిలేషన్‌లతో సహా అన్ని అంశాలు రిజిస్ట్రార్‌కు వివరించారు. తప్పు సమాచారం ఇచ్చినా, నిర్ణీత గడువులో పూర్తి సమాచారం అందించకపోయినా దరఖాస్తును తిరస్కరిస్తారు. ఈ యుసిసి చాలా వరకు హిందూ మేరేజ్ యాక్టు లక్షణాలను తీసుకుని, దానిని అన్ని మతాల వారికి వర్తింపచేసేలా రూపుదిద్దుకుంది.

**నిషిద్ధ సంబంధాలు**

యూనిఫాం సివిల్ కోడ్ కొన్ని ‘నిషిద్ధ సంబంధాలను’ కూడా నిర్వచించింది. మొదటి కజిన్స్ మధ్య వివాహాలను అనుమతించ కూడదు అని దీనిలో పేర్కొన్నారు. అయితే, మత గురువు ధ్రువీకరించి, అది ఆ సమాజ సంప్రదాయాల్లో నడిచే సంబంధమేనని రాసిచ్చినట్లయితే మాత్రమే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవచ్చు. అయినప్పటికీ, అది ప్రజా నీతి, నైతిక విలువలకు వ్యతిరేకంగా ఉంటే, సంబంధిత దరఖాస్తును తిరస్కరించవచ్చు. యుసిసి అమలుకన్నా ముందు జరిగిన వివాహాల విషయానికొస్తే ఏదైనా

**"వివాహాలను ధ్రువీకరించేందుకు తత్కాల్ విధానాన్ని కూడా యుసిసి అమలులోకి తీసుకువచ్చింది. పాస్‌పోర్ట్‌లు, రైల్వే టిక్కెట్లు మంజూరు చేసే తరహాలోనే ఈ విధానం కూడా పనిచేస్తుంది. దీని ప్రకారం దరఖాస్తులను అధికారులు మూడు రోజుల్లోనే పరిష్కరించాల్సి ఉంది. యుసిసి ప్రకారం వివాహ నమోదు తప్పనిసరి మాత్రమే కాదు. వివాహమైన తరువాత దంపతులకు ప్రభుత్వం నుండి లభించే అనేక ప్రయోజనాలను, పథకాలను కూడా దీనితో అనుసంధానించారు."**

వివాహం జరిగినట్టు చట్టబద్ధమైన ఆధారాలు (వేడుకల వంటి సంప్రదాయ కార్యక్రమాలు) లేకపోతే, వివాహం తరువాత దంపతులు భార్యభర్తలుగా కలిసి ఉండకపోయినా అటువంటి పెళ్లిలను తిరస్కరించే హక్కు అధికార యంత్రాంగానికి ఉంది, అయితే, ఈ తిరస్కరణపై 30 రోజుల వ్యవధిలో అప్పీలు చేసుకోవచ్చు

వివాహాలను ధ్రువీకరించేందుకు తత్కాల్ విధానాన్ని కూడా యుసిసి అమలులోకి తీసుకువచ్చింది. పాస్‌పోర్ట్‌లు, రైల్వే టిక్కెట్లు మంజూరు చేసే తరహాలోనే ఈ విధానం కూడా పనిచేస్తుంది. దీని ప్రకారం దరఖాస్తులను అధికారులు మూడు రోజుల్లోనే పరిష్కరించాల్సి ఉంది. యుసిసి ప్రకారం వివాహ నమోదు తప్పనిసరి మాత్రమే కాదు. వివాహమైన తరువాత దంపతులకు ప్రభుత్వం నుండి లభించే అనేక ప్రయోజనాలను, పథకాలను కూడా దీనితో అనుసంధానించారు. అంటే, నూతన దంపతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తమ వివాహాన్ని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే చట్టాల ప్రకారం నమోదు కాని వివాహాల దరఖాస్తులను కూడా తిరస్కరిస్తామని యుసిసిలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇప్పటి వరకు వివాహాల నమోదును తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వంగానీ, ఏ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు గానీ చట్టాలు చేయలేదు.

**2010 ఉత్తరాఖండ్ చట్టంపై ప్రభావం**

2010లోనే వివాహాల తప్పనిసరి రిజిస్ట్రేషన్ చట్టాన్ని ఉత్తరాఖండ్ రూపొందించింది. (తాజా యుసిసి అమలుతో అది రద్దయింది) అయితే, ఇప్పటిదాకా ఆ చట్టంలో నమోదు చేసిన వివాహాలు మళ్లీ నమోదు చేయాల్సిన అవసరం లేదని యుసిసి నిబంధనల్లో పేర్కొన్నారు. అయితే, యుసిసి అమలైన ఆరు నెలల లోపు వివాహాన్ని నమోదు చేసినట్లు ఒక డిక్లరేషన్‌ను సంబంధిత సబ రిజిస్ట్రార్ ముందు దాఖలు చేయాలి. 2010 చట్టానికి ముందు జరిగిన వివాహాలను మాత్రం తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సిందేనని పేర్కొన్నారు. అలాగే, విడాకులు పొందిన దంపతులు సైతం (కోర్టు తీర్పు ప్రకారం, లేదా సంప్రదాయ రీతిలో విడాకులు పొందినా) వాటి నమోదు కోసం ఒక మెమోరాండంను సంబంధిత అధికారికి సమర్పించాలి. లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం జరిమానా విధిస్తుంది. యుసిసి అమలయ్యాక సంప్రదాయంగా తీసుకున్న విడాకులను రిజిస్ట్రార్ తిరస్కరించవచ్చు.

**లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లపై నియంత్రణలు**

లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ల విషయంలో యుసిసి జోక్యం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వారైనప్పటికీ ఈ తరహా సంబంధాల్లోకి ప్రవేశించాలంటే తప్పనిసరిగి నమోదు చేసుకోవాలని యుసిసి పేర్కొంది. అలాగే విడిపోయిన సమయంలోనూ ఆ సంబంధాన్ని ముగించినట్లు తెలియచేసే మెమోరాండాన్ని తప్పనిసరిగా అందజేయాలి. ఇక్కడ ఒక కీలకమైన విషయం ఏమిటంటే వివాహానికి పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 18 సంవత్సరాల కనీస వయసు ఉండాలన్న నిబంధన తెలిసిందే. అయితే, లివ్ ఇన్ రిలేషన్ షిప్‌కు మాత్రం ఇరువురికి 21 సంవత్సరాల వయసు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళ గర్భవతైతే, ఆ సంబంధాన్ని ముగించేందుకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఆ విషయాన్ని తప్పనిసరిగా రిజిస్ట్రార్‌కు తెలియజేయాలి.

వివాహాలకు వర్తించే అన్ని నిషిద్ధ సంబంధాల నిబంధనలు లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లకూ వర్తిస్తాయి. యుసిసిలోని 380 సెక్షన్‌లో యే పరిస్థితుల్లో లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌ను నమోదు చేయకూడదో సవివరంగా తెలియచేశారు. సెక్షన్ 385 ప్రకారం లివ్ ఇన్ రిలేషన్ షిప్ కోసం దరఖాస్తు అందుకున్న తరువాత సంబంధిత రిజిస్ట్రార్ ఆ సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపించాలి. అలాగే, ఆ సంబంధంలో ఉండాలనుకుంటున్న వారి వయసు 21 ఏళ్లలోపు ఉంటే ఆ సమాచారాన్ని వారి తల్లితండ్రులకు లేదా సంరక్షకులకు తెలియచేస్తారు. దరఖాస్తుదారుల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలు, వారి తల్లిదండ్రులు, లీగల్ గార్డియన్, మత గురువు లేదా సామాజిక నాయకుల వివరాలను ధ్రువపరుచుకునేందుకు రిజిస్ట్రార్ అవసరమైన విచారణ నిర్వహిస్తారు. ఈ సందర్భంగానే గతంలో ఉన్న సంబంధాల వివరాలను కూడా పూర్తి స్థాయిలో ఇవ్వాల్సిందేనని యుసిసి నిబంధనల్లో పేర్కొన్నారు.

**రిజిస్ట్రేషన్ విధానం ఇలా...**

యుసిసి సెక్షన్ 381, ఛాప్టర్ 5, ఉపవిభాగం 1ప్రకారం, కోడ్ అమలయ్యే


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

సమయానికి ఇప్పటికే లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నవారు, అలాగే ఇకపై అలాంటి బంధంలోకి వెళ్లబోయేవారు అని రెండు బృందాలుగా విభజించారు. కలిసి నివసించకముందే దరఖాస్తు చేసుకున్న జంటలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇస్తారు. ఇది 30 రోజులు అమలులో ఉంటుంది. అవసరమైతే దీనిని మరో 15 రోజులు పొడిగించవచ్చు. దరఖాస్తు సమయంలో వారు కలిసి నివాసం ఉండే చిరునామాను తప్పనిసరిగా అధికారులకు అందజేయాల్సిఉంటుంది. విచారణ నిర్వహించిన తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

**రిజిస్ట్రేషన్ చేయకపోతే శిక్షలు**

లివ్ ఇన్ రిలేషన్‌లో ఒక నెలరోజుల పాటు కలిసి ఉండిన తరువాత కూడా రిజిస్ట్రార్‌కు తెలియపర్చకపోతే ఆ జంటను అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తారు. వారికి మూడు నెలల జైలు శిక్షతో పాటు, 10 వేల రూపాయల జరిమానాను శిక్షగా పేర్కొన్నారు. తప్పు సమాచారం ఇస్తే 25 వేల రూపాయల జరిమానా, మూడు నెలల జైలును శిక్షగా పేర్కొన్నారు. వివాహాలు లేదా విడాకులను నమోదు చేయకపోతే కూడా శిక్షలు విధిస్తారు.

**ఫిర్యాదులపై స్పందన**

సబ్– రిజిస్ట్రార్‌కు ఏదైనా ఫిర్యాదు లేదా సమాచారం అందితే ,దానిపై 30 రోజుల్లోపు మెమొరాండం సమర్పించాలని నోటీసు జారీ చేస్తారు. ఆ తరువాత వివాహం లేదా దాని రద్దును నమోదు చేస్తారు. అనంతరం ఆ ప్రక్రియను అధికారి జోక్యానికన్నా ముందే సజావుగా చేయనందుకు ఆ జంట పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. సబ్ రిజిస్ట్రార్ పంపిన నోటీసు కూడా తీసుకోకుండా కాలయాపన చేస్తే 25 వేల రూపాయల మొత్తాన్ని జరిమానాగా చెల్లించాల్సిఉంటుంది.

**యుసిసిపై వ్యతిరేకత ఎందుకు?**

ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ యూనిఫామ్ సివిల్ కోడ్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అనేక కారణాలతో

ముస్లిం సంస్థలు, పలువురు వ్యక్తులు, సంఘాలు పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే, లివ్ ఇన్ రిలేషన్ షిప్ నమోదు చేయడం ప్రైవసీ హక్కు ఉల్లంఘన కాదన్న అభిప్రాయం న్యాయవ్యవస్థలో కొందరిలో ఉంది. యుసిసి అమలులోకి వచ్చిన తరువాత ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఒక కేసు విచారణ సందర్భంగా "పెళ్లి చేసుకోకుండా యథేచ్ఛగా కలిసి జీవిస్తున్నావు' అని వ్యాఖ్యానించారు. బాహాటంగానే కలిసి నివసిస్తున్నప్పుడు అదే విషయాన్ని చెబితే గోప్యత ఉల్లంఘన ఎలా అవుతుందని ప్రశ్నించారు. మరో కేసు విచారణ సందర్భంగా యుసిసి కింద తప్పుడు ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తప్పుడు ఫిర్యాదులను, యుసిసిని దుర్వినియోగాన్ని నిరోధించేందుకు కొన్ని హెచ్చరికల్ని జారీ చేసింది.

**యూనిఫార్మ్ సివిల్ కోడ్‌లో 'యూనిఫార్మ్' ఎంత?**

యుసిసిని సమర్థించే వారు ఇది దేశంలో ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించాలనే రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల (డైరెక్టివ్ ప్రిన్సిపల్) భావనను ప్రతిబింబిస్తుందని చెబుతారు. అయితే రాజ్యాంగంలో పేర్కొన్న 'స్టేట్' అంటే కేంద్ర ప్రభుత్వం అని అర్థం చేసుకోవాలి. కానీ రాష్ట్రాలు విడివిడిగా సివిల్ కోడ్ మీద చట్టం తీసుకువస్తే 'యూనిఫార్మిటి'కి ఆటంకమవుతుంది. అదే విధంగా ఎస్‌టిలను మినహాయించడం కూడా ఏకరూపత భావనకు విరుద్ధం. పరస్పర అంగీకారంతో నెలకొనే సంబంధాలపై ఆంక్షలు పెట్టడం, చిన్న పిల్లల తరహాలో పెద్దవారిని నియంత్రించాలని చూడటం సబబు కాదని, ఒక్కోసారి ఇవి సమానత్వ భావనకు విరుద్ధంగా తయారవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కులాంతర వివాహాలకు, మతాంతర వివాహాలకు వ్యతిరేకంగా కూడా ఈ నిబంధనలను వినియోగించే ప్రమాదం ఉంది.

**ఆస్తి హక్కుల విషయంలో అసమానతలు**

యుసిసి కొడుకులు, కూతుళ్లకు సమాన ఆస్తి హక్కులు ఇస్తుంది. కానీ, ఆల్ ఇండియా డెమోక్రాటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) ఎత్తిచూపినట్లు సొంతదారులు తమ ఆస్తి మొత్తాన్ని విల్లు ద్వారా ఇతరులకు రాసే హక్కును కూడా ఇది ఇస్తుంది. 2005 హిందూ సక్సెషన్ యాక్ట్ ద్వారా వారసత్వపు ఆస్తిలో సమాన వాటాను పొందే హక్కును నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**ఏకపక్షమే...**

యుసిసి రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాన్ని సేకరించామని, అనేక సంప్రదింపులు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ వాస్తవం దానికి భిన్నం. సుమారు 200 పేజీల డ్రాఫ్ట్‌ను ఆమోదానికి ముందు చట్ట సభల సభ్యులు ఎవ్వరూ ఒక్కసారి కూడా పూర్తిగా చదివి సమీక్షించలేదని సమాచారం.

> "యుసిసి రూపకల్పనలో విస్తృత ప్రజాభిప్రాయాన్ని సేకరించామని, అనేక సంప్రదింపులు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ వాస్తవం దానికి భిన్నం. సు మారు 200 పేజీల డ్రాఫ్ట్‌ను ఆమోదానికి ముందు చట్ట సభల సభ్యులు ఎవ్వరూ ఒక్కసారి కూడా పూర్తిగా చదివి సమీక్షించలేదని సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా ఉత్తరాఖండ్‌లో యుసిసి రూపకల్పనకు బిజెపి సిద్ధపడింది."

**రాజకీయ ప్రయోజనాలే కీలకం**

పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా ఉత్తరాఖండ్‌లో యుసిసి రూపకల్పనకు బిజెపి సిద్ధపడింది.

ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో దేవాలయం నిర్మాణం, యుసిసిని దేశ ప్రజలకు పరిచయం చేయడం, వక్ఫ్ బిల్లు సవరణ ఇవ్వన్నీ బిజెపి రాజకీయ అజెండాలో భాగాలన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మహిళల కోసమే యుసిసిని తీసుకువచ్చినట్టు ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆసక్తి కరమైన అంశమేమిటంటే మహిళల హక్కులు కానీ, వారిని మరింత బలోపేతం చేసే సంస్కరణలు కానీ యుసిసి లక్ష్యాల్లో కనిపించవు. దీనిలో ప్రధాన సమస్య కూడా అదే!

(అనువాదం : పొగడ దొరువు)

# పహల్గామ్ దాడి: కాశ్మీర్‌లో అంతా బాగుందా?

(10వ పేజీ తరువాయి)

అయిన ప్రవీణ్ సాహ్నీ చెప్పేదాని ప్రకారం, మోడీ నేతఅత్వంలోని ప్రభుత్వం ఆగస్టు 2019లో ఆర్టికల్స్ 370, 35ఎ లను రద్దు చేసినప్పటి నుండి మూడు ప్రధాన అంశాలు కలిసి ముందుకు వచ్చాయి. “మొదటిది, కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులేర్పడ్డాయని మీడియా ఛానెల్‌లు నిరంతరం చేస్తున్న కథనం. పర్యాటకులు పహల్గామ్‌కు వెళ్లడానికి కూడా ఇదే దారితీసింది. వాస్తవికత ఏమిటంటే కాశ్మీర్ ఒక యుద్ధ ప్రాంతం,” అని సాహ్నీ చెప్పారు. కాశ్మీర్‌లో సాయుధ దళాల ఉనికిలో ఎటువంటి తగ్గుదల కనిపించడం లేదని అన్నారు. “ప్రతి శుక్రవారం, మిర్వైజ్ ఉమర్ ఫరూక్‌ను గఅహ నిర్బంధంలో ఉంచుతారు, ప్రార్థనలకు నాయకత్వం వహించడానికి అనుమతించరు.'' మిర్వైజ్ దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా గఅహ నిర్బంధంలో ఉన్నారు.

సాహ్నీ ఇలా అన్నాడు: “ఈ ప్రాంత జనాభా సమతుల్యత మార్చడానికి మీరు శాశ్వత నివాసం కోసం బయటి వ్యక్తులకు (కాశ్మీరీలు కానివారికి) 83,000 కంటే ఎక్కువ నివాస ధఅవీకరణ పత్రాలను జారీ చేశారు. ఆపై 50 మంది ఎమ్మెల్యేలచే ఎన్నుకోబడ్డ ముఖ్యమంత్రి ఉన్నారు. కానీ ఆయన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సహాయకుడిలా కనిపిస్తారు.”చేపలు పడుతుండవచ్చు.

రెండవ అంశం ఏమిటంటే, ప్రస్తుత పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ దేశీయంగా, అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అందుకే అతనుడ కల్లోలిత కాశ్మీర్‌లో జోక్యం చేసుకుంటుండవచ్చు.

**టిఆర్ఎఫ్‌పై అనుమానాలు**

పహల్గామ్ ఉగ్రవాద దాడి తామే చేసినట్లు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్), ప్రకటించింది. ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాను తొలగించిన వెంటనే, 2019 అక్టోబర్‌లో ఈ సంస్థ స్థాపించబడిందని తెలుస్తోంది.

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2023లో ఉపా చట్టం కింద దీనిని నిషేధించింది. పాకిస్తాన్ నుండి జమ్మూ కాశ్మీర్‌లోకి ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో ఈ సంస్థ పాల్గొంటున్నదని హోమ్ మంత్రిత్వ శాఖ తెలిపింది.

గతంలో కూడా, టిఆర్ఎఫ్ కాశ్మీరీయే తరులను, కాశ్మీరీ పండితులు, సిక్కులు వంటి మతపరమైన మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంది. 2021లో ప్రముఖ ఫార్మసిస్ట్ మఖన్‌లాల్ బింద్రూ, స్కూల్ ప్రిన్సిపాల్ సుపీందర్ కౌర్ హత్య వెనుక ఇది ఉంది. 2024లో గందేర్‌బాల్‌లోని ఒక ప్రైవేట్ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న పౌరుల హత్య, రియాసి యాత్రికులపై దాడికి ఇది కుట్ర పన్నింది.

2021 ఆగస్టులో శ్రీనగర్‌లో టిఆర్ఎఫ్ “కమాండర్” అబ్బాస్ షేక్‌ను, 2024 మేలో 18 కేసుల్లో వాంటెడ్ టిఆర్ఎస్ ఉగ్రవాది బాసిత్ దార్‌ను భద్రతా దళాలు చంపేశాయి. దాంతో సంస్థకు దాడి చేసే సామర్థ్యం తగ్గిపోయింది.

**చైనా అంశం**

సాహ్నీ చెప్పిన దాని ప్రకారం మూడవ ముఖ్యమైన అంశం చైనా: “చైనా యుద్ధాన్ని కోరుకోవడం లేదు, కానీ ఆగస్టు 2019 నుండి పాకిస్తాన్ సార్వభౌమత్వానికి మద్దతు ఇవ్వడానికి బీజింగ్ కట్టుబడి ఉంది. దీని అర్థం శాంతి,యుద్ధ సమయాల్లో చైనాకు చెందిన భారీ నాన్-కైనెటిక్ సామర్థ్యాలు పాకిస్తాన్ సైన్యానికి అందుబాటులో ఉంటాయి.”

చైనా, పాకిస్తాన్‌లను తరచుగా “విడదీయ రాని బంధం''గా అభివర్ణిస్తున్న ప్పటికీ, పాకిస్తాన్ చైనా మద్దతు చూసుకుని ఇలా మిడిసిపడుతోందా అనేది కీలకమైన ప్రశ్న.

ఏమైనా పహల్గామ్ సంఘటన కాశ్మీర్‌లో శాంతి ఎంత దుర్బలంగా ఉందో వెల్లడించింది. పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవడం వల్ల ఇప్పటికే అస్థిర ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. కాశ్మీరీలు మరోసారి రగులుతున్న హింసాకాండ, చిగురిస్తున్న ఆశల మధ్య చిక్కుకుపోయారు. యుద్ధనాదాలు, రాజకీయ సవాళ్లు, ప్రతిసవాళ్ల మధ్య చర్చలు అనే మరో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాల్సిన సమయమిది. ❃


**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# చంద్రబాబు నోట మోడి మాట



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

ఆరు నెలలు స్నేహం చేస్తే వారు వీరవుతారంటారు. చంద్రబాబునాయుడు దానిని నిజం చేస్తున్నారు. పెట్టుబడిదారులే సంపదలను సృష్టిస్తారని గతంలో మోడి చెప్పగా, ఇపుడు చంద్రబాబు అదే మాట చెబుతున్నారు. మే నెల 30వ తేదీన ఢిల్లీలో జరిగిన సిఐఐ సదస్సులోపాల్గొన్న ఆయన పారిశ్రామికవేత్తలే సంపదలను సృష్టిస్తారని పేర్కొన్నాడు. శ్రామికులే సకల సంపదలకు సృష్టికర్తలని, శ్రమయే సర్వస్వాన్ని సృష్టిస్తుందని కార్ల్‌మార్క్స్ చెప్పాడు. సమాజం అంతా ఈ వాస్తవాన్ని అంగీకరించింది. కార్మికుల శ్రమ–శారీరక, మేధో శ్రమ– లేకుండా పారిశ్రామికవేత్తలు సంపదలను సృష్టించటం కాదు కదా, కనీసం ఒక్క బోల్ట్‌ను కూడా తయారు చేయలేరు.

''ఊరకరారు మహాత్ములు'' అన్న చందంగా గొప్పవారు మాటలు కూడా ఊరికే మాట్లాడరు. కాబట్టి చంద్రబాబునాయుడు గారు కూడా ఆ మాటలను ఊరికే చెప్పి ఉండరు. మరి ఆయన మాటల వెనుక మర్మమేమి? రాష్ట్రంలోని సంపదలన్నింటినీ పెట్టుబడిదారులకు అప్పగించటానికి ఆయన పూనుకున్నాడు. ప్రజలు దానిని ప్రశ్నించకుండా ఉండటానికి ఈ పల్లవి అందుకున్నాడు. రాజధానికి గతంలో సేకరించిన 35 వేల ఎకరాలకు తోడు మరో 44 వేల ఎకరాల భూమిని సమీరిస్తామని ప్రకటించాడు. భూములు తీసుకొని పదేళ్ళు దాటుతున్నా రాజధాని నిర్మాణానికే దిక్కులేక, తీసుకున్న 35 వేల ఎకరాలలో తొండలు గుడ్లు పెడుతుంటే అదనంగా 44 వేల ఎకరాలు ఎందుకు? సంపద సృష్టికర్తల పేరుతో పెట్టుబడిదారులకు అప్పగించటానికేనా? గిరిజన ప్రాంతాలలో గనుల తవ్వకానికి, పవర్ ప్రాజెక్టుల పేరుతో పెట్టుబడిదారులను ప్రవేశపెట్టటానికి ఆటంకం లేకుండా చేసుకోవటానికి ఈ నినాదాన్ని ఉపయోగిస్తారు. వ్యతిరేకించిన వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా, సంపదలు సృష్టించి గిరి జనులను అభివృద్ధి చేస్తుంటే చూడలేకపోతున్నారని చెప్పటానికి పనికొస్తుంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోని భూములపై అయినా పెట్టుబడిదారుల కన్ను పడితే అభివృద్ధి పేరుతో ఆ భూములను రైతుల నుండి లాక్కోవటం సులభమౌతుంది.

ఈ నినాదాన్ని ప్రజల చేత నమ్మించగలిగితే ప్రభుత్వసంస్థల ప్రైవేటీకరణ కూడా సులభమౌతుంది. విశాఖ ఉక్కుఫ్యాక్టరీని ప్రభుత్వరంగంలోనే ఉంచాలనే భావన కూడా బలహీనపడుతుంది. పెట్టుబడిదారులే సంపదలు సృష్టిస్తుంటే ఇక ఏ సంస్థ అయినా ప్రభుత్వరంగంలో ఉండాల్సిన పనేముంది? కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉన్న విద్యుత్ రంగం లాంటి వాటిని కూడా సులభంగా ప్రైవేటు వారికి అప్పగించవచ్చు.

రాష్ట్రంలో దరిద్రం లేకుండా చేయటానికి "4పి" లను అమలు చేస్తామని, సమాజంలో పైస్థాయిలో ఉన్న 10 శాతం మంది కిందిస్థాయి–దరిద్రం–లో ఉన్న 20 శాతం మందిని పైకి తీసుకొస్తారని, అదే 4పి విధానమని చంద్రబాబుగారు ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు సంపదలు సృష్టిస్తారని సిఐఐ సదస్సులో చెప్పిన చంద్రబాబునాయుడుగారు ''4పి''లలో చివరి"పి" దరిద్రంలో ఉన్న 20 ప్రజలను గురించి ఎందుకు చెప్పలేదబ్బా! మర్చిపోయుంటారా! గొప్పవారి మాటలకు పలు అర్థాలు ఉన్నట్లే మరపులో కూడా మర్మాలుంటాయి. పెద్దవారు దరిద్రులను పైకి తీసుకువస్తారని చంద్రబాబుగారికి నమ్మకం ఉంటే పెద్దవారిని ఒప్పించటానికి అదే కార్యక్రమంగా ఆయన ఉండాలి కదా! దావోస్‌లో ఆయన పాల్గొన్న సభలు, సిఐఐ సదస్సులో మా రాష్ట్రంలో "4వ పి"ని మీరు ఉద్ధరించాలని చెప్పాలి కదా! కాని అక్కడ మాట మాత్రం ప్రస్తావన కూడా లేదు. పేదల దగ్గరకువచ్చినపుడు మాత్రం ధనికులు మీ దరిద్రాన్ని పోగొడతారని చెబుతున్నాడు. ఇలా ఎందుకు చెబుతున్నాడంటే పేదల దరిద్రాన్ని పోగొట్టటానికి పెట్టుబడిదారులు, ధనికులు ఏమీ చేయరని ఆయనకు బాగా తెలుసు. కాబట్టి వారికి చెప్పటం లేదు. ధనికులు తమ దరిద్రాన్ని పోగొడతారని పేదలను నమ్మించాలి. అందుకే పేదల వద్ద చెబుతున్నాడు. చంద్రబాబు మాటల మాంత్రికుడా లేక బడా మోసకారా?

**ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పహల్గాం హత్యాకాండ**

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో టెర్రరిస్టుల హత్యాకాండపై దేశం యావత్తు స్పందించింది. టెర్రరిజాన్ని అంతం చేయటానికి రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. అదే సమయంలో పహల్గాంలో టెర్రరిస్టులు మారణకాండకు పాల్పడటానికి అవకాశాలున్నాయని ముందుగా తెలిసినప్పటికీ దానిని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని కూడా ప్రశ్నించాయి. టెర్రరిస్టులు దాడి చేస్తారన్న అంశాన్ని ఇంటెలిజెన్స్ సంస్థలు ముందుగానే ప్రభుత్వానికి అందించాయని, దానితో ప్రధాని తన కాశ్మీర్ పర్యటనను రద్దు చేసుకొన్నప్పటికీ, టెర్రరిస్టులను ఎదుర్కోవటానికి, టూరిస్టులను

> **❝ పహల్గాంలో హత్యాకాండకు పాల్పడిన టెర్రరిస్టుల లక్ష్యం ఏమిటో దేశ ప్రజలందరికీ స్పష్టమైంది. యాత్రీకులు ఏ మతానికి చెందిన వారో తెలుసుకొని, ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకొని హత్యాకాండ సాగించారు. మతం పేరుతో మనదేశ ప్రజల మధ్య చీలికలు తీసుకురావాలనేది వారి లక్ష్యం. కాని వారు కొందరు యాత్రీకులను హత్య చేయగలిగినప్పటికీ, దేశప్రజల మధ్య చీలికలను మాత్రం తీసుకు రాలేకపోయారు. ❞**

కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే చెప్పాడు. ఆయన ప్రకటనను బిజెపి ఖండించింది. కాని సున్నితమైన, రక్షణ బలగాలు కేంద్రం ఆధీనంలో పని చేస్తున్న సరిహద్దు రాష్ట్రం జమ్మూ కాశ్మీర్‌లో టెర్రరిస్టులు ఇంతటి మారణకాండ ఎలా చేయగలిగారనన్న అంశంపై ప్రభుత్వం వైపు నుండి తగిన వివరణ లేదు.

పహల్గాం హత్యాకాండకు ముందు ఇంటెలిజెన్స్ సంస్థల సమాచారం ఇచ్చాయా లేదా అన్న అంశంతో పాటు పాకిస్తాన్ మద్దతున్న, ఆ దేశంలో స్థావరాలను ఏర్పాటు చేసుకొని టెర్రరిస్టులు జమ్మూకాశ్మీర్‌లో దాడులు, హత్యాకాండకు పాల్పడుతున్నపుడు అక్కడ రక్షణ చర్యలు ఎలా ఉండాలన్న అంశం కూడా కీలకమైనది. టెర్రరిస్టుల స్థావరాలు పాకిస్తాన్‌లో ఉన్నాయని, అదను చూసుకొని వారు కాశ్మీర్‌లో చొరబడి కల్లోలం సృష్టిస్తున్నారన్న విషయం ప్రభుత్వానికి తెలియనిది కాదు. మోడి నాయకత్వంలో బిజెపి రెండవ సారి ఎన్నికలలో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత జమ్మూకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 375, 35ఎ లను రద్దు చేసింది. దానితో కాశ్మీర్ ప్రజలలో తీవ్ర వ్యతిరేకత రావటం, ప్రభుత్వం అణచివేత చర్యలు తీసుకోవటం, దాదాపు ఆరు మాసాల పాటు ఇంటర్‌నెట్‌ను కూడా బంద్ చేయటం తెలిసిందే. ప్రభుత్వ చర్యల ఫలితంగా కాశ్మీర్ ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని వినియోగించుకోవటానికి, తమ కార్యకలాపాలను తీవ్రం చేయటానికి పాక్ మద్దతుతో టెర్రరిస్టులు పొంచి ఉన్నారన్న విషయం కూడా ప్రభుత్వానికి తెలుసు. అన్నీ తెలిసి కూడా జమ్మూ కాశ్మీర్‌లోకి టెర్రరిస్టుల ప్రవేశాన్ని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకోకపోవటం, ముఖ్యంగా యాత్రీకులు పర్యటించే ప్రాంతాలలో ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు.

### తీవ్రవాదుల లక్ష్యాన్ని నెరవేరుస్తున్న హిందుత్వవాదులు

పహల్గాంలో హత్యాకాండకు పాల్పడిన టెర్రరిస్టుల లక్ష్యం ఏమిటో దేశ ప్రజలందరికీ స్పష్టమైంది. యాత్రీకులు ఏ మతానికి చెందిన వారో తెలుసుకొని, ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకొని హత్యాకాండ సాగించారు. మతం పేరుతో మనదేశ ప్రజల మధ్య చీలికలు తీసుకురావాలనేది వారి లక్ష్యం. కాని వారు కొందరు యాత్రీకులను హత్య చేయగలిగినప్పటికీ, దేశప్రజల మధ్య చీలికలను మాత్రం తీసుకు రాలేకపోయారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ ఏకతాటిపై నిలబడ్డారు. చివరకు హత్యాకాండలో తమ ఆప్తులను కోల్పోయిన వారు కూడా మతపరమైన వ్యతిరేకతకు లోను కాలేదు. వారిని టెర్రరిస్టులు గానే చూశారు. తమకు తోడ్పడిన కాశ్మీరీ ముస్లింలను తమ సోదరులుగా, ఆప్తులుగా భావించారు.

మతాల వారీగా భారతీయులను విభజించే కార్యక్రమాన్ని టెర్రరిస్టులు చేయలేకపోయారు కాని హిందూత్వ వాదులు దానిని కొనసాగిస్తున్నారు. టెర్రరిస్టులు యాత్రీకుల మతాన్ని తెలుసుకొని, హత్యాకాండకు పాల్పడితే హిందుత్వవాదులు ముస్లింలపై దుష్ప్రచారం చేస్తూ అమాయకులపై దాడులకు తెగబడుతున్నారు. కాశ్మీరీ ముస్లింలు తమకు తోడ్పడ్డారని, వారి సహకారంతోనే తాము సురక్షితంగా బయటపడ్డామని యాత్రీకులు చెప్పటాన్ని కూడా ఈ ఉన్మాదులు సహించలేకపోతున్నారు. అలా చెప్పిన మహిళలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. ముస్లింలంటేనే టెర్రరిస్టులు అన్న భావాన్ని దేశప్రజలలో బలంగా నాటటానికి ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా సమాజాన్ని హిందు-ముస్లింలుగా విభజించటానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఒకదేశపు రాజు తన శతృదేశాన్ని బలహీనపరచటం కోసం అక్కడి ప్రజల మధ్య విభజనలు సృష్టించి, ఆ విభజనల ద్వారా బలహీనపడిన దేశాన్ని తేలికగా ఆక్రమించారని కథలలో చదువుకున్నాం. కాని ఇక్కడ జాతీయవాదం, అఖండ భారత్ అంటూ రోజూ ప్రచారం చేస్తున్న హిందుత్వవాదులు మతం ప్రాతిపదికగా సమాజాన్ని చీల్చి, శతృవులు చేయాల్సిన పనిని తామే చేస్తున్నారు. హిందుత్వవాదులు మతం ప్రాతిపదికగా ప్రజలను వేరుచేసి, ముస్లింలపై దాడులు చేస్తూ ప్రజల మధ్య వైషమ్యాలను, శతృత్వాన్ని పెంచుతున్నారు. తద్వారా టెర్రరిస్టులు చేసిన పనినే తామూ చేస్తున్నారు. పహల్గాంలో అమాయక ప్రజలను హత్య చేసిన టెర్రరిస్టులు ఓడినట్లా, గెలిచినట్లా? హిందుత్వవాదులు మతాల వారీగా ప్రజలను చీలుస్తుంటే పట్టించుకోకుండా పాకిస్తాన్‌లోని టెర్రరిస్టుల స్థావరాలపై చేసిన దాడులతో ప్రభుత్వం సాధించిన దేమిటి? పాకిస్తాన్‌లోని టెర్రరిస్టుల స్థావరాలపై దాడులు చేయటం, వారిని నిర్మూలించటం అవసరమే. కాని ఒకవైపు టెర్రరిస్టులను నిర్మూలించటానికి కృషి చేస్తున్నామని చెబుతూ మరోవైపు టెర్రరిస్టుల భావజాలాన్ని దేశవ్యాపితంగా వ్యాపింపజేస్తుంటే ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చోవటం టెర్రరిజానికి విజయమా, పరాజయమా? టెర్రరిజానికి హిందుత్వవాదులు చేస్తున్న మతోన్మాద చర్యలకు మించిన మద్దతు ఇంకేముంటుంది! ఇది దేశభక్తా? వీరు దేశాన్ని కాపాడతారా?

### దిగజారుతున్న ఆర్థికాభివృద్ధి

ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని హిందుత్వవాదులు పథకం ప్రకారం మతోన్మాదాన్ని రెచ్చగొట్టే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. మతోన్మాదాన్ని మరింతగా పెంచటం, సమాజాన్ని చీలికలు పేలికలుగా చేయటం మోడి ప్రభుత్వానికి ఇపుడు మరింతగా అవసరమైంది. మోడి ప్రభ దిగజారుతున్నదని గత ఎన్నికలలో స్పష్టమైంది. ఆ ఎన్నికలలోనూ, ఆ తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికలలో కూడా ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పోలింగ్ తీరుపై తీవ్రమైన ప్రశ్నలు ఉత్పన్నమైనాయి. వాటికి సమాధానం చెప్పగల స్థితిలో ఎన్నికల కమిషన్ లేదు.

అక్రమాలకు పాల్పడకపోతే బిజెపికి పార్లమెంటు ఎన్నికలలో ఇంకా స్థానాలు తగ్గేవని, శాసనసభల ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో అధికారంలోకి రావటానికి అవకాశాలు తక్కువగా ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇవన్నీ మోడి, బిజెపిలకు మరింత ప్రజాదరణ తగ్గిందని వెల్లడిస్తున్నాయి.

మోడి అమలు జరుపుతున్న ఆశ్రిత పెట్టుబడిదారి విధానాలకు క్రమంగా ప్రతిఘటన పెరుగుతున్నది. సరళీకరణ విధానాల అమలు వలన అసమానతలు పెరగటం, దేశ ఆర్థికాభివృద్ధి మందగించటం స్పష్టంగా కనిపిస్తున్నది. 2024–25లో జిడిపి వృద్ధి పతనమై నాలుగు సంవత్సరాల కనిష్టానికి చేరిందని, వృద్ధికి కీలకమైన తయారి రంగం నేల చూపులు చూస్తున్నదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని గణాంక సంస్థ మే నెల 30వ తేదీన ప్రకటించిన లెక్కులు స్పష్టం చేస్తున్నాయి. 2023–24లో 9.2 శాతంగా ఉన్న జిడిపి వృద్ధి 2024–25లో 6.5 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో తయారి రంగం 12.3 శాతం నుండి 4.5 శాతానికి క్షీణించింది. ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతు న్నామని మోడి ప్రభుత్వం చెబుతున్న గొప్పలకు ప్రభుత్వ సంస్థ అందించిన లెక్కలే తూట్లు పొడుస్తున్నాయి.

“ మోడి అమలు జరుపుతున్న ఆశ్రిత పెట్టుబడిదారి విధానాలకు క్రమంగా ప్రతిఘటన పెరుగుతున్నది. సరళీకరణ విధానాల అమలు వలన అసమానతలు పెరగటం, దేశ ఆర్థికాబి వృద్ధి మందగించటం స్పష్టంగా కనిపిస్తున్నది. 2024-25లో జిడిపి వృద్ధి పతనమై నాలుగు సంవత్సరాల కనిష్టానికి చేరిందని, వృద్ధికి కీలకమైన తయారి రంగం నేల చూపులు చూస్తున్నదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని గణాంక సంస్థ మే నెల 30వ తేదీన ప్రకటించిన లెక్కులు స్పష్టం చేస్తున్నాయి. ”



ఢిల్లీలో చంద్రబాబు, మోడీ భేటీ: నయా–ఉదారవాద విధానాల అమలులో ఇద్దరిదీ ఒకటే బాట

వివిధ వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాలపై మోడి ప్రభుత్వం చేస్తున్న దాడులు తీవ్రమైనాయి. రైతాంగ ప్రతిఘటనతో రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలలోని కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల అంశాలను దొడ్డిదారిన అమలు చేయటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. కోవిడ్ సమయంలో పార్లమెంటులో చర్చ లేకుండా ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లను ఇపుడు అమలు చేయటానికి ప్రభుత్వం తొందర పడుతుండగా, కార్మికవర్గం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నది. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9వ తేదీన దేశవ్యాపిత సమ్మెకు సన్నద్ధమౌతున్నది. నిరుద్యోగం పెరుగుతున్నది. దేశ ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో నాలుగవ స్థానానికి చేరిందని చెబుతున్న కాకి లెక్కల–నిజమైన లెక్కలు 2027లో మాత్రమే అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ప్రభుత్వం చెబుతున్నది అంచనా మాత్రమే. అది కూడా ప్రభుత్వ అంచనా కాదు. ఐఎంఎఫ్ అంచనా–ను ఆర్థికవేత్తలు అపహాస్యం చేస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న భారతదేశ వ్యతిరేక విధానాలకు మోడి ప్రభుత్వం కనీస నిరసన కూడా వ్యక్తం చేయటం లేదు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ విరమణ, తాను సంప్రదింపులు జరపటం వలననే ఉభయ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ చేసిన ప్రకటనలు మోడి, బిజెపి నాయకత్వాన్ని ఇరుకున పెట్టాయి. అయినా దేశ ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా అంతర్జాతీయంగా మద్దతు కూడ గడుతున్నామని హడావిడి చేస్తున్నారు. ఈ సంఘటనలన్నీ మోడి ప్రతిష్ఠను మరింతగా దిగజారుస్తున్నాయి.

నేషనల్ మానెటైజేషన్ పైపులైన్ పేరుతో మౌలిక సదుపాయాలను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గనులతో పాటు అడవులలో ఉన్న సమస్త సంపదలను పెట్టుబడిదారులకు అప్పగించటానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు గిరిజనుల నుండి ప్రతిఘటన ఎదురౌతున్నది. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు కూడా ఈ చర్యలను వ్యతిరేకిస్తున్నాయి. దీనిని అధిగమించటం కోసం నక్జల్స్‌ను అణచివేస్తున్నామనే పేరుతో గిరిజనులపై దాడులు చేస్తున్నారు. గిరిజనులను భయభ్రాంతులను చేసి, వారిని అడవుల నుండి తరిమివేసి, అటవీ సంపదలను కార్పొరేట్లకు అప్పగించటానికి ఉన్న ఆటంకాలను తొలగించటానికి ఎదురు కాల్పుల పేరుతో హత్యలు చేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు జరుపటానికి సిద్ధంగా ఉన్నామని నక్జల్స్ ప్రకటించినప్పటికీ దానిని పట్టించుకోకుండా హత్యాకాండను కొనసాగించటాన్ని వివిధ రాజకీయ పార్టీలు ఖండించాయి. వారితో ప్రభుత్వం చర్చలు జరపాలని, సాధ్యమైన సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని చేస్తున్న సూచనలను పెడ చెవిన పెడుతున్నది. ఇటువంటి పరిస్థితులలో పహల్గాం మారణకాండ జరగటంతో ప్రజల దృష్టి మళ్ళించటానికి బిజెపికి అవకాశం దొరికింది. ❋

# ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాసైన్స్ ఉద్యమం



రచయిత ప్రజాసైన్సు ఉద్యమ నాయకులు, ఆంధ్ర శాసన మండలి మాజీ సభ్యులు

**వి బాలసుబ్రమణ్యం**

స్వాతంత్రం తర్వాత కూడా జాతీయోద్యమ విలువలను, ప్రగతిశీల ప్రజాస్వామిక దృక్పథాన్ని నిలుపుకొన్న వారసత్వం ఆంధ్రులకు తక్కువేం కాదు. దీనికి తోడు బలమైన వామపక్ష ఉద్యమాలు అది నిర్మించిన అభ్యుదయ సంస్కృతి కూడా తెలుగు వాళ్లకుంది. ఇది మన సాహిత్యంలోనూ, సంస్కరణ ఉద్యమాలలోనూ స్పష్టంగా ప్రతిబింబించింది.

ప్రజలకు ఆధునిక దృక్పథం లేకపోతే నూతన సమాజ ఆవిష్కరణ జరగదనీ, మూఢనమ్మకాల ఛాందసాల చెర నుండి బయటపడాలంటే సైన్సు తప్ప మరో మార్గం లేదని కందుకూరి వీరేశలింగం గారు గుర్తించి తొలి తెలుగు విజ్ఞాన శాస్త్ర పాఠ్య గ్రంథాలను రచించారు. భౌతిక వాదం ఎంత విలువైనదో గురజాడ మాటిమాటికీ నొక్కి చెప్పాడు. హాల్డేన్ ప్రపంచంలోనే సైన్సు ఉద్యమకారుల తొలి తరం వాడు. ఆయనకు తెలుగు భాష అంటే వల్లమాలిన ఇష్టం. స్వాతంత్రానికి ముందూ తర్వాతా రష్యన్ భాష నుంచి పాపులర్ సైన్స్ గ్రంథాలు చాలా అనువాదం అయ్యాయి. (1883 నండి 1965లో వరకు అచ్చయిన 1360 శాస్త్ర విజ్ఞాన గ్రంథాల జాబితాను శ్రీ వెలగా వెంకటప్పయ్య గారు 1969లో వెలువరించారు) నాయుడమ్మ, కుటుంబరావు, మహీధర, నండూరి లాంటి వారు చాలా విలువైన పాపులర్ సైన్స్ గ్రంథాలు రచించారు. సైన్స్ ప్రాధాన్యతను వివరించారు.

**తెలుగు నాట తొలి సైన్సు సంస్థలు**

1983లో KSSP జరిపిన అఖిల భారత సదస్సుకు ఆంధ్రప్రదేశ్ నుంచి "శాస్త్ర విజ్ఞాన ప్రచార సభ "(SVPS) పాల్గొని ఒక పత్రాన్ని సమర్పించింది. ఇది ఇక్కడి ప్రగతిశీల శక్తుల చొరవతో ఏర్పడింది. దీన్ని టి.వెంకటేశ్వర్లు (టీవీలు) కె.యస్.ఆర్ ప్రసాద్ (ఇంజనీరింగ్ ఆధ్యాపకుడు) గార్లు నడిపేవారు. తమ సంస్థలో 200 మంది సభ్యులున్నట్టు, సెమినార్లు, క్విజ్‌లు, తల్లిదండ్రుల సమావేశాలు తాము జరుగుతున్నట్టు, సైన్స్ గ్రంథాలను ప్రచురిస్తున్నట్టు అది ఆ పత్రంలో పేర్కొంది. కృష్ణ కుమార్ రచించిన "సైన్స్ అండ్ సొసైటీని" శాస్త్ర విజ్ఞాన ప్రచార సభ ప్రచురించింది. అలాగే "కోనసీమ విజ్ఞాన పరిషత్" కూడా (డాక్టర్ సి వి సర్వేశ్వరరావు -అమలాపురం) ఆ రోజుల్లో గణనీయమైన కృషి చేసింది. 1965 తర్వాతి సైన్స్ రచయితల్లో నండూరి రామ్మోహన్‌రావు, కొడవటిగంటి రోహిణి ప్రసాద్, పీఎం భార్గవ, పొత్తూరు వెంకటేశ్వరరావు, నమరం నాగసూరి వేణుగోపాల్ గార్లు ప్రసిద్ధులు. వీరిలో భార్గవ గారు ప్రజల పక్షాన నిలబడ్డ గొప్ప సైన్సు ఉద్యమకారుడు కూడా.

1985లో KSSP నిర్వహించిన తిరువనంతపురం - ఢిల్లీ సైన్స్ జాతా హైదరాబాదు చేరినప్పుడు ప్రొఫెసర్ వినోద్ గౌర్ ఆతిధ్యమిచ్చారు. ఆయన "ఏపీ విజ్ఞాన పరిషత్‌కు" డైరెక్టర్‌గా ఉంటూ ఆ రోజుల్లో సైన్స్ ప్రచారం చేసేవారు. NGRIలో పనిచేసే డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు స్వయంగా సైన్స్ నాటకాలు ప్రదర్శించేవాడు. తమ సంస్థలోని 10 -15 మందికి సైన్సు కళాకారులుగా శిక్షణ కూడా ఇప్పించారు .అదే కాలంలో పెరుగు శివారెడ్డి, శివరామకృష్ణ శాస్త్రి తదితరులు సైన్స్ రచయితల సంఘం పెట్టాలని ప్రయత్నించారు కానీ సాధ్యపడలేదు.

దీన్నంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే తెలుగు నాట సైన్స్ ఉద్యమానికి గొప్ప వారసత్వం ఉంది. అది ఇక్కడి సాహితీ సాంస్కృతిక రాజకీయ ఉద్యమాల నుంచి పుట్టింది. వామపక్షాలు ఈ ప్రజాతంత్ర ఉద్యమానికి ముందుండేది. డాక్టర్ ఎంపీ పరమేశ్వరన్ గారి ఆంధ్ర యూనివర్సిటీ, విజవాడ పర్యటనల్ని కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి.

**ప్రారంభ దశ**

1970 దశకానికి ముందే నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల (పిపిసి) 700-800 మందికి వైద్య శిక్షణనిచ్చి గ్రామాలకు పంపింది. వీరిలో టీచర్లు గణనీయంగా ఉండేవారు. దీంతో పాటు దాదాపు 200 మంది డాక్టర్లకు కూడా పిపిసి శిక్షణ నిచ్చింది. ప్రజా వైద్యులుగా తీర్చిదిద్దింది. వీరు తమ తమ ప్రాంతాల్లో ప్రజా వైద్యశాలలను నిర్వహిస్తూ ఆరోగ్యం చుట్టూ సామాజిక కార్యక్రమాలు చేపట్టేవారు. అభ్యుదయ భావాల్ని ప్రచారంలో పెట్టేందుకు తమ వైద్యశాల కేంద్రంగా చిన్న చిన్న సంస్థలనూ నడుపుతుండేవారు. వీరందరూ విద్యార్థి జీవితంలో ఎస్ఎఫ్ఐలో పని చేసిన వారు. చాలామంది ప్రముఖ ఎస్ఎఫ్ఐ నాయకులు కూడా.

అప్పటి సంస్థలు కొన్ని: డా.రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల, అభ్యుదయ వేదిక (నెల్లూరు), అభ్యుదయ వేదిక (రాజమండ్రి- డాక్టర్ బాబురావు) అభ్యుదయ వేదిక (ఖమ్మం- డాక్టర్ వై.రాధాకృష్ణమూర్తి) అభ్యుదయ వేదిక (కాకినాడ - నాగేశ్వరరావు) ప్రజా చైతన్య వేదిక (కర్నూలు -డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి) స్టడీ సర్కిల్ (ఒంగోలుబి డాక్టర్ రంగారావు) ప్రజా చైతన్య వేదిక (గుంటూరు- వి.లక్ష్మణరెడ్డి, డాక్టర్ కళాధర్, చిన్నయసూరి), సూర్యాపేట సైన్స్ ఫోరమ్ (ఎ.రామయ్య), మిర్యాలగూడ కోదాడలలోని ప్రజా వైద్యశాలలు. వీటన్నిటికీ నెల్లూరు ప్రజా వైద్యశాల స్ఫూర్తీ, సమన్వయ కేంద్రమూ. డాక్టర్ జెట్టి శేషారెడ్డి గారు ఈ సమన్వయకర్త పాత్రను పోషించేవారు. పిపిసి, శేషారెడ్డి గారు లేకుండా జనవిజ్ఞాన వేదిక

**"హైదరాబాదులోని CCMB, IRTC, NGRI, NINలాంటి ప్రతిష్టాత్మక కేంద్ర సైన్స్ పరిశోధనాసంస్థలు, వీటిలోని వినోద్ గౌర్, పి.యం. భార్గవ బాలసుబ్రమణియన్, మెహ తాబ్ బామ్జీ, వీణా శత్రుఘ్న, మోహన్ రావు లాంటి శాస్త్రవేత్తలు బహుశా దేశంలోనే జనవిజ్ఞాన వేదికకు తప్ప ఎవరికీ లభించలేదు. వరంగల్ ఆర్ఈసి (కూడా జెవివికి అప్పటినుంచి నేటిదాకా గొప్పకార్య క్షేత్రం. విద్యార్థి ఉద్యమం నుంచి వామపక్ష ఉద్యమాల్లో వున్న డాక్టర్ రామచంద్రయ్య వీరిని సమన్వయం చేసే వారు. జనవిజ్ఞాన వేదిక ఒక పాపులర్ సైన్సు సంస్థగా మాత్రం రెండు మూడేళ్లలోనే గుర్తింపు తెచ్చుకోగలిగింది."**

గురించి మనం మాట్లాడుకోలేము.

వీరందరూ డాక్టర్లు కావడంతో వీరి సామాజిక ఉద్యమం ఆరోగ్యం చుట్టూ నడిచేది. ప్రజల్ని బాగా ఆకర్షించే ప్రచార కార్యక్రమాలు వీరు చేపట్టేవారు. వీరికి జనంలో మంచి డాక్టర్లుగా పేరుండేది. టానిక్కులు, విటమిన్ టాబ్లెట్లు, హార్లిక్స్ బూస్ట్ లాంటి ఆహార పానీయాల పేరుతో పెద్దపెద్ద కంపెనీలు జనాలను మోసగిస్తున్నాయని వీరంతా ఉధృతంగా ప్రచారం చేసేవారు. దీనికి మెడికల్ రిప్రజెంటివ్స్ అసోసియేషన్ (FMRAI) సహకారం ఉపయోగపడింది. పైకి చిన్న చిన్న అంశాలుగా ఇవి కనిపించినా వాస్తవానికి ఏకంగా బడా కార్పొరేట్ సంస్థలపై ఎక్కుపెట్టిన బాణమిది! ఆరోగ్య వైద్య రంగాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగట్టడమిది. దీన్ని రాష్ట్రంలో ప్రజా సైన్సు ఉద్యమానికి ప్రారంభదశ అనొచ్చు.

మందులు- ఆరోగ్యంపై 1986లో ఢిల్లీలో జరిగిన సదస్సుకు డాక్టర్ శేషారెడ్డి, సంజయ్ బారు హాజరయ్యారు. 1986- 87 లో "మందుల కోసం మనుషులా? మనుషుల కోసం మందులా?" అంటూ 200 సభలు జరిపారు. నూతన మందుల విధానంపై 110 చార్టులు తయారు చేసి ప్రదర్శించారు. నెల్లూరు హైదరాబాదుల్లో జరిగిన రెండు పెద్ద సెమినార్ల గురించి కూడా ఇక్కడ చెప్పుకొని తీరాలి. వాటికి డాక్టర్ బ్రహ్మారెడ్డి నాయకత్వం వహించేవాడు.

ఇదే తరుణంలో 1987లో "భారత జనవిజ్ఞాన జాతా" (BJVJ)సన్నాహక సమావేశం ఢిల్లీలో జరిగింది. దీనికి ప్రజా వైద్యులతో పాటు వి.లక్ష్మణరెడ్డి, సంజయ్ బార్లు కూడా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ జాతా, మెయిన్ జాతాలుగా (రెండుగా) పెద్ద ఎత్తున దీన్ని నడపాలని నిర్ణయించారు. ఈ కళారూపాలకు. గేయాలకు సృష్టికర్త డాక్టర్ ఎం.వి.ఎం. గిరి. అతని ప్రతిభా పాటవాలు ఈ జాతాతోనే ప్రపంచానికి తెలిసాయి. ఇక ప్రజానాట్యమండలి సర్వం తానై ఈ కళా రూపాల్ని రూపొందించింది ,ప్రదర్శించింది, ప్రచారం చేసింది. శాస్త్ర కళాజాతా (BJVJకి తెలుగు పేరు).

ఎంతో విజయవంతంగా జరిగిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు నిలబడింది. దీనికి మొదటి కారణం కళారూపాలను మన రాష్ట్రానికి తగ్గట్టు మలుచుకోవటం. స్థానిక కళాకారులని ఉపయోగించుకోవటం. తర్వాత ఎక్కడికక్కడ ముందు మనం చెప్పుకున్న ప్రజా వైద్యశాలలు అన్నీ ఏర్పాట్లు చేయటం. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్), ప్రజా నాట్యమండలి దీన్ని సొంతం చేసుకోవడం. ఆ తర్వాత వివిధ ప్రజాసంఘాలు, పలువురు మధ్యతరగతి బుద్ధి జీవులు తోడు నిలబడ్డం. ఆల్ ఇండియా జాతాలతో పోలిస్తే ఆంధ్ర ప్రదేశ్ కళారూపాలు చాలా కరుగ్గాను, సృజనా త్మకంగానూ కూడా ఉండేవి. కళా రూపాలతో సైన్సును ప్రచారం చెయ్యడం ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అనుభవం.

1987 డిసెంబర్లో దీనిపై సమీక్ష జరిగింది. ఈ సంబంధాలన్నిటినీ ఇముడ్చు కొని జనవిజ్ఞాన వేదిక 1988 ఫిబ్రవరి 28న విజయవాడలో ఆవిర్భవించింది. మొదటి అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ వినోద్ గౌర్, లక్ష్మణ్ రెడ్డి గార్లు ఎన్నికయ్యారు. వినోద్ గౌర్ గారి "ఆంధ్ర విజ్ఞాన పరిషత్తు" "విజయవాడ విజ్ఞాన వేదిక", గుంటూరు "ప్రజా చైతన్య వేదిక జెవివికి అనుబంధంగా మాత్రమే ఉండిపోయాయి. విలీనం కాలేదు. రేపల్లె నుంచి "సైన్సువాణి"నడుపుతున్న సుబ్బారావు గారికి, సైన్స్ గ్రంధాల ముద్రణలో ముందున్న ఏపీ సైన్స్ అకాడమీకి కూడా శాస్త్ర ప్రచారంలో అప్పటికే ఎంతో అనుభవం వుండేది.

AIPSN రిజిస్ట్రేషన్‌కు సైతం జన విజ్ఞాన వేదిక గుంటూరులో (1990లో) ఏర్పాటు చేసింది. అంతకుముందే 1989లో కన్ననూర్‌లో జరిగిన ఆలిండియా కాంగ్రెస్‌కు జెవివి హాజరైంది. ఒక సైద్ధాంతిక స్పష్టతతో తెలుగు నాట ప్రజా సైన్సు ఉద్యమ సంస్థగా జనవిజ్ఞాన వేదిక తన ప్రస్థానం ప్రారంభిం చింది.

ముందే మనం చెప్పుకున్నట్టు మొదట జనవిజ్ఞాన వేదికలో డాక్టర్లు, మెడికల్ రిప్ర జెంటేటివ్‌లు ఒక పాయగా, ఉపాధ్యాయులు మరో పాయగా, కళాకారులు ఇంకొక పాయగా ఉండేవారు. క్రమంగా స్థానిక శాఖలు ఏర్పడ్డాయి. ఏ రాష్ట్రంలో పోల్చినా ఏపీ జెవివి నిర్మాణం తీసిపోనిది. ఆ రోజుల్లో యూటీఎఫ్ నాయకులు దాచూరి రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం గార్లు ఇచ్చిన సూచనలు, మార్గదర్శకం కూడా జనవిజ్ఞాన వేదికకు ఎంతో విలువైనవి.

హైదరాబాదులోని CCMB, IRTC, NGRI, NINలాంటి ప్రతిష్టాత్మక కేంద్ర సైన్స్ పరిశోధనాసంస్థలు, వీటిలోని వినోద్ గౌర్, పి.యం.భార్గవ బాలసుబ్రమణియన్, మెహ తాబ్ బామ్జీ, వీణా శత్రుఘ్న, మోహన్ రావు, లాంటి శాస్త్రవేత్తలు బహుశా దేశంలోనే జనవిజ్ఞాన వేదికకు తప్ప ఎవరికీ లభించలేదు. వరంగల్ ఆర్ఈసి (ప్రస్తుతం NIT)కూడా జెవివికి అప్పటినుంచి నేటిదాకా గొప్పకార్య క్షేత్రం. విద్యార్థి ఉద్యమం నుంచి వామపక్ష ఉద్యమాల్లో వున్న డాక్టర్ రామచంద్రయ్య వీరిని సమన్వయం చేసే వారు. జనవిజ్ఞాన వేదిక ఒక పాపులర్ సైన్సు సంస్థగా మాత్రం రెండు మూడేళ్లలోనే గుర్తింపు తెచ్చుకోగలిగింది.

ఈ కాలపు చారిత్రక సందర్భాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి. అది ప్రపంచీకరణ ప్రారంభ కాలం. అప్పటికే హేతువాద, నాస్తిక వాద సంఘాలు పలుచబడిపోయాయి. వామ పక్ష ఉద్యమం చురుగ్గాను, విస్తృతంగానూ ఉంది. ప్రైవేటీకరణ వేగవంతమవుతోంది. ప్రపంచ బ్యాంకు ప్రవేశించింది. దాని జోక్యం భారతదేశ అభివృద్ధి విధానాల్లో పెరగ సాగింది. మెల్లగానే అయినా మధ్యతరగతి విస్తరిస్తోంది. దాని ఆకాంక్షలు మొత్తం సమాజపు ఆకాంక్షలుగా ముందుకు వస్తున్నాయి. ప్రజల జ్ఞాన దాహం, కనీసా వసరాలు బలంగా వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు వాటిని తీర్చగల స్థితిలో లేవు. ఈ అసంతృప్తి ప్రభుత్వ వ్యతిరేకతగా వ్యక్తం కావడం గతంలో ఎప్పటికన్నా ఎక్కువైంది.

ప్రారంభదశలో ఆరోగ్యం, మూఢనమ్మ కాల వ్యతిరేక ప్రచారం, సైన్స్ బోధన, విద్యారంగా పరిరక్షణ, బాలోత్సవాలు లాంటివి జెవివికి ప్రధాన కార్యక్రమాలుగా ఉండేవి.

**❝ పిల్లల సైన్స్ పత్రిక కోసం 1993 మేలో నెల్లూరులో జరిగిన సన్నాహక సమావేశం చెకుముకికి శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి 30ఏళ్ల పాటు క్రమం తప్పకుండా నడుస్తున్న పిల్లల ఏకైక సైన్సు పత్రిక చెకుముకి మాత్రమే. ప్రధానంగా ఆరోగ్యంపై, మూఢనమ్మ కాలపై చేస్తున్న ప్రచారం సైన్సు ఉద్యమాన్ని జనబాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లింది. ❞**

1988 జూలైలో నేచర్ సైన్స్ అండ్ సొసైటీ వర్క్‌షాప్ హైదరాబాద్లో జరిగింది ఇందులో 250 స్లైడ్లుఉపన్యాసాలకు కావలసిన పత్రాలు, "Humanity at Cross Roads" పై పోస్టర్ల ఎగ్జిబిషన్స్ రూపొందించారు. సైన్స్ ప్రచారంలో ఇదొక ప్రధాన ఘట్టం. తొలి దశలో పేటెంట్ చట్టాలు, ఔషధ విధానాలు, డంకెల్ ప్రతిపాదనలు, విద్యావిధానాలు, బహుళ జాతి సంస్థలు, యుద్ధం శాంతి లాంటివి కూడా జనవిజ్ఞాన వేదికకు విమర్శ నాత్మక ప్రచారాంశాలుగా ఉండేవి.

పిల్లల సైన్స్ పత్రిక కోసం 1993 మేలో నెల్లూరులో జరిగిన సన్నాహక సమావేశం చెకుమొకికి శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి 30ఏళ్ల పాటు క్రమం తప్పకుండా నడుస్తున్న పిల్లల ఏకైక సైన్సు పత్రిక చెకుముకి మాత్రమే.

ప్రధానంగా ఆరోగ్యంపై, మూఢనమ్మ కాలపై చేస్తున్న ప్రచారం సైన్సు ఉద్యమాన్ని జనబాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లింది.

**రెండవ దశ**

ఎర్నాకులం జిల్లా సాక్షరతా ఉద్యమాన్ని (EDTLP) 1989లో KSSP స్పాన్సర్ చేసింది. దాని ఆహ్వానం మేరకు జెవివి ప్రతినిధులు కూడా కేరళలో పర్యటించి ప్రజా ఉద్యమంగా అక్షరాస్యతను ఎలా చేపట్టవచ్చో స్వయంగా పరిశీలించారు. గొప్ప ఉత్తేజాన్ని, ఆవేశాన్ని ఇది కల్పించింది. ఎర్నాకులం పెద్ద జిల్లా. అప్పటికే 76.8 అక్షరాస్యతా శాతం గల జిల్లా. ఇక్కడ ఒక సంవత్సరం పాటు జరిగిన సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం దేశాన్నంతా ఆకర్షించింది. ఎర్నాకులం తర్వాత "అక్షర కేరళం" పేరుతో రాష్ట్రమంతా ఇదే ఉద్యమం సాగింది. కానీ దీన్ని జాతీయ సాక్షరతా మిషన్ సహకారంతో జిల్లాల్లోని పాలనా యంత్రాంగాలు చేపట్టాయి. KSSP తన యంత్రాగాన్నంతా ఇందులో దింపింది.

ఈ అనుభవంతో 1990 ఏప్రిల్-మే నెలల్లో దేశవ్యాప్తంగా ఇదే ఉద్యమాన్ని విస్తరింప చేయడం కోసం, దానికొక ఉత్తేజాన్ని కలిగించేందుకు "అక్షర కళాయాత్రను" జాతీయ సాక్షరతామిషన్ (ఎన్.ఎల్.ఎం) చేపట్టింది. ప్రజాసైన్స్ ఉద్యమసంస్థలు కేరళ స్ఫూర్తితో అన్ని రాష్ట్రాల్లో దీన్ని విజయవంతం చేసాయి. దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో జరిగిన ఈ కళాయాత్రను విజయవంతం చేసేందుకు హైదరాబాదు త్యాగరాజ గాన సభలో సన్నాహక సమావేశం జరిగింది. దీనికి మర్రి చెన్నారెడ్డి పాటు అక్కినేని నాగేశ్వరరావు, సీనియర్ ఐఏఎస్ అధికారి బిపిఆర్ విఠల్ హాజరయ్యారు. ఇలా ఏపీలో BGVSకు పునాది పడింది.

1991 నుంచి 1994 దాకా సాక్షరతా ఉద్యమమే జనవిజ్ఞాన వేదికకు ప్రధాన కార్యరంగమైంది. ఇదంతా BGVS పేరుతో జరిగినా దానికి వ్యవస్థాగత నిర్మాణం లేదు. జనవిజ్ఞాన వేదికే అంతా తానై నడిపించింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాలు మినహా మొదట దీనికెవరూ ముందుకు రాలేదు. జిల్లా కలెక్టర్లు పూనుకొంటేనే నేషనల్ లిటరసీ మిషన్ దీన్ని మంజూరు చేసేది. దీనికోసం జిల్లా సాక్షరతా సమితిని స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేయాల్సి వచ్చేది. దీంతో అన్ని జిల్లాలని పురమాయించేందుకు బిజెవిఎస్ స్వయంగా రాష్ట్రవ్యాప్త కళాజాతాను1991 అక్టోబరు- నవంబర్ మధ్య నిర్వహించింది. స్వయంగా ఏడు జిల్లాల్లో ఒక్కో మండలంలో సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమాన్ని చేపట్టింది. దేశంలో ఈ సాహసానికి పూనుకొంది ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

దీంతో మిగిలిన జిల్లాలు ఒక్కొక్కటి సాక్షరతా ఉద్యమానికి సిద్ధపడ్డాయి. ప్రజా సైన్సు ఉద్యమం, ప్రజా సంఘాలు బలంగా ఉన్నజిల్లాల్లో ఒకమేరకైనా ఇది విజయవంత మైంది. నెల్లూరు దాని తర్వాత నల్గొండ, విజయనగరం, అనంతపురం, నిజామాబాదు, పశ్చిమగోదావరి జిల్లాలు పెద్ద ఉద్యమాన్ని చేపట్టగలిగాయి.

BGVS ఏర్పాటులో, నడపడం లో టి.గోపాలరావు, డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య గార్లు చాలా విలువైన పాత్ర పోషించారు. ఈ సందర్భంగా బి.పి.ఆర్.విఠల్ గారిని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. అధికార యంత్రాంగాన్ని బిజివియస్‌కు దగ్గర చేయడంలో, విస్తృత వేదికగా దీన్ని మలచడంలో ఆయనది కీలకపాత్ర.

ఫలితంగ కొన్నిచోట్ల గ్రామస్థాయి వరకు కూడా జెవివి విస్తరించింది. పెద్ద ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల కొత్త కార్యకర్తలు వేలమంది లభించారు.వీరిలో అన్ని రంగాలకు చెందిన వారున్నారు. అధికారులు, వివిధ సామాజిక ఉద్యమ సంస్థలు, గుర్తింపు గల మేధావులు కూడా ప్రజాసైన్స్ ఉద్యమానికి దగ్గరయ్యారు. పూర్తిస్థాయి కార్యకర్తలుగా అనేకమంది టీచర్లు (ఆన్ డ్యూటీతో) రావడం ఎంతో లాభించింది.

ఈ దశలో నెల్లూరు జిల్లాలో 1991 ఆగస్టులో పోస్ట్ లిటరసీ కార్యక్రమం మొదలైంది. దేశంలోనే ఈ దశలోకి ప్రవేశించిన జిల్లాల్లో అప్పటికి నెల్లూరు మొదటి రెండు స్థానాల్లో ఉంది. (కేరళలో ఎల్డీఎఫ్ స్థానే యుడిఎఫ్ రావడంతో అక్షర కేరళాన్ని నిర్దాక్షిణ్యంగా అటకెక్కించారు) నెల్లూరులో సారా వ్యతిరేకోద్యమం మొదలై జిల్లానే కాదు రాష్ట్రాన్నికూడా ఒక ఊపు ఊపింది.

సారా వ్యతిరేక ఉద్యమాన్ని జనవిజ్ఞాన వేదిక ప్రారంభించలేదు. దాన్ని నూతన అక్షరాస్యులయిన మహిళలు ప్రారంభించారు. వారికి పాఠాలు చెబుతున్న వాలంటీర్లు, వాళ్ళను పర్యవేక్షిస్తున్న సామాజిక కార్యకర్తలు (ముఖ్యంగా టీచర్లు) తోడు నిలబడ్డారు. ఇది ప్రభంజనంగా, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారడంతో అప్పటిదాకా జిల్లాల్లో "సజావుగా" జరుగుతున్న అక్షరాస్యతా ఉద్యమాలన్నీ అతలాకుతలం అయ్యాయి. సైన్సుఉద్యమ కార్యకర్తల్ని అధికార్లు దూరం పెట్ట సాగారు. పాలకుల నుంచి హెచ్చరికలు రావడంతో కలెక్టర్లు తూ తూ అనిపించి లెక్కలు మాత్రం చెప్పి సర్దుకోవడం ప్రారంభించారు.

జె.వి.వి కి కూడా ఇది ఒక పరీక్షా సమయం. ప్రజాసైన్స్ ఉద్యమం లాంటి శాస్త్రీయ భావజాల ప్రచారానికి పరిమితమైన మధ్యతరగతి బుద్ధిజీవుల వేదిక అట్టడుగు ప్రజలను సమీకరించి, నేరుగా ప్రభుత్వంతో తలపడడం దాని స్వభావానికి సరైనదేనా అనే చర్చకూడా తీవ్రంగా మొదలైంది. అలాగే సారా

లాంటి వ్యసనం పై ఏ రూపంలో ఎంత దూరం పోరాడాల్సి ఉంటుంది అనేది కూడా. 1992 మే నుండి 1993 అక్టోబర్ వరకు జెవివిని ఈ ఉద్యమం ఆవహించింది. 1993 మార్చిలో నెల్లూరులోనూ, 1993 అక్టోబర్‌లో రాష్ట్ర మంతా సారాను నిషేధించడంతో మహిళలకు గొప్ప విజయం లభించినట్లయింది. జెవివికి కూడా ఒక ప్రతిష్ట, ఒక ఊరట లభించాయి.

సాక్షరతా ఉద్యమం కొత్త అనుభవాల నిచ్చింది. కొత్త రంగాలను పరిచయం చేసింది. కొత్త సంబంధాల్ని అందుబాటులోకి తెచ్చింది .వయోజనులకు తగిన వాచకాలు రాయటం, నూతన బోధనా పద్ధతుల్ని ప్రవేశపెట్టడం, సులభ రీతిలో, కొద్దికాలంలో అక్షరాస్యుల్ని చేయడంలో మెళకువలు లాంటివి అఆల నుంచి నేర్చుకోవాల్సి వచ్చింది. దీనికోసం ఒక మంచి గ్రూపు ఏర్పడింది. దేశంలోనే NLM ఆమోదం పొందిన మొదటి నూతన అక్షరాస్యుల వాచకం నెల్లూరులోనే తయారయింది. దశల వారీగా స్థాయికి తగ్గట్టు పఠన సామాగ్రిని రూపొందించడం కూడా అప్పటికెవ్వరూ చెయ్యనిది.

ఇవన్నీ ఒక ఎత్తు గ్రామీణ పేద మహిళలు చైతన్యవంతలై సంఘటిత పడడం మరో ఎత్తు. ఇక వీరి జీవన నైపుణ్యాలు పెంచడం, గ్రామాల్లో దానికి తగ్గ వ్యవస్థలను నిర్మించడం ఒక కర్తవ్యంగా ముందుకొచ్చింది.

ప్రభుత్వం తెలివిగా తనకు వ్యతిరేకంగా ఉన్న మహిళలని పొదుపులక్ష్మిలోకి ఇముడ్చుకుంది. (నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఇది మొదలైంది) దీనికి ప్రత్యామ్నాయం జెవివి వద్ద లేక పోయింది. వీలున్నన్ని ఈ కొత్త సంబంధాల్ని జెవివి నిర్మాణంలోకి ఇముడ్చుకోవడం, కొత్త పరిస్థితులకు తగ్గ కార్యక్రమాలను రూపొందించుకోవడం, ప్రజాసైన్స్ ఉద్యమ స్వభావం పలచబడకుండా స్వతంత్రంగా సైన్స్ ప్రచా రాన్ని కొనసాగించడం జెవివి కర్తవ్యాల య్యాయి.

ఇప్పటికే నూతన ఆర్థిక విధానాలు దేశంలోకి జొరబడ్డాయి. వామపక్షాలకివి తీరికలేని పనిని పెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు విధానాలపై తీవ్ర చర్చను, వ్యతిరేక ఉద్యమాల్ని వీరే ముందుండి నడిపించారు. ఈ విధానాల్ని అమలు పరచడంలో మన రాష్ట్ర పాలకులే దేశంలో ముందుండడంతో అది కొత్త రాజకీయ వాతావరణాన్ని రాష్ట్రంలోకి తీసుకొచ్చింది. ఈ దశలో 1993 డిసెంబర్లో మూడు రోజులపాటు హైదరాబాదులో "నూతన ఆర్థిక విధానాలు- వాటి ప్రభావం పర్యవసానాలు"పై జెవివి జరిపిన సదస్సు గొప్ప ఉత్తేజాన్నిచ్చింది. దేశంలోని ఆయా రంగాల ప్రముఖ మేధావులు దాదాపు పాతిక మంది ఇందులో పాల్గొన్నారు. దానికి డాక్టర్ జెట్టి శేషారెడ్డి గారి సహకారం మరువలేనిది. ఈ ఆలోచన కూడా ఆయనదే.

"పాఠశాల విద్యారంగం కూడా 1993 తర్వాత ఒక ప్రధాన రంగంగా మారింది. సాక్షరతా ఉద్యమంలో దగ్గరైన వేలాదిమంది ఉపాధ్యాయుల్ని జెవివిలోకి ఇముడ్చుకోడానికిది ఎంతో ఉపయోగపడింది. ఇందుకోసం రూపొందించిన విద్యాబోధనా తాత్విక కాంశాలపై పుస్తకాలు జెవివిని ఈ రంగంలో పాపులర్ చేయడంతో పాటు, ఆర్థిక వనరులను కూడా సమకూర్చాయి."

పాఠశాల విద్యారంగం కూడా 1993 తర్వాత ఒక ప్రధాన రంగంగా మారింది. సాక్షరతా ఉద్యమంలో దగ్గరైన వేలాదిమంది ఉపాధ్యాయుల్ని జెవివిలోకి ఇముడ్చుకోడానికిది ఎంతో ఉపయోగపడింది. ఇందుకోసం రూపొందించిన విద్యాబోధనా తాత్విక కాంశాలపై పుస్తకాలు జెవివిని ఈ రంగంలో పాపులర్ చేయడంతో పాటు, ఆర్థిక వనరులను కూడా సమకూర్చాయి.

ఇదే కాలంలో సోవియట్ పతన మైంది. ఇది అందరినీ కలవరపరిచింది. నిరాశలోకి కూడా నెట్టింది. సహజంగానే మధ్యతరగతిని ఇది ఎక్కువ గంధరగోళ పరిచింది. ఈ ప్రభావం సైన్సు ఉద్యమంపై కూడా పడింది. ప్రభుత్వ విద్యా రంగం నానాటికీ నిర్వీర్యం కావడం, ప్రైవేట్ విద్య పుంజుకోవటం, అస్తిత్వ ధోరణులు ముందుకు రావటం, వినిమయ తత్వం, తిరోగామి సంస్కృతి, స్వచ్ఛంద సంస్థలు పుట్టుకు రావటం, రాజకీయాల్లో మిగతావాదంతో పాటు మత వాదం తలెత్తడం ఒకవైపు, ఊహ తీతంగా సైన్స్ అభివృద్ధి చెంది సమాజరూపు రేఖల్ని మార్చేయ డం మరోవైపు ఈ కాలంలోనే జరిగింది.

ఈ దశలో 2002 లో కొందరు నాయకులు జెవివికి దూరమయ్యారు. చెకుముకి పత్రికను నడపడం, ఎనిమిది తొమ్మిది లక్షల మందికి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రతి సంవత్సరం నిర్వహించడం, జాతీయస్థాయిలో AIPSNలో కొనసాగటం, చేప మందు పై మూడేళ్ల పోరాటం లాంటివి ఆ కాలంలో చెప్పుకోదగ్గవి.

అలాగే అనంతపురం జిల్లాలో అంబలి కేంద్రాల నిర్వహణ కూడా. ఒక్క జెవివి మాత్రమే ఇలాంటి కార్యక్రమాలను చేపట్ట గలదని అందరూ దీని చుట్టూ సమీకృతులయ్యారు. దాదాపు జిల్లాలోని మధ్యతరగతి బుద్ధి జీవులందరూ ఒక ఉద్యమం చుట్టూ చేరడం ఈ జిల్లాలోనే సాధ్యమైంది. అలాగే "నెల్లూరు పిల్లోళ్ల కథలు" కూడా పెద్ద ప్రయత్నం. సృజనోత్సవం, 2006లో నేషనల్ సైన్సు అవార్డు, దేశమును ప్రేమించుమన్నా క్యాలెండర్, ఆడపిల్ల దేశానికి గర్వకారణం, తిరుపతిలో ఐన్ స్టీన్ విగ్రహ స్థాపన లాంటివి ఈ కాలంలో చేపట్టిన పెద్దపెద్ద కార్యక్రమాలు. పాపులర్ కార్యక్రమాలు.

రాష్ట్రం విడిపోవడంతో సైన్సు ఉద్యమం కూడా తప్పనిసరై వేరువేరుగా పనిచేయాల్సి వచ్చింది. అయినా చెకుముకి నిర్వహణ, సైన్స్ టీచర్ల శిక్షణ, ప్రచురణలు లాంటివి ఇప్పటికీ ఉమ్మడిగానే జరుగుతున్నాయి. ఈ ఐక్యత కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ప్రభుత్వంతో కలిసి పనిచేయడం కూడా బాగా తగ్గిపోయింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడంతో, ప్రాంతీయ పార్టీలకు నిరంకుశ ప్రభుత్వాల్ని నడపడం ఆనవాయితీగా మారడంతో, ప్రభుత్వ విద్యారంగం మరీ నిర్వీర్యమైపోవడంతో, సామాజిక మాధ్యమాలు తెర మీదకి రావడంతో జనవిజ్ఞాన వేదిక కూడా దీనికి తగ్గట్లుగా రూపాంతరం చెందడం తప్పనిసరి అవుతోంది. గ్రామ స్థాయి దాకా పనిచేయగల స్వభావాన్ని క్రమంగా పోగొట్టుకుంటోంది. అస్తిత్వ ధోరణులు, వినిమయ సంస్కృతి, మత మితవాదాలు, తిరోగామి భావజాలం ప్రజాస్వామ్య సంస్కృతికి అవరోధాలుగా మారిన ప్రస్తుత వాతావరణంలో ఒక వైపు ప్రజాసైన్స్ ఉద్యమ ఆవశ్యకత గతం కన్నా ఎంతో పెరిగింది. మరోవైపు పనిచేయడం క్లిష్టంగా కూడా మారింది. అయినప్పటికి విస్తృత సంబం ధాల్ని అలాగే కొనసాగించుకోగల్గడం, యువతరం జెవివి వైపుకు రావడం, సమాజంలో ఎక్కువ మందికి ఆమోదయోగ్య సంస్థగా ఇప్పటికీ గుర్తింపు ఉండటం రాష్ట్రంలో సైన్సు ఉద్యమానికి గల గొప్ప సానుకూలాంశాలు. ❋

### 80 ఏళ్ల బెర్లిన్ పతనం అనంతరం

# యూరప్‌లో మళ్లీ ఫాసిస్టుల సవాళ్లు

(16వ పేజీ తరువాయి)

యుద్ధం" అని రంకెలె వేస్తున్నాయి. తాము ప్రపంచంలోని అత్యున్నత నైతిక శక్తిగాను, ఆ విలువలన్నింటిని కాపాడే అపారమైన కూటమిగానూ మనకు చెబుతున్నాయి. అందుకే ఆ దేశాలు మనల్ని కూడా ఉత్సాహపూరితంగా, ఆనందకరంగా తమతోపాటు యుద్ధంలోకి నడవమంటున్నాయి. తమ 'విలువలను' ఆమోదించని శత్రువులపై యుద్ధానికి రారమ్మంటున్నాయి.

యూరపు ఖండపు ప్రస్తుత నాయకులు – జర్మనీ కొత్త ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ నుండి యూరోపియన్ యూనియన్ కమీషనర్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ వరకు ప్రతి ఒక్కరూ యూరప్ ఖండానికి ప్రథమ శత్రువు ఎవరూ అంటే వ్లాదిమీర్ పుతిన్ కంటే పెద్ద శత్రువు ఎవరూ లేరు అంటున్నారు. ప్రపంచ శాంతికీ, మానవాళికీ ఉక్రైన్ యుద్ధానికి మించిన ప్రమాదం మరోటి లేదంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం తరువాత అసలు ప్రపచమే లేని అంటున్నారు. మే 9న రష్యా తన 80వ విజయోత్సవ దినాన్ని జరుపుకుంటున్నది. రెడ్ స్క్వేర్‌పై వినిపించే ఏ గీతం కూడా ఉక్రెయిన్‌కు జరిగే న్యాయాన్ని ఆవలేదని అని వాన్ డెర్ లేయెన్ ప్రకటించారు. "ఉక్రెయిన్‌కు న్యాయం జరగబోతున్నది" అని అమె అన్నారు.

**రష్యా మినహాయింపు**

బెర్లిన్‌లో యూరప్ వ్యాపిత ప్రధానమైన 80వ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. యూరప్ నేతల్లో నెలకొని ఉన్న పై ఆలోచనా విధానం ఫలితంగా ఆ కార్యక్రమం నుండి రష్యాను మినహాయించారు. ఆ వ్యతిరేకత మూలంగా పాలకుల మనసుల మనసుల్లోకీ, వారి అనుంగు మీడియాలోకీ ఈ క్రింది వాస్తవాలు చొచ్చుకుపోయే అవకాశం లేదు. గత సోవియట్ యూనియన్ వారసత్వ దేశమైన వర్తమాన రష్యా నాటి ఎర్రసైన్యానికి కూడా వారసురాలే. రెండవ ప్రపంచ యుద్ధంలో తిరుగులేని నిర్ణయాత్మక విజయం సాధించింది రష్యానే. ఆ యుద్ధంలో మరణించిన (యుద్ధంలో మరణించిన సైనికులు, ఫాసిస్టుల క్రూరత్వానికి బలైన వారు, ఆకలితో అలమటిస్తూ మరణించిన లేదా ఊచకోతకు గురైన పౌరులు) వారు ఒక బ్రహ్మాండమైన రక్త తర్పణాన్ని గావించిన త్యాగధనులుగా వర్ధిల్లుతారు. ఆ త్యాగం ఒక మానవ గణనకు, మన గ్రహణశక్తులకు అతీతమైనది. విజయోత్సవాలకు రాకుండా రష్యాను విమనహాయించడం ద్వారా యూరోపియన్ నాయకులు అపూర్వమైన పై త్యాగాలన్నింటినీ గాలిలో కలిపేశారు..

సత్యం ఎల్లప్పుడూ అసౌకర్యమైన క్షణాల్లో బైటపడుతుందంటారు. అదే విధంగా చరిత్రలోని వక్రీకరణలు, మోసాలు విరక్తి కల్గించే గత కాలపు అవకతవకలు అన్నీ వాస్తవాన్ని తలపై మోసుకు వచ్చే భాషను ఆశ్రయిస్తాయి.

అది 2025 మే 8వ తేదీ ఉదయం: ఫ్రాన్స్ ప్రధాన స్రవంతి మీడియా ఛానళ్లన్నీ యూరప్ లోని తన సహచర మీడియా ఛానల్ల మాదిరిగానే యుద్ధ నాదాలు (సారీ, విజయోత్సవ ప్రకటనలు) చేస్తున్నాయి. వాటిలో ఒకటి బియఫ్‌యం టివి ఛానల్ . ఆ ఛానల్ కొందరు అతిథులను ఆహ్వానించింది. ఆ అతిథుల్లో లియోన్ నగరానికి చెందిన న్యాయవాది అలైన్ జకుబోవిచ్ కూడా ఉన్నారు. అతను అనేక సంవత్సరాలుగా యల్ఐసిఆర్ఎ (జాత్యాహంకార వ్యతిరేక, సెమిటిజం వ్యతరేక అంతర్జాతీయ లీగ్) అధ్యక్షుడిగా పనిచేశాడు. ఇది ప్రధానంగా ఫ్రెంచి జాత్యాహంకార వ్యతిరేక సంస్థ.

టివీలో జకుబోవిచ్ లక్షలాది ప్రేక్షకుల ముందు నిలిచి ఉపన్యాసం ప్రారంభించాడు. ఆయన ఫ్రాన్స్‌లోని ప్రధాన వామపక్ష సంస్థ 'లా ఫ్రాన్స్ ఇన్సౌమిస్'ను ఒక 'ఫాసిస్టు ఉద్యమం' అని తెగనాడాడు. ఆ సంస్థ నాయకుడు జీన్ –'లూక్ మెలెన్‌చోన్'ను హిట్లర్ ప్రచారకర్త 'జోసెఫ్ గోబెల్స్'తో పోల్చాడు. ఈ అపవాదు వీక్షకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రేక్షకులందరూ మౌనందాల్చివిన్నారు. తర్వాత మాత్రమే వారు తమ ఆందోళనను, నిరాకరణలను వ్యక్తంచేయగల్గారు. మెలెన్‌చోన్ చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాడు.

మళ్లీ ఈనాడు ఫాసిస్టులు, వారి సహచరులు వాస్తవ ప్రపంచంలోకీ, నిజమైన జీవనంలో ప్రవేశించారు. వారు ఫాసిజంపై విజయదినోత్సవం వేడుకల్లో పాల్గొంటున్నారు. లండన్ వేడుకల సందర్భంగా జరిగిన బ్రిటన్ సైనిక కవాతులో ఉక్రైన్ సైనిక పటాలాన్ని కూడా చేర్చారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఉక్రైన్ మురికి రికార్డును మూటగట్టుకుంది. ఫాసిస్టు శక్తులతో, వారి సైన్యంతో చేతులు కలిపి అపఖ్యాతి పాలైన అవోజ్ బ్రిగేడ్ నేటి సంయుక్త విన్యాసాల్లో పాల్గొంది. ఈ అంశాలపై గతం గుర్తున్నవారందరూ షాక్‌కు గురైనారు. బ్రిటన్ ఈ విధంగా ఫాసిస్టు శక్తులతో బహిరంగంగా చేతులు కలపడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు.

సి9యం, 1994లో స్థాపించబడిన ఒక ఫాసిస్టు సంస్థ. ఆ సంస్థకు చెందిన నయా–నాజీలు మే 10న ప్యారిస్‌లో జరుగే వారి వార్షిక ప్రదర్శనలో తమ మిలిటరీ కండబలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమైనారు. ఇంటర్‌నెట్‌లో వెతికితే వారి 1000 మందితో కూడిన సైనికపటాలం దర్శనమిస్తుంది. పోలీస్ రక్షణలో సాహస యువతులు, తరచూ ముసుగు పురుషులూ రాజధాని వీధుల్లో విన్యాసాలుచేస్తున్న దృశ్యాలు మనకు దర్శనమిస్తాయి.

మళ్లీ లండన్‌లో పరిణామాలకు వస్తే.... మే 9న పాలస్తీనాకు మద్దతుగా లండన్‌ల యూదు దురంహకార వ్యతిరేక ప్రదర్శన నిర్వహించాలని యూదు మతస్తులే నిర్ణయించారు. అయితే ఆ ప్రదర్శనకు లండన్ పోలీసులు అనమతించలేదు. అండన్‌లో ఒక ప్రాంతంలోకి యూదా మతస్తుల ప్రవేశాన్ని నిషేధించడం అనేది 80 సంవత్సరాల క్రితం ఎవరైనా ఊహించివుంటారా?

అలాంటిదే పాలస్తీనా విషయంలో కూడా జరుగుతోంది. గాజాలో మన కళ్ల ముందు జరుగుతున్న హింసాకాండను విస్మరించడానికీ, అక్కడి అకృత్యాలను ఏపరిస్థితుల్లోనూ వెలుగులోకి రాకుండా నిరోధించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎలాన్ మిగ్రాహి ఇజ్రాయిలీ జాతీయుడు. జియోనిస్టు వ్యతిరేకి. స్థిర చిత్తంగలవాడు. పాలస్తీనా ప్రజల తిరుగులేని మద్దతుదారుడు. భూమండలంపై మనలాంటి లక్షలాదిమంది పంచుకోగల భావాలను వ్యక్తంచేసే పదాలను అనర్గళంగా ప్రయోగించగల మాంత్రికుడు. మే 8 విజయోత్సవాన్ని ఉద్దేశించి అతడు ఇలా వ్యాఖ్యానించాడు: "20 లక్షల మంది ప్రజలను మన కళ్ల ముందే నాశనం చేస్తుంటే, ఆకలితో చంపేస్తుంటే ఈ అకృత్యాలకు అంతర్జాతీయ మద్దతు లభిస్తుంటే..... రెండవ ప్రపంచ యుద్ధం ముగిసివుండవచ్చు. కానీ నాజీయిజం మాత్రం ఓడిపోలేదు."

(అనువాదం: వై సిద్ధయ్య)

# గరికపాటి రాజారావు

**(2వ పేజీ తరువాయి)**

22 సంవత్సరాల వయసులో 1937 లో మద్రాసులో ఎల్ ఐ ఎం అనే ఐదు సంవత్సరాల వైద్య వృత్తి కోర్సులో చేరాడు. అది ఎంబిబిఎస్ కు సమానమైన కోర్సే. డాక్టర్ గా చదువుకుంటూ నే నాటకాలు వేయటం, నాటక సమాజాలు ఏర్పాటు చేయటం, టికెట్ నాటకాలు వేయటం, అలా నాటకాలు వేసి ,టికెట్లు అమ్మడం ద్వారా వచ్చిన డబ్బులతో తరువాత నాటకానికి సిద్ధమవుటం లేక బహుమతులు వచ్చిన వారికి బహుమతి ఇవ్వటానికి ఆ డబ్బు వెచ్చిస్తూ ఉండేవారు. ఆయన చదువుతూ ఉండిన ఎల్ఐఎం కోర్సులోని విద్యార్థులతో కలిసి రాజారావు గారు చాలా నాటకాలు వేశారు. గొల్లపల్లి నారాయణమూర్తి గారు రాసిన "విడాకులు", అలాగే "షాజహాన్" అనే నాటకం, రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన ''బలిదానం'', గాలి బాలసుందర్రావు రాసిన ''అపోహ'', భమిడిపాటి కామేశ్వరరావు రాసిన "బాగు బాగు"ఇలాంటి నాటకాలన్నీ వేసేవారు. అలానే రాజారావు గారు ''పశ్చాత్తాపం'' అనే నాటకాన్ని రాసి ప్రదర్శిం చారు. ఈ నాటక ప్రదర్శనలతో ఆయనకు సమర్థవంతమైన నిర్వాహకుడిగా కూడా పేరు సంపాదించారు. 1937 ప్రాంతంలో మహాత్మా గాంధీ యొక్క ప్రభావ స్వాతంత్రోద్యమం మీద తీవ్రంగా ఉండింది అనేకమంది యువతీ యువకులు పాల్గొంటున్నారు. అలాంటి రోజుల్లో రాజారావు గారు తన కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ కు లీడర్ గా పనిచేయటం, సైన్సు క్లబ్ కు సెక్రటరీగా పని చేయడం లాంటివి నిర్వహించేవాడు. ఆ రోజుల్లో ఆయన విద్యార్థులకు ఒక క్రేజీ లీడర్ గా పేరు తెచ్చుకున్నాడు.

డాక్టర్ రాజారావు గారికి ఇద్దరు సహచర విద్యార్థులు ఉండేవారు ఒక ఆయన పేరు డాక్టర్ రామచంద్ర రెడ్డి, ఈయన ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య గారి తమ్ముడు. ఇంకొక సహధ్యాయి డాక్టర్ రామదాసు. ఈ రామదాసు గారి అన్నయ్య గారు సి.వి రంగనాథ దాసు గారు ఈయన తర్వాతి కాలంలో "సంసారం" ''సంతానం'' లాంటి సినిమాలు తీశారు. రామచంద్ర రెడ్డి గారు, రామదాసు గారు, రాజారావు గారు వీరి ముగ్గురిని డాక్టర్ త్రయం అని అంటుండేవారు అక్కడి వాళ్లంతా. డాక్టర్ రామచంద్ర రెడ్డి గారి ద్వారా వాళ్ళ అన్నయ్య పుచ్చలపల్లి సుందరయ్య గారితోటి పరిచయం ఏర్పడింది. దానితో ఆయనలో మార్క్సిస్టు భావాలు బాగా నాటుకున్నాయి. తర్వాత రోజుల్లో ఆయన డాక్టర్ వృత్తి చేస్తూ నాటకాలు వేస్తూ ఉద్యమాలు నిర్మిస్తూ అలా ఆయన జీవితం సాగిపోయింది. ఏమాత్రం తీరిక లేకుండా ఒకవైపు చదువుల్లో రాణిస్తూ, ఉద్యమాల్లో పాల్గొంటూ 1942లో ఆయన ఎల్ఐఎం కోర్సు పూర్తి చేశారు. దాదాపు అదే రోజుల్లో వాళ్ళ నాన్నగారు మరణించడంతో వాళ్ళ అమ్మగారు మిగతా పిల్లలు అందరూ రాజమండ్రి కి వచ్చేశారు. కమ్యూనిస్టు పార్టీతో ఆయనకున్న అనుబంధం వలన ఆ పార్టీ యొక్క సూచనల మేరకు విజయవాడ దగ్గరలో పెనమలూరు, పోరంకి, మొగల్రాజపురం ప్రాంతాలలో "ప్రజా వైద్యశాల"ను ఏర్పాటు చేసి వైద్యం చేయటం ఆరంభించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుడిగా ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఆయనకి ప్రజా వైద్యుడిగా మంచి పేరు వచ్చింది. ఆయన ఇంటి ముందు రోగులు బారులు తీరి నిలబడేవారు. ఫీజు ఇవ్వలేని పేదలకు ఉచితంగా వైద్యం చేయటమే కాకుండా మందులు పండ్లు తానే కొని ఇచ్చివాళ్లను ఆదుకునేవాడు. ఆయన డబ్బు సంపాదనకు ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చేవాడు కాదు. ఎంతసేపు ఆయన ప్రజా సేవ చేస్తున్నాను అని అనుకునేవారు. ఒకానొక సందర్భంలో ఆయన భార్యకు ఆపరేషన్ జరుగుతూ ఉన్నది. ఎవరో రిక్షా కార్మికుడు బయట బిగ్గర గా ఏడుస్తున్నాడు. విషయం ఏమిటో తెలుసుకురమ్మని నర్సుని పంపించారు డాక్టర్ రాజారావు గారు. రిక్షా కార్మికుడి భార్య కు ప్రాణం మీదకు వచ్చింది బాధతో విలవిలాడుతున్నది అని తెలిసింది. తన భార్య కేసును వేరే డాక్టర్కు అప్పజెప్పి తాను వెళ్లి ఆ రిక్షా కార్మికుడి భార్యను ప్రాణాపాయం నుండి కాపాడాడు. వైద్య వృత్తి ఎడల అంతటి నిబద్ధత కలిగిన ప్రజా వైద్యుడు డాక్టర్ రాజారావు గారు. నాటకాలలోనూ నటనలోనూ అనుభవం ఉన్న డాక్టర్ రాజారావు గారు ఆయన ప్రజా వైద్యశాల పెట్టి పనిచేస్తున్న చుట్టుపక్కల ప్రాంతాల్లోని పిల్లలను, యువకులను చేరదీసి నాటకాల్లో శిక్షణ ఇవ్వటం, యువజన సంఘాలు లో పాల్గొనేట్లుగా ప్రోత్సహించి యువజన సంఘాల నిర్మాణం చేయటం ఇలాంటి పనులు చేసేవారు. ఇదంతా 1942లో. 1943 మే 25 26 తారీకుల్లో బొంబాయిలో భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరిగాయి. ఆ ఆ మహాసభలోనే కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా సాంస్కృతిక సంస్థలను ప్రారంభించాలి అనే ప్రతిపాదన వచ్చి ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) ను ప్రారంభించారు. బొంబాయిలో ఆ సంస్థలో ముఖ్యమైన సభ్యుల్లో ప్రఖ్యాత నటులు పృథ్వీరాజ్ కపూర్, ముల్కీరాజ్ ఆనంద్, బలరాం సహాని లాంటి వారు ఉండేవారు. ఆ సాంస్కృతిక కార్యక్రమాలలో ఆంధ్ర దేశం నుండి ముక్కామల నాగభూషణం గారి నాయకత్వంలో రాజారావు గారు అనేక సాంస్కృతిక దళాలను తీసుకొని వెళ్లారు. వాళ్లు ప్రదర్శించిన కళారూపాలు బెంగాల్ నుండి వచ్చిన కళారూపాలు కు దీటుగా ప్రదర్శనలు ఇచ్చారు. కళా ప్రదర్శనల లో బెంగాలీ వాళ్ళు 10 సంవత్సరాలు ముందుండేవాళ్ళు. వాళ్లకు పోటీగా ధీటుగా ఆంధ్రదేశం నుండి వెళ్లిన కళాకారుల ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక సంస్థ %ఇప్టా% లో కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ రాజారావు గారిని ఎన్నుకున్నారు. దానికి అనుబంధంగా ప్రతి రాష్ట్రంలోనూ ప్రజానాట్య మండళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ నిర్ణయంలోని భాగంగానే తెలుగు నేలపై పురుడు పోసుకునీ, సాంస్కృతిక రంగంలో ప్రభంజనాలు సృష్టించిన, ప్రజా కళా యుద్ధనౌక ప్రజానాట్యమండలి. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కోసం అని ఎలిగెత్తి చాటుతూ ఆ మార్గంలో శ్రమిస్తూ, ఉపక్రమిస్తూ, జనం గుండె లోతుల్లో రెపరెప లాడుతున్న క్రాంతి కేతనం ప్రజానాట్యమండలి. వర్గ రహిత సమాజాన కళ కోసం కళావాదం, కలవారికి అంకితం, కళావనికే కళంకం. జన ప్రయోజనం గమ్యం, సృజన కళా ప్రభంజనం, చైతన్యమే మాసాధన, విప్లవమే మాధ్యేయం అను సజీవ సాంస్కృతిక సిద్ధాంతాన్ని మానవజాతి ముంగిట్లో ఆవిష్కరించిన మహా సంస్థ ప్రజానాట్యమండలి. ఆ మహాసంస్థ క్రాంతికేతనం, ఆ ప్రజా కళా యుద్ధ నౌక అయిన ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడే మన డాక్టర్ గరికపాటి రాజారావు. 1943 నుండి 6 సంవత్సరాల వరకు రాజారావు గారి రంగస్థలం జీవితంలో స్వర్ణ యుగం ప్రారంభమైందని చెప్పవచ్చు. సాంస్కృతిక శిబిరాలు, కల్చరల్ ఫ్యాన్స్ లాంటి వాటిని ఏర్పాటు చేసి నిర్వహించి కళాకారులకు శిక్షణ ఇస్తుండేవారు. కేవలం నాటకాలే కాకుండా

ప్రాచీన కళారూపాలు బుర్రకథ, వీధి భాగవతం, జముకుల కథ, కోలాటం, పిట్టలదొర ఇలాంటి వాటిని కూడా వెలికి తీసి ప్రోత్సహించి ఆధునీకరించడమే కాకుండా ఆ కళను కేవలం కళ కోసమే కాకుండా వాటి ద్వారా దేశభక్తిని ఎలా ప్రబోధించవచ్చు అనే కోణంలో వాటిని ఆధునీకరించి మార్పులు చేసి వాటి ద్వారా దేశభక్తి ప్రభోధిస్తూ కార్యక్రమాలు రూపొందించేవారు. ఆయనతో పాటు పనిచేసిన వారిలో ముఖ్యులు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు. తరువాత ఆయన వివిధ సినిమాల్లో నటించారు. రాజారావు గారు ఈ ఆరు సంవత్సరాల్లో దాదాపు నాలుగు వందల కు పైగా సాంస్కృతిక దళాలను తెలుగు నాట ఏర్పరిచారు. అన్ని జిల్లాల్లోనూ పట్టణాల్లోనూ ప్రదర్శనలు ఇస్తూ వచ్చారు. హైస్కూల్లో ఉండగా చూసినటువంటి జానపద నృత్యాలు, హరికథ లాంటి వాటిని గమనించి ఆయన లయబద్ధంగా నృత్యం చేసేవారు అని అనుకున్నాం కదా! ఆ కళారూపాలను కూడా రంగస్థలం మీద ఆయన ప్రదర్శిస్తూ ఉండేవారు. "హిట్లర్ వీధి బాగోతం" అని ఒక నాటకం వేసేటప్పుడు చట్ట చివరలో హిట్లర్ హతమార్చినట్లుగా ఒక సైనికుడు ఎవరో కత్తి సుత్తి పట్టి ఎర్రసైనికుడిలా వచ్చి ఆయన ఉగ్ర నృత్యం చేస్తుంటే ప్రేక్షకులు ఆవేశంతో ఊగిపోయేవారు. అలాగే ఒక ప్రెస్ వర్కర్ యొక్క జీవితం ఎలా ఉంటుందో దానిని నృత్య నాటకం ద్వారా ప్రెస్ వర్కర్ల దయనీయ స్థితులను ప్రదర్శించేవారు. అలాగే పాములు నృత్యం ఒకటి ఆయనకు చాలా ప్రసిద్ధి చెందిన ప్రక్రియ. పాములు పట్టి నృత్యం చేస్తూ బూరను ఊదటం, పాముల్ని పట్టి బుట్టలో పెట్టి వాటిని ఆడించడం, పాము కాటేసినప్పుడు విషయం తలకెక్కి ఆయన కళు ్ళ తిరిగి పడిపోవడం, మళ్లీ ఆ విషానికి విరుగుడుతో బయటపడటం ఇలాంటివన్నీ ఆయన నృత్య రూపంలో ప్రదర్శించేవారు. రాజమండ్రిలో వైద్యం ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఆయన మున్సిపల్ కౌన్సిలర్ గా కూడా పోటీ చేశారు. ఆయన గుర్తు "గొడుగు". కోర్టు సూటు ధరించి, గొడుగు వేసుకుని ఆయన రోడ్డు మీద వెళుతూ ప్రచారం కోసం నాట్యం చేస్తూ వెళ్లిన రోజులను కూడా ఆనాటి ప్రజలు చెప్పుకునే వాళ్ళు. డాక్టర్ గారు ఇలా నృత్యం చేస్తూ ప్రచారం చేస్తూ వెళ్లారని కౌన్సిలర్ గా కూడా గెలిచారని చెబుతూ ఉంటారు.ఆ రోజుల్లో ఎలా ఉండేదంటే ఆయన యొక్క జీవితం వేదిక ఎక్కితే నట విశ్వరూపం, వేదిక వెనకాల నట శిక్షణ శిబిరం, పగలంతా ప్రజా వైద్యాలయం అన్నట్లుగా ఆయన జీవితాన్ని గడిపారు 1943 నుండి 49 వరకు. అంతేకాకుండా ఏకపాత్రాభినయాలు రాసి వాటిని కూడా ఆయన ప్రదర్శించేవారు. 1946 ప్రాంతంలో ఆచార్య ఆత్రేయ గారితో "పరివర్తన" అనే నాటకాన్ని రాయించి మద్రాసు తీసుకెళ్లి అక్కడ "వాణి మహల్లో" ప్రదర్శింపజేసి మద్రాసులో ఉన్నటువంటి ప్రముఖుల అందరికీ కూడా ఆత్రేయ గారిని పరిచయం చేసింది డాక్టర్ రాజారావు గారే. 1944లో రాజమండ్రిలో చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులు గారికి సన్మానం జరిగినప్పుడు కన్యాశుల్కం నాటకం వేసి అందులో గిరీశం పాత్ర పోషించాడు డాక్టర్ రాజారావు గారు. 1947 భారతదేశానికి స్వతంత్రం వచ్చే నాటికి తెలంగాణలో నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం కొనసాగుతున్నది. ఆ పోరాటం మహోధృతంగా జరుగుతున్న రోజుల్లో సుంకర సత్యనారాయణ గారు వాసిరెడ్డి భాస్కర్ రావు గారు కలిసి రచించిన "మా భూమి" అనే నాటకాన్ని అనేక చోట్ల ప్రదర్శించారు అది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మరింత ప్రోత్సాహం ఇచ్చింది. ఆ నాటకం తెలుగు నాట పెను సంచలనానికి దారి తీసింది. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రదేశమంతటా దాదాపు 200 దళాలు డాక్టర్ రాజారావు గారి ఆధ్వర్యంలో వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా 20 లక్షల మందికి పైగా ప్రజలు చూశారు. ఇది ప్రపంచంలోనే ఒక రికార్డును ఆ రోజుల్లో కె ఏ అబ్బాస్ లాంటి ప్రముఖులు చెప్పారు.

1948 ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం విధించబడింది. అప్పుడు చాలామంది అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. డాక్టర్ రాజారావు గారిని అరెస్టు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య గారికి ఆశ్రయం ఇచ్చారనే అనుమానంతో అరెస్టు చేసి విజయవాడలో ''పలనియప్పన్''అనే ఒక పోలీస్ అధికారి ఒక పోలీస్ క్యాంపు తీసుకెళ్లి రాజారావు గారిని చిత్రవధలు చేశారు. ఏ కమ్యూనిస్టుకు వైద్యం చేశావు వాళ్లు ఎక్కడ ఉంటారు వాళ్ళ పేర్లు చెప్పు అలా చెప్పకపోతే నిన్నుకాల్చేస్తాం అంటూ బెదిరించారు. ఎన్ని చిత్రహింసలు పెట్టినప్పటికీ డాక్టర్ రాజారావు గారు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. పైగా ఆయన ఏమన్నారంటే నేను కమ్యూనిస్టుకు పేరు పెట్టి వైద్యం చేయలేదు నేను డాక్టర్ని వైద్య సహాయం గురించి వచ్చిన ప్రతి వారికి వైద్యం చేస్తాను నేను. అందులో కమ్యూనిస్టులు ఎవరో కాంగ్రెస్ వారు ఎవరు సోషలిస్టులు ఎవరో నాకు ఎలా తెలుస్తుంది. నాది వైద్యవృత్తి నా వృత్తిలో కులమత రాజకీయాలకు తావులేదు ఎవరు వచ్చినా వారికి వైద్యసేవ అందిస్తాను అని పోలీసులకు దీటుగా సమాధానం చెప్పాడు డాక్టర్ రాజారావు గారు. వాళ్లు కొట్టారు హింసించారు కానీ చివరకు ఆయన దగ్గర నుంచి ఎటువంటి సమాచారం రాబట్ట లేకపోయేసరికి అతని విడుదల చేశారు. విచిత్రము ఏమంటే అలా చిత్రహింసలు గురి చేసిన పలనియప్పన్ ఆయన కుటుంబ సభ్యులు ఆ తరువాత ఆయన చేతనే వైద్యం చేయించుకున్నారు. అదే రోజుల్లో తెలంగాణలో జరుగుతున్న రైతాంగ సాయిధ పోరాట గెరిల్లా కమ్యూనిస్టు యోధుల కు, అజ్ఞాతంలో ఉండి వారికి వైద్యం చేస్తూ ఉండేవాడు. 1947 – 49 ప్రాంతాల్లో సాయుధ పోరాటం ముగిసి కమ్యూనిస్టులు మీద నిర్బంధం కొంచెం కొంచెంగా తగ్గుతున్న రోజుల్లో డాక్టర్ రాజారావు గారు రాజమండ్రిలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఇది 1949 – 50 ప్రాంతాల్లో రాజమండ్రిలో ఆయన వైద్యుడిగా మళ్లీ వైద్యవృత్తి ప్రారంభించినప్పుడు, నెలకు రెండు రూపాయలు చొప్పున తీసు కునే వాడట. ఆ రెండు రూపాయలతో నెల అంతా ఉచితంగా వైద్యం చేసేవారు. అప్పటికి ప్రజానాట్యం మండలి మీద నిషేధం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అందువలన ప్రజానాట్యమండలి కళాకారులు అనేకమంది మద్రాసులో ఏదైనా సినిమాలలో వేషం దొరుకుతుందని లేదా వివిధ రంగాలలో పనిచేయటానికి వెళ్లారు. దానితో నాటకాల్లో మంచి అనుభవం ఉన్న రాజారావు గారు కూడా మద్రాస్ వెళ్లి ఒక సినిమాను నిర్మించాలని తలపెట్టారు. దానికి డాక్టర్ రామచంద్రారెడ్డి గారు పెట్టుబడి పెడతానని సినిమా తీయమని ప్రోత్సహించారు. 1950 ప్రాంతాల్లో రాజారావు గారు మద్రాస్ వెళ్లి ''పుట్టిల్లు''అనే సినిమాను తీయటం ప్రారంభించారు. కథ, నిర్మాణం, దర్శకత్వం, హీరో అన్నీ కూడా రాజారావు గారే. ఆ సినిమా ద్వారానే మొదటిసారిగా జమున, అల్లు రామలింగయ్య లాంటి వాళ్ళను ఆ సినిమా ద్వారాపరిచయం చేశారు రాజారావు గారు. అంతేకాదు ప్రజానాట్యమండలిలో పనిచేసిన అనేక మంది కళాకారులు లక్ష్మీ నరసయ్య, పెరుమాళ్ళు, కోడూరి అచ్చయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రామకోటి, బుర్రకథ నాజర్, చదలవాడ కుటుంబరావు, టీ. చలపతిరావు వంటి సంగీత దర్శకుడు ఆ సినిమా ద్వారానే సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. ఆ సినిమా

ఇంకా కొద్ది కాలంలో పూర్తవుతుంది అనగా, అదే సమయంలో ప్రత్యేకరాష్ట్రం కోసం ఆమరణనిరాహారదీక్ష చేస్తున్న పొట్టి శ్రీరాములు మరణించారు. తాను అప్పుగా తీసుకున్న డబ్బును సినిమా పూర్తి చేయటానికి కాకుండా మరణించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు మీద "పూర్ణాహుతి" అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించి అన్ని థియేటర్లలోకి విడుదల చేశారు. అలా

ఆయన దేశభక్తిని అనేక సందర్భాల్లో ప్రదర్శించుకున్నారు. తను తీస్తున్న "పుట్టిల్లు" సినిమా నిర్మాణం పూర్తి చేశారు. అది విడుదలయ్యింది. కానీ ఆ సినిమా ఫ్లాప్ అయింది. కోలుకోలేని దెబ్బతీసింది రాజారావు గారిని. మరల రాజారావు గారు తన కుటుంబంతో సహా మద్రాసు నుండి రాజమండ్రికి వచ్చి వైద్య వృత్తి కొనసాగించారు. నాటక రంగాన్ని వదిలిపెట్టి ఉండలేరు కనుక ఆయనే సొంతంగా "రాఘవ కళా సమితి" అనే దాన్ని మిత్రులతో కలిసి ప్రారంభించి ఎప్పటిలాగానే నాటకాలు వేయటం, యువకులకు నటనలో శిక్షణ ఇవ్వటం కొనసాగించారు. అక్కడే ఆయనకు చాలా దగ్గర అయినటువంటి శిష్యుడు కాకరాలగారు. తర్వాత రోజుల్లో ఆయన అనేక సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించారు. అది 1954 నుండి 59 వరకు. 1956 57 ప్రాంతాల్లో రాజమండ్రిలో ఆయన ప్రదర్శనలిస్తున్నప్పుడు వరంగల్లు నుంచి మిమిక్రీ ఆర్టిస్టు వేణుమాధవ్ గారిని పిలిపించి ఆయనతో ప్రదర్శనలు ఇప్పించారు. 1957 లో ఢిల్లీలో జరిగిన ఇప్టా ఉత్సవాలకు విజయనగరం నుండి జాలరి నృత్యం చేసే సంపత్ కుమార్ గారిని, భరత నాట్యం చేసే కోరాడ నరసింహారావు గారిని తీసుకువెళ్లి వాళ్ళ ప్రతిభను దేశం అంత తెలిసే లాగా చేశారు. ఇతర మిత్రుల ప్రోత్సాహంతో మరల సినిమా తీయటానికి అని మద్రాసు వెళ్లారు కానీ ఆ ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. మద్రాస్ లో ఉండగా "నాగార్జున పాలి క్లినిక్" అనేదాన్ని ప్రారంభించి వైద్య వృత్తి కొనసాగించారు. అక్కడ ఆయనకు వీకేఆర్ జయంతి అనే మరో వ్యక్తి పరిచయమయ్యారు. ఆయన నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కాంట్రాక్టర్ .కళాభిమాని. మద్రాసులో ఉండగా రాజారావు గారు చైర్మన్ అనే నాటకాన్ని తయారు చేసి, తెనాలి నుంచి వచ్చిన ఒక కుర్రాడుతో ఆ నాటకాన్ని ప్రదర్శింపజేశాడు. ఆ కుర్రాడు ఎవరో కాదు తర్వాత సినిమాలలో "సూపర్ స్టార్" గ పేరొందిన "కృష్ణ" గారు. తర్వాత అల్లూరి సీతారామరాజు నాటకం రాసిన పడాల రామారావు గారు, ఆ నాటకాన్ని సరిదిద్దటం కానీ మరింత సమాచారాన్ని సేకరించి దానికి పూర్తి రూపం ఇవ్వడంలో గాని రాజారావు గారు చాలా సాయపడ్డారు. ఆ నాటకంలో రాజారావు గారు రూథర్ ఫర్డ్ పాత్ర వేసి అందరి మన్నలను పొందాడు. రాజారావు గారు రెండు మూడు సినిమాల్లో కూడా నటించారు. ''ఆరాధన'', ''బొబ్బిలి యుద్ధం"లాంటి సినిమాల్లో చిన్నచిన్న పాత్రలు వేశారు. రాజారావు గారు పరిచయం చేసిన జమున ఈ బొబ్బిలి యుద్ధం సినిమాలో ప్రధాన నాయక పాత్ర . చిత్ర సీమ ఎంత విచిత్రమైనదో చూడండి. 1961 లో "జై భవాని" అనే మరాఠీ నాటకాన్ని ఎవరో అనువదిస్తే దాన్ని తెలుగులో సిద్ధం చేశారు. ఇది దేశభక్తిని ప్రబోధించే నాటకం. ఆ రోజుల్లో ఇండియా చైనాకు యుద్ధం వచ్చింది. ఈ నాటకాన్ని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ప్రదర్శించారు. దానిలో వాణిశ్రీ గారు ప్రధాన పాత్ర పోషించారు. ఆ నాటకం ప్రదర్శించేటప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు వచ్చి 15 నిమిషాలు చూసి పోతాను అన్నారట. కానీ ఉత్కంఠ భరితంగా సాగుతున్న ఆ నాటకాన్ని ఆసాంతం చూసి దేశభక్తితో, స్ఫూర్తిదాయకంగా, ఉద్వేగ భరితంగా, ఉత్తేజ భరితంగా ఉన్నది దీనిని నేపాల్ సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులు వద్ద ప్రదర్శిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు.

1963 సంవత్సరం సెప్టెంబరు ఆరో తారీఖున ఎవరో కేంద్రమంత్రి మద్రాసు వచ్చి "జై భవాని" నాటకం గురించి విని రాజారావు గారిని పిలిపించారు. రాజారావు గారు వి కే ఆర్ జయంతి గారు, కాకరాల గారు వీళ్లందరూ కలిసి ఆ కేంద్ర మంత్రిని వెళ్లి కలిశారు. ఆయన మాట్లాడుతూ ఉండగానే అక్కడే ఆయనకు గుండెపోటు వచ్చింది. పగలంతా అలుపెరుగని వైద్య వృత్తి, రాత్రిపూట నాటకాల ప్రాక్టీసు, మరోవైపు నట శిక్షణ, తీసిన సినిమా దెబ్బతినటం ఇవన్నీ రాజారావు గారికి మానసిక ఒత్తిడిని కలుగజేశాయి. అటు నుంచి అటే రాజారావు గారిని హాస్పిటల్కు తీసుకువెళ్లారు. మొదటి రోజు వైద్యం చేశారు. రెండో రోజు కొంత తీరుకున్నారు. మూడవరోజు అంటే 1963 సెప్టెంబర్ 8వ తారీఖున వాళ్ల పిల్లలందరూ భార్యతో సహా హాస్పిటల్ కి వచ్చారు. అప్పుడు ఆయనకు వైద్యం చేస్తున్న కాంపౌండర్ తిరుపతిరావు, నర్సు ,నారాయణమ్మ సపర్యలు చేస్తున్నారు. కళ్ళు తెరిచి తన ముగ్గురు కొడుకులను చూశారు. మీరు ఇంటికి వెళ్లి స్నానం చేసి రండి అని వాళ్ళ పిల్లలతో అన్నారు. కొద్దిగా హార్లిక్స్ తాగారు. అంతలో డాక్టర్ బాలసుందర్రావు గారు వచ్చారు. ఆయన రాజారావు గారిని పరీక్ష చేస్తూ ఉండగానే రాజారావు గారికి మరొకసారి గుండెపోటు వచ్చింది. డాక్టర్ గారు ఆయన చాతి మీద కొడుతూ ఊపిరి పునరుద్ధరించడానికి ప్రయత్నం చేశారు. కానీ ఫలితం దక్కలేదు. 1963సెప్టెంబర్ 8 సాయంకాలం నాలుగు గంటల 45 నిమిషాలకు ప్రజా కళాకారుడి జీవితం గాలిలో కలిసిపోయింది. రాజారావు గారు కన్ను మూశారు. ఆయనను అభిమానించేవారు ఎందరున్నారంటే ఆయన చనిపోయినప్పుడు వచ్చిన వారిని చూస్తే తెలుస్తుంది. ఆయన బంధుమిత్రులే కాకుండా, అప్పట్లో సినిమాలలో బిజీగా గడుపుతున్న వారు ఒకప్పటి ప్రజానాట్యమండలి కళాకారులు వి మధుసూదన్ రావు గారు, తాపీ చాణిక్య గారు, తిలక్ గారు, గుత్తా రామ నీడు గారు, హేమాంబర రావు గారు, ఎల్ వి ప్రసాద్ గారు, టీవీ రమణారెడ్డి గారు, చలం గారు, రాజబాబు గారు, రాజనాల, బి.ఎన్.రెడ్డి, కె.వి చలం, రమాప్రభ, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, మిక్కిలినేని లాంటి ప్రముఖులు హాజరై ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ మరునాడు అంటే సెప్టెంబర్ 9 1963 న ఉదయం 11 గంటలకు త్యాగరాజ నగర్ లో కన్నంపేట స్మశాన వాటిక వరకు వేలాది మందితో అంతిమయాత్ర జరిగి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన సంతాప సభకు ఎన్టీ రామారావు, నాగేశ్వరరావు, జగ్గయ్య, జమునలాంటి నటీనటులు సాంకేతిక సిబ్బంది దర్శకులు హాజరై నివాళులర్పించారు. డాక్టర్ గరికపాటి రాజారావుగారు మరణించి దశాబ్దాలు గడిచినా ప్రజాకళాకారుల గుండెల్లో సదాచిరంజీవిగానిలిచిపోయారు. ఎంతోమంది ఆదర్శాలను ప్రచారం చేస్తూ ఉంటారు. ఎలా జీవించాలో చెబుతూ ఉంటారు. కానీ అతి కొద్ది మంది మాత్రమే ఆదర్శంగా నిలుస్తారు. వృత్తిని, ప్రవృత్తినికూడా ప్రజాసేవకు అంకితం చేసే మహానుభావులు చరిత్రలో చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన వారిలో అత్యంత అరుదైన వ్యక్త, ఒక మహా శక్తి, ఆదర్శ మూర్తి గరికిపాటి రాజారావుగారు. రాజారావు గారు కలలుగన్న నూతన ప్రపంచ భవన నిర్మాణం జరిగే వరకు, దోపిడీ లేని, దొరబాబు లుండని, కష్టాలు కన్నీళ్లు, ఆకలి చావులు, కులమత బేధాలు, పేద ధనిక తేడాలు లేని సోషలిస్టు సమాజం ఏర్పడే వరకు ఆయన స్ఫూర్తి కొనసాగుతూనే ఉంటుంది.

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 1 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఖాళీ కంచాలను కప్పి పెడుతున్న 'జిడిపి' ప్రచారం



ప్రపంచంలోనే 4వ స్థానానికి "ఎదిగిన" భారతీయ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో అత్యంత ధనవంతులైన 1 శాతం వాటాను తీసేస్తే మన దేశం, ఆకలి సూచీలో 100వ స్థానంలో ఉన్న నైజీరియా కన్నా, 89వ స్థానంలో ఉన్న కీన్యా కన్నా, 78వ స్థానంలో ఉన్న ఘనా కన్నా అధ్వాన్నమైన స్థానానికి దిగజారిపోతుందని విశ్లేషకుడు హార్దిక్ జోషి వెల్లడించారు. దీన్ని బట్టి మన దేశంలో పెరిగిన జిడిపి వల్ల లాభపడిందెవరో కూడా స్పష్టంగా తెలుస్తోంది. పైన అత్యధిక 1 శాతం ధనికుల జిడిపి తీసేస్తే మన దేశం 2024లో ప్రపంచ ఆకలి సూచీలో 105వ స్థానంలో ఉంటుందని జోషి లింక్డిన్ పోస్టులో తెలియజేశారు. "ఉన్నత 1 శాతం జిడిపి తీసేస్తే మన దేశం ఆఫ్రికా దేశాలతో కూడా పోల్చలేని స్థితికి వెళుతుంది. ఈ మాటలు కఠినంగా ఉన్నా అంకెలు అదే విషయాన్ని చెబుతున్నాయి" అని ఆయన చెప్పారు. ఇది అతిశయోక్తికాదు, మన దేశంలోని పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన అన్నారు.

భారత దేశ తలసరి ఆదాయం ఏడాదికి 3,000 డాలర్లు. కానీ తీవ్రమైన అసమానతలున్న దేశంలో పైన ఉన్న 1 శాతం ధనికుల వాటా జాతీయాదాయంలో 40 శాతం ఉంది. క్రింత ఉన్న 50 శాతం ప్రజలకు దక్కుతున్న జాతీయాదాయం 3 శాతం మాత్రమే. దేశంలోని 70 కోట్ల మంది ప్రజలు ఆహార కొరతతో బాధపడుతున్నారు. "మనం సంపద సృష్టించడంలో గొప్ప ప్రతిభ సంపాదించాం. ఇప్పుడు దాన్ని పంచాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఆర్థికాభివృద్ధి వల్ల జాతీయాదాయం పెరిగింది. కానీ అది అందరికీ సమానంగా అందడం లేదని గణాంకాలు తెలుపుతున్నాయి. ఇప్పటికీ దేశంలో అన్ని విధాలుగా పేదరికంలో ఉన్న వారు 16.4 శాతం ఉన్నారు. దేశంలోని కార్మికుల్లో 90 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వారి వేతనాలు తక్కువ, ఇతర సదుపాయాలు ఉండవు.

పట్టణ ప్రాంతాల్లో కొంతలో కొంత నయం అయినా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మీద ఆధారపడే ప్రజలు ఇంకా బాగా వెనుకబడే ఉన్నారు. జిడిపి వృద్ధి గురించి భారత దేశంలో చెబుతున్న విషయాలు అభివృద్ధి ఫలాలు ఎవరికి అందుతున్నాయో చెప్పడం లేదని జోషి పోస్టు తెలియజెప్పుతోంది. "ఖాళీ కంచాలను కప్పిపెట్టే జిడిపి వల్ల ఉపయోగం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇది అభివృద్ధిని విమర్శించడం కాదనీ, అందరికీ అందుతున్నదా లేదా అన్న సమస్య మాత్రమేనని ఆయన అన్నారు.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..........................................

**వీధి** ..........................................

**గ్రామం** ..........................................

**మండలం లేదా పట్టణం** ..........................................

**జిల్లా** ..........................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.